# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 4 - సంచిక 10 జూలై 2026 వెల : రూ.15

వందేమాతరం : ప్రభుత్వ విభజన రాజకీయం

విపక్ష రాజకీయాల్లో మౌలిక మార్పు ఎలా ?

నైతిక డొల్లతనం మీద విద్యార్థుల తిరుగుబాటు

కాక్రోచ్ వ్యాఖ్యల నుంచి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వరకు

'మో షా' వాషింగ్ మెషిన్ - రాజకీయాలు

నెహ్రూ, అంబేద్కర్ : దళితులు, సంస్కరణలు

ప్రజాస్వామ్యంపై దమనకాండ!

నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాష్ట్రాలకు హెచ్చరిక

దేవుడి పేరిట మనుషుల పంతాలు : వందేళ్లనాటి గురజాడ ప్రశ్న

రాహుల్ సాంకృత్యాయన్‌ను చూసి ఎవరు భయపడుతున్నారు?

అంబేద్కర్ కార్మిక సంక్షేమ దృక్పథం

జూలై - 2026

పేజీలు : 39

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 4 - సంచిక : 10

డి.వి.వి.యస్.వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..


1. సంపాదకీయం - వందేమాతరం : ప్రభుత్వ విభజన రాజకీయం 3
2. విపక్ష రాజకీయాల్లో మౌలిక మార్పు ఎలా? - యోగేంద్ర యాదవ్ 4
3. నైతిక డొల్లతనం మీద విద్యార్థుల తిరుగుబాటు - ప్రభాత్ పట్నాయక్ 6
4. కాక్రోచ్ వ్యాఖ్యల నుంచి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వరకు - మార్పు శరత్ 8
5. 'మో షా' వాషింగ్ మెషిన్ - రాజకీయాలు - ఎ.నర్సింహారెడ్డి 10
6. నెహ్రూ, అంబేద్కర్ : దళితులు, సంస్కరణలు - ప్రొ.దేవరాజు మహారాజు 14
7. ప్రజాస్వామ్యంపై దమనకాండ! ప్రొ.దేవరాజు మహారాజు 16
8. నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాష్ట్రాలకు హెచ్చరిక - కె.విజయరావు 17
9. దేవుడి పేరిట మనుషుల పంతాలు : వందేళ్లనాటి గురజాడ ప్రశ్న - మ్యాడం అభిలాష్ 19
10. రాహుల్ సాంకృత్యాయన్‌ను చూసి ఎవరు భయపడుతున్నారు? - మాలిని భట్టాచార్య 21
11. అంబేద్కర్ కార్మిక సంక్షేమ దృక్పథం - కాత్యాయనీ విద్మహే 22
12. కార్టూన్స్ 38
13. కొత్త పుస్తకాల స్వీకారం 39





కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : DVVSVARMA.COM

దారి దీపం
మాసపత్రిక
మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495



# వందేమాతరం : ప్రభుత్వ విభజన రాజకీయం

**బం**కించంద్ర చటర్జీ రాసిన వందేమాతరం గేయం సుప్రసిద్ధమైనది. స్వాతంత్ర్యోద్యమంలో వందేమాతరం నినాదం ఎందరికో స్ఫూర్తినిచ్చింది. ఈ నినాదం ఇచ్చినందుకే అనేకులు జైళ్ల పాలయ్యారు. ఆనాడే వందేమాతరం పూర్తి గేయం మీద భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. మొదటి రెండు చరణాలు దేశమాతను వర్ణించేవి కాగా మిగిలిన నాలుగు చరణాలు దుర్గా మాత స్తోత్రంగా వున్నందున అందులో లక్ష్మీ, సరస్వతులు కూడా కలగలసి వున్నందున ఈ గేయం ఒక మతానికే ప్రాతినిధ్యం వహిస్తున్నదన్న విమర్శలు వచ్చాయి. (ఉదా : ఐదవ చరణం : పది ఆయుధాలను ధరించిన దుర్గాదేవివి నీవే, పద్మముపై కొలువై ఉండే లక్ష్మీదేవివి నీవే, విద్యలను ప్రసాదించే సరస్వతీ దేవివి నీవే. స్వచ్ఛమైన, సాటిలేని ఆ కమల దళ విహారిణికి (నీకు) తలవంచి మొక్కుతున్నాను.)

ఈ నేపథ్యంలో వందేమాతరం గేయంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే పాడాలని భావించారు. నాటి నుంచి నేటి వరకు ఎలాంటి వివాదం లేకుండా అన్ని మతాలవారు, మతరహితులు దీనిని ఆలపిస్తున్నారు. రాజ్యాంగ సభలో "జనగణమన"ను జాతీయ గీతంగా ప్రకటించారు. "వందేమాతరం" కు జాతీయ గేయం హోదాను ఇచ్చారు.

రాజ్యాంగంలో పౌరుల విధుల భాగంలో "జాతీయ గీతాన్ని" మాత్రమే ప్రస్తావించారు. ఇప్పుడు అధికారం చెలాయిస్తున్న స్వయం సేవక పరివారం ఏనాడూ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనలేదు. దానిని వ్యతిరేకించారు. బ్రిటిష్ పాలకులకు వెన్నుదన్నుగా వున్నారు. ఈ పరివారంలో ఒక్కరు కూడా "వందేమాతరం" నినాదంతో జైలుపాలు కాలేదు. ఒక కేంద్ర మంత్రి "వందేమాతరం" గేయాన్ని రవీంద్రనాథ్ ఠాగూర్ రాశాడని అన్నారు. ఇదీ వీరికి తెలిసిన చరిత్ర.

ప్రతి అవకాశాన్ని మత విభజన రాజకీయానికి వాడుకునే కళ మాత్రమే వీరికి తెలిసిన విద్య. ఇప్పుడు వందేమాతరం 150 వార్షికోత్సవాన్ని దానికి వాడుకుంటున్నారు. కేంద్ర హోమ్ మంత్రిత్వశాఖ "వందేమాతరం" ఆరు చరణాలను ప్రభుత్వ కార్యక్రమాలలో విధిగా పాడాలని అన్ని ప్రభుత్వ సంస్థలకు ఆదేశాలను జారీ చేసింది. ఏనాడో సమసిపోయిన వివాదాన్ని తిరిగి తమ రాజకీయ ప్రయోజనాల కోసం తెరమీదకు తెచ్చింది.

దేశంలో నిరుద్యోగం, అధిక ధరలు, ఆర్థిక అంతరాల సమస్యల నుంచి చర్చను పక్కదారి పట్టించే విభజన రాజకీయాన్ని ముందుకు తెచ్చింది. ఇది రాజ్యాంగ పీఠికలోని లౌకిక ప్రజాస్వామ్యానికి, ఆరాధనా స్వేచ్ఛకు విరుద్ధం. వందేమాతరం జాతీయ గేయంలోని రెండు చరణాలకు బదులుగా పూర్తి పాఠం పాడాలని ఉత్తర్వులు ఇవ్వడం ద్వారా మత విభజన రాజకీయానికి దానిని పావుగా వాడుకునే రాజకీయ దుర్నీతిని అందరూ ప్రశ్నించాలి, ప్రతిఘటించాలి. ❑

- డి.వి.వి.యస్.వర్మ, సంపాదకులు, 85006 78977

# విపక్ష రాజకీయాల్లో మౌలిక మార్పు ఎలా ?



- యోగేంద్ర యాదవ్

పది రోజుల క్రితం జరిగిన ప్రతిపక్ష ఇండియా కూటమి సమావేశం మన కాలపు ఒక రాజకీయ ఆవశ్యకతను గుర్తు చేసింది. తమ విధ్యుక్త ధర్మ నిర్వహణలో ప్రతిపక్షాలు సరికొత్తగా పునఃప్రారంభమవడమే వాటి ప్రస్తుత కర్తవ్యమవాలి. దూరదృష్టి, దీక్షా దక్షతలతో కూడిన ప్రతిపక్షాల క్రియాశీలతను అవి చూపాలి. అవును, ప్రతిపక్షాల ఐక్యత మనకు అవసరం, అత్యవసరం కూడా. అంతేకాకుండా ఒక శక్తిమంతమైన సమైక్య ప్రతిపక్షం పునరుద్ధరణ ఇప్పుడు మనకు అవసరం.

సందేహం లేదు. నేడు మనకు సరికొత్త, సమైక్య ప్రతిపక్షం ఆవశ్యకత మునుపెన్నడూ లేని విధంగా ఉన్నది. అది అవశ్యం. ఎందుకని? రాజ్యాంగబద్ధమైన మార్గాల ద్వారానే నిరంకుశత్వం ప్రబలుతున్న సందర్భంలో మనమున్నాం. రాజ్యాంగ సంస్థల మధ్య ఉండాల్సిన సమతౌల్యత క్రమంగా క్షీణిస్తోంది. ఫలితంగా ప్రజాస్వామిక పాలన బలహీనపడుతోంది. అధికారాలు కేంద్రీకృతం అవుతున్నాయి. ఈ పరిస్థితుల పట్ల ప్రజా వ్యతిరేకత ప్రబలుతోంది. సంకుచిత మెజారిటేరియన్ శక్తుల ప్రాబల్యం నుంచి మన గణతంత్ర రాజ్యాన్ని రక్షించుకోవాల్సిన అవసరం వున్నది. ఈ సవాల్‌ను ఎదుర్కొనేందుకు ప్రతిపక్ష ఇండియా కూటమి ఏ మేరకు సంసిద్ధంగా ఉన్నదీ ఇప్పుడే చెప్పలేం. మన ప్రజాస్వామ్యం మనుగడ ఒక విషమ పరిస్థితిలో ఉన్నది. దీన్ని అధిగమించేందుకు ప్రతిపక్షాలు సంప్రదాయ రాజకీయ పద్ధతులకు భిన్నమైన మార్గాలను అనుసరించడం ముఖ్యం. అందుకు నిజమైన రాజనీతిజ్ఞత అవసరం. అంతకంటే ముఖ్యంగా నైతిక నిబద్ధత చూపాలి.

ప్రతిపక్ష రాజకీయాలలో ఒక మౌలిక మార్పు రావాలి. ఇదెలా సాధ్యమవుతుంది? ఎన్నికలలో గెలుపు సాధించడమే ధ్యేయంగా ఉండకూడదు. ప్రభుత్వ అధికారాన్ని స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా ఉన్న రాజకీయాల నుంచి గణతంత్రాన్ని కాపాడుకునే రాజకీయాల దిశగా ఆ మార్పు ఉండాలి. ఇందుకు ప్రతిపక్షాల దృక్పథం మారాలి. ప్రతిపక్షం విధులను పునర్ నిర్వచించాలి. ప్రతిపక్షాల ఐక్యతకు ప్రయత్నించాలి. ప్రతిపక్ష రాజకీయాలు చేయడమంటే ఏమిటో కొత్త ఆలోచనలతో నిర్ణయించుకోవాలి. తమ రాజకీయ కార్యాచరణలో ప్రజలను భాగస్వాములను చేసుకోవాలి. ఈ కార్యాచరణపరమైన మార్పు తప్పనిసరి. ఆ దిశగా మొదటి అడుగు పలు ప్రధాన ప్రతిపక్షాలు భాగస్వాములుగా ఉన్న 'ఇండియా' కూటమిని పునరుజ్జీవింపచేయడమే. తద్వారా మాత్రమే ప్రస్తుతం అధికారంలో వున్న పాలకులను సవాల్ చేయడం సాధ్యమవుతుంది. ప్రస్తుత నాయకులతోనే అది జరగాలి. ఈ నాయకుడి లేదా ఆ నాయకుడి యోగ్యతలు, అయోగ్యతల విషయమై చర్చలు వ్యర్థం. ప్రత్యామ్నాయ వ్యవస్థీకృత రాజకీయాలను అభివృద్ధిపరచడమే లక్ష్యంగా ఉండాలి. 2024 సార్వత్రక ఎన్నికలలో భారతీయ జనతా పార్టీని గట్టిగా సవాల్ చేసేందుకు ప్రతిపక్షాలు వేసిన ముందడుగే 'ఇండియా' కూటమి ఏర్పాటు. గత లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి కనీస మెజారిటీ సైతం లభించకుండా చేయడంలో ఇండియా కూటమి సఫలమైంది. అయితే దాని ప్రస్థానం నిరాశాజనకంగా సాగుతూ వస్తోంది.




గత సార్వత్రక ఎన్నికల అనంతరం వివిధ రాష్ట్రాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ మంచి విజయాలు సాధించి దేశ రాజకీయాలలో తన స్థానాన్ని మరింతగా బలోపేతం చేసుకున్నది. ఆ సార్వత్రక విజయం అనంతరం ప్రభుత్వ ఆధ్వర్యంలోని దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పి పలు ప్రతిపక్షాలకు తీరని నష్టం వాటిల్లేలా చేసింది. ఈ పరిణామంతో ప్రతిపక్షాలలో నైతిక స్థైర్యం దిగజారిపోయింది. విపక్షాల స్వీయ తప్పిదాలు కూడా వాటి ప్రస్తుత దుస్థితికి కారణమయ్యాయన్నది ఎవరూ కొట్టివేయలేని సత్యం. నిజానికి ఇండియా కూటమి సమావేశం ఎప్పుడోనే జరిగి ఉండవల్సింది. జూన్ 8 నాటి సమావేశం భాగస్వామ్య పక్షాలు తమ మధ్య అంతర్గత విభేదాలను తొలగించుకునేందుకు తోడ్పడింది. తరచూ సమావేశమవ్వాలని,

పార్లమెంటులో సమన్వయ సహకారంతో పనిచేయాలని 'ఇండియా' భాగస్వాములు నిర్ణయించుకోవడం ముదావహం. అయితే ఆ సమావేశం అనంతరం ప్రకటించిన కార్యాచరణ పథకం ప్రభుత్వాన్ని సమర్థంగా సవాల్ చేసేందుకు సహాయపడుతుందా? నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన డీలిమిటేషన్ బిల్లును అడ్డుకోవడంలో సాధించిన విజయం స్ఫూర్తితో రాజ్యాంగ సంస్థల కూల్చివేతకు జరుగుతోన్న ప్రయత్నాలను నిరోధించేందుకు విపక్షాలు ఒక సమైక్య వ్యూహాన్ని రూపొందించుకోవాలి.

ఇందుకు ఇండియా కూటమికి వెలుపల ఉన్న ప్రతిపక్షాలతో ప్రయోజనకరంగా పొత్తు పెట్టుకోవల్సిన అవసరమున్నది. ప్రజల విశ్వసనీయతను పొందేందుకు ఇది తోడ్పడుతుంది. రాజకీయ పక్షాల విషయాన్ని అలా ఉంచితే ఇప్పుడు దేశవ్యాప్తంగా అనేక సమస్యలపై ప్రజా నిరసనలు, ప్రజా పోరాటాలు ప్రజ్వరిల్లుతున్నాయి. బీజేపీ–ఆర్‌ఎస్‌ఎస్‌లను మొదటి నుంచీ సైద్ధాంతికంగా వ్యతిరేకిస్తున్న ప్రజా సంఘాలు ఆ ఆందోళనలలో కొన్నిటికి నాయకత్వం వహిస్తున్నాయి. వామపక్షాలకు అనుబంధంగా ఉన్న కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, ఇంకా పౌర, మానవ హక్కుల సంఘాలు మొదలైనవి ప్రజా చైతన్యాన్ని పెంపొందిస్తున్నాయి. వివిధ సామాజిక సముదాయాల ప్రత్యేక సమస్యలపై పోరాడుతున్న ప్రజా సంఘాల పోరాటాలు తప్పనిసరిగా భావజాలపరమైనవి కాకపోవచ్చు కానీ ఆది వాసీలు, ఓబీసీలు, దళితులు, సంచార జాతులు, మైనారిటీలలో ప్రజాస్వామిక చైతన్యానికి అవి తోడ్పడుతున్నాయి. ప్రశ్న పత్రాల లీకేజీ, అభివృద్ధి ప్రాజెక్టుల నెపంతో ప్రభుత్వాలు చేస్తున్న భూసేకరణ, పాలనా వ్యవస్థల్లో అవినీతి తదితర సమస్యలకు వ్యతిరేకంగా రగులుతున్న నిరసనలు, సాగుతున్న పోరాటాలు ఒక స్పష్టమైన సైద్ధాంతిక స్ఫూర్తితో బీజేపీ పాలనను వ్యతిరేకిస్తున్నవి కావు.

ఈ వాస్తవాలు, 'కాక్రోచ్ జనతా పార్టీ' పట్ల ప్రతిపక్షం దృక్పథం ఎలా ఉండాలో స్పష్టం చేస్తున్నాయి. సమాజంలోని పరిస్థితుల పట్ల యువ భారతీయుల అసంతృప్తిని, ఆగ్రహాన్ని శక్తిమంతంగా, వినూత్నంగా వ్యక్తం చేసిన ఉద్యమమది. అయితే సర్వత్రా స్వార్థపరత్వంతో కరడుగట్టిన వ్యవస్థను ఆ 'బొద్దింకల ఉద్యమం' బద్దలుకొడుతుందని ఆశించడం శుద్ధ పొరపాటే అవుతుంది. ఎందుకంటే అదొక అపరిణత రాజకీయ సంస్థ. ఆవశ్యక మౌలిక మార్పును సాధించే బృహత్ రాజకీయ బాధ్యతా భారాన్ని దానిపై మోపడం సరికాదు. అదే సమయంలో దాన్ని ఏ విధంగాను కొట్టివేయడమూ సమంజసం కాదు. అలాంటి వైఖరి ప్రతిపక్షానికి తనను తాను దెబ్బ తీసుకోవడమే అవుతుంది. చెప్పవచ్చినదేమిటంటే ప్రజలు తమంతటతాము వీధుల్లోకి వస్తున్నారు. ప్రభుత్వం పట్ల తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రజాందోళనలను ఒక అవకాశంగా ప్రతిపక్షం తీసుకోవాలి. వాటిని తమ ప్రతిష్ఠకు, మనుగడకు ముప్పుగానో, పోటీగానో ఎంత మాత్రం చూడకూడదు. ఎటువంటి మినహాయింపులు లేకుండా ఆ ప్రజాశక్తితో మమేకమవ్వాలి.

ప్రజలు ఉద్యమిస్తున్నారు, పోరాడుతున్నారు. ప్రతిపక్షాన్ని పునరుద్ధరించడమనే చారిత్రాత్మక కర్తవ్యం వారి ఉద్రేకాలు, బాధలు, నిరసనలు అన్నిటినీ ఏకీకృతం చేసి ఒక సమష్టిశక్తిగా రూపొందించాలి. ప్రతిపక్ష రాజకీయాలలో మౌలిక మార్పుకు ప్రయత్నించడం ద్వారానే అది సాధ్యమవుతుంది. ఆ మార్పును సాధించడమెలా? ప్రభుత్వాన్ని విమర్శించడానికే, అదెంత అత్యవసరమూ, న్యాయబద్ధమూ అయినా ప్రతిపక్షం పరిమితం కాకూడదు. ప్రత్యామ్నాయ రాజకీయాలను నిర్మించేందుకు ఇండియా కూటమి అజెండా ఏమిటి? ఈ విషయాన్ని దేశ ప్రజలకు స్పష్టంగా వివరించాలి. ఇందుకొక పూర్తి స్థాయి మ్యానిఫెస్టోను విడుదల చేయాలి. అందుకు సమయం పడుతుంది కనుక ఆలోగా కొన్ని ప్రధాన ఆలోచనలు, ప్రతిపాదనలతో ప్రజల ముందుకు వెళ్లాలి. ప్రజలతో సంభాషించడమనేది పత్రికా విలేఖర్లతో భేటీ, పార్లమెంటరీ ప్రసంగాలు, ప్రకటనలకే పరిమితం కాకూడదు. శాంతియుతమైన, అహింసాత్మక పద్ధతుల్లో చేస్తున్న వీధి పోరాటాలను మరింత ప్రభావశీలంగా నిర్వహించడం ద్వారా ప్రజలకు తమ సందేశంతో చేరువ కావాలి. ప్రజలు సులభంగా అర్థం చేసుకోలేని రాజ్యాంగ సంబంధిత వాదనల నుంచి సాంస్కృతికంగా ఉత్తేజపరిచే భావోద్వేగాలతో మిళితమైన పద్ధతులను అనుసరించాలి. ఇందుకు భారత జాతీయోద్యమ మహోన్నత వారసత్వం, మన పురానవ మత సంప్రదాయాలు, మన సమున్నత నాగరికతా విలువల నుంచి ప్రతిపక్షం స్ఫూర్తి పొందవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

పాలకులు తమ ప్రయోజనాలను కాపాడుకోవడానికై ఉద్దేశ పూర్వకంగా సృష్టించే కథనాలను తార్కిక విమర్శ, హేతుబద్ధమైన వాదనతో ప్రతిపక్షం ఎదుర్కోవాలి. అసాధారణ సమయాల్లో సైతం పాలకుల రాజకీయ ప్రాబల్యాల నెదుర్కొనేం దుకు మీమ్స్, కార్టూన్లు, 'బొద్దింకల' తరహా నిరసనలు చాలా ప్రభావవంతంగా ఉపయోగపడతాయి. 'పెరుగుట విరుగుట కొరకే' అన్నది ప్రజల అనుభవంలో ఉన్న చిరసత్యం. సర్వాధికారాలు తమ చేతుల్లో కేంద్రీకృతమయ్యాయని నిరంకుశ పాలకులు సంతృప్తి చెందిన తరుణంలోనే వారి సర్వాధిపత్యం బద్దలవడం ప్రారంభమవుతుందని చరిత్ర నిరూపించిన సత్యం. వాస్తవానికి నిరంకుశ పాలనా వ్యవస్థలు పెళుసైనవి. వ్యవస్థీకృత ప్రతిపక్షం సవాల్ చేసినప్పుడు అవి కూలిపోతాయి. ఈ సత్యాన్ని భారతీయ ప్రతిపక్షాలు సదా గుర్తుంచుకోవాలి. ❑

**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

# నైతిక డొల్లతనం మీద విద్యార్థుల తిరుగుబాటు



- ప్రభాత్ పట్నాయక్

ఇటీవల దేశాన్ని కుదిపే సిన విద్యార్థుల తిరుగుబాటు జెన్ జి (యువతరం) ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఎల్లెడలా వ్యాపించిన నిరుద్యోగ సమస్య, తీవ్రస్థాయిలో సాగుతున్న అవినీతి, దానిలో భాగంగా జరుగుతున్న ప్రశ్నా పత్రాల లీక్‌లు, వాటి కారణంగా పరిమితంగానైనా ఉన్న అవకాశాలు దూరం కావడం ఈ ఆగ్రహానికి కారణాలుగా అందరూ విశ్లేషిస్తున్నారు. ఈ విశ్లేషణ సరైనదే అయినా, అది మాత్రమే చాలదు.

ఒక పదిహేను సంవత్సరాల అమ్మాయి తాను ఇంటి దగ్గర తల్లికి అబద్ధం చెప్పి జంతర్‌మంతర్‌కు వచ్చానని ఒప్పుకుంది. అంత చిన్న వయస్సులో ఆమెను కలవరపరచినది కేవలం తన భవిష్యత్తు అవకాశాల లేమి మాత్రమేనా ? కాదు. అంతకన్నా లోతైన అంశాలు ఉన్నాయి. ఈ జెన్ జి ఆందోళన దేశ వ్యాప్తంగా అనేక నగరాలకు, పట్టణాలకు దానంతట అదే విస్తరించిందంటే అందుకు ప్రేరేపించిన అంశాలు లోతైనవి ఉన్నాయి. పాలకపార్టీ గాని, ప్రభుత్వం గాని వాటిని కనీసం గ్రహించగలిగే పరిస్థితి లేదు.

ఇది 'రాజకీయ' ఆందోళన కాదన్నది స్పష్టమే. దానికి 'నాయకులు' లేరన్నదీ స్పష్టమే. 'నాయకులే' నడిపిన ఉద్యమం అయివుంటే భారతీయ జనతా పార్టీ అటువంటి 'నాయకుల'తో వ్యవహరించడంలో ఆరితేరింది. వాళ్ల మధ్య చీలికలు తేవడం, వారిని అప్రదిష్టపాలు చేయడం, ప్రలోభాలకు గురిచేసి వాళ్లని అవినీతిపరులుగా దిగజార్చడం, కొనివేయడం, అవినీతి నిరోధక శాఖ పేరుతోనో, విదేశీ నిధులను అక్రమంగా కలిగివున్నారనో వాళ్ళని బెదిరించడం వంటి పద్ధతులు బీజేపీకి కొట్టిన పిండి. ఈ ఉద్యమానికి 'నాయకులు' లేకపోవడంతో బీజేపీకి ఆ పద్ధతులేవీ పారలేదు. అధికార పక్షంగా వాళ్ల దగ్గర ఉన్న అన్ని అస్త్రాలనూ ప్రయోగించారు. కాని అవన్నీ ఘోరంగా విఫలమయ్యాయి. సోనమ్ వాంగ్ చుక్ తన నిరవధిక దీక్షను విరమించుకున్నా, అదేమీ ఉద్యమం మీద ప్రతికూల ప్రభావాన్ని చూపలేదు. మంత్రి జె.పి.నడ్డా ఇంటికి 'కాక్రోచ్' జనతాపార్టీ నాయకులు ఇద్దరు వెళ్లి చర్చలు జరపడం విద్యార్థులకు ఆమోదయోగ్యంగా అనిపించలేదు. ముందస్తు షరతులు నిర్దేశించకుండా చర్చలు జరపడాన్ని విద్యార్థులు అంగీకరించలేదు. సాధారణంగా జరిగే ఉద్యమాల్లో 'నాయకులు' తమ 'అనుయాయుల' తరఫున చర్చల్లో పాల్గొంటూ వుంటారు. కాని ఇక్కడ అలా జరగలేదు. ఇక్కడ విద్యార్థులు 'నాయకుల' వెనక కాకుండా కొన్ని షరతుల ప్రాతిపదికన(డిమాండ్ల) ఐక్యమయ్యారు. వాటి విషయంలో ఎటువంటి రాజీకి వారు సుముఖంగా లేరు.

ప్రస్తుత ప్రభుత్వపు నైతిక డొల్లతనం పట్ల విద్యార్థులలో, యువతలో తీవ్ర అసంతృప్తి ఏర్పడింది. ఈ ఉద్యమం ఇంత సర్వవ్యాప్తంగా, ఎక్కడికక్కడ విస్తరించి చాలా స్వల్ప కాలంలోనే ఇంత మద్దతు పొందగలిగిందంటే దాని వెనుక ఉన్న లోతైన కారణం ఇదే. ఉద్యోగావకాశాలు సన్నగిల్లిపోవడమో, వరుసగా ప్రశ్నాపత్రాలు లీక్ కావడమో మాత్రమే ఇంత భారీ సంఖ్యలో జనాన్ని జంతర్‌మంతర్ దగ్గరికి చేర్చలేదు. వ్యవస్థలో 'జవాబుదారీతనం' అన్నది లేకపోవడం వారిని కదిలించింది. వ్యవస్థలో ఇన్నిన్ని ఘోరమైన వైఫల్యాలు జరుగుతూ వున్నా, వాటికి ఎవరూ బాధ్యత వహించడానికి సంసిద్ధం కాకపోవడం తో పాలకుల నైతిక డొల్లతనం పట్ల యువత ఆగ్రహించింది.

విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్న డిమాండ్ వెనుక ఆ రాజీనామాతోటే ప్రశ్నాపత్రాల లీకేజి సమస్య పరిష్కరించబడుతుందనో, లేక దెబ్బ తిన్న విద్యా వ్యవస్థ చక్కబడుతుందనో ఎవరూ భ్రమపడలేదు. జంతర్‌మంతర్ దగ్గర చేరినవారెవ్వరికీ అటువంటి భ్రమలు లేవు. కాని అతగాడి రాజీనామా విషయంలో వెనక్కి తగ్గేదే లేదన్న వైఖరి వాళ్లు తీసుకున్నారు. వ్యవస్థలో ఏర్పడిన నైతిక డొల్లతనాన్ని అధిగమించడం కోసమే వారీ నిర్ణయం తీసుకున్నారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో ఎవరో కొంతమంది ఉన్నతాధికారులనో, ఆ దిగువస్థాయి ఉద్యోగులనో బాధ్యు లుగా చూపించి అక్కడికి సరిపెట్టేయడాన్ని వాళ్లు ఆమోదించలేదు. రాజకీయ వ్యవస్థలో ఎవరో ఒకరు దీనికి బాధ్యత వహించా ల్సిందేనని పట్టుబట్టారు. ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం మీద ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసి బాధ్యులమీద చర్యల తీసుకుంటాం అని మోడీ ఇచ్చిన హామీ పని చేయలేదు. ప్రభుత్వం నైతికంగా బాధ్యత వహించాలన్న డిమాండ్ విద్యార్థుల్ని, యువతని ఇంట్లో చెప్పకుండా పారిపోయి వచ్చిన ఆ 15 ఏళ్ల అమ్మాయితో సహా, పెల్లెట్ గన్నులను ఎదుర్కొన్న ధైర్యవంతులైన యువతీ యువకులతో సహా, అందరినీ ఐక్యం చేసింది.

ఈ నైతిక డొల్లతనం అనేది ప్రస్తుత ప్రభుత్వం నరనరాల్లోకీ ప్రవేశించింది. అది రాజకీయ వ్యవస్థ అంతటికీ ఒక అంటు వ్యాధి మాదిరిగా విస్తరించింది. తమ పార్టీకి ఓటు వేయరేమో

అన్న అనుమానంతో కోట్లాది మంది పౌరులకు ఓట్లు లేకుండా చేయడం, ఇందుకోసం ఎన్నికల కమిషన్ ను వాడుకోవడం, అసలు ఆ ఎన్నికల కమిషన్‌ను ఏర్పరచడానికే అనైతిక పద్ధతులను ఉపయోగించడం (ప్రధానమంత్రి, అతడు నామినేట్ చేసిన మరో వ్యక్తి ఎన్నికల కమిషన్‌ను ప్రధానంగా నిర్ణయిస్తారు) ఎన్నికల ఫలితాలు ఎలా వచ్చినా, వాటిని తారుమారు చేసేలా ప్రతిపక్ష సభ్యులను కొనివేయడం లేదా బెదిరించి వారిని తమవైపు తిప్పుకోవడం – ఈ పనులన్నీ ప్రజాస్వామ్యం ముసుగు లోనే జరుగుతున్నాయి. ఈ నాటకాన్నంతటినీ విద్యార్థులు, యువజనులు చూస్తూనే వున్నారు. తమ వ్యతిరేకతను తెలియజేస్తూనే వున్నారు. ఒకపక్క పాలకవర్గ పెంపుడు జంతువు మాదిరిగా వ్యవహరిస్తూ 'గోదీ మీడియా' ఈ నాటకాన్ని ఆకాశానికి ఎత్తేస్తూంటే, మరోవైపు ఈ బండారాన్ని ప్రశ్నించకుండా ఉండేట్టు చాలామంది ప్రజానీకాన్ని భయభ్రాంతుల్ని చేస్తూ వచ్చారు. అటువంటి సమయంలో విద్యార్థులు ఈ దుర్మార్గాన్ని బహిరంగంగా ప్రశ్నించే దమ్ము చూపించారు. మోడీ భజననంతటినీ అవహేళన చేస్తూ ప్రదర్శించిన పోస్టర్లు, కార్టూన్లు ఈ వ్యతిరేకతనే బహిర్గతం చేశాయి. దీంతోబాటు భయంతో చచ్చుబడిపోయిన అనేక మందిలో మళ్లీ చలనాన్ని కలిగించాయి.

నిజానికి ఈ ప్రభుత్వం దేనికీ చలించదు, వెనకడుగు వేయదు, దేనికైనా వెనకాడదు అన్న భయాన్ని ప్రజల్లో నిల బెట్టడానికే పోలీసులు ఆందోళనకారుల పట్ల అంత కర్కశంగా వ్యవహరించారు. పెల్లెట్ గన్నులు, మేకులు దిగ్గొట్టిన లాఠీలను ప్రయోగించారు. బాష్పవాయువు ప్రయోగించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరించింది. ప్రజల్ని భయభ్రాంతుల్ని చేయడంతోబాటు వాళ్లు ఎవరికి వారుగా విడివిడి వ్యక్తులుగా, ఏకాకులుగా భావించేట్టు ప్రభావితం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. ఎవరికి వారు తమకేమీ చేతకాదని, తామేమీ చేయలేని అశక్తులమని భావిస్తూ, ప్రభుత్వం తిరుగులేని మద్దతుతో, బలంతో కొనసాగుతోందని భ్రమ పడుతూ చెదిరిపోతారని ఆశించింది.

ఈ విధమైన నైతిక దొల్లతనం అన్ని ఫాసిస్టు ప్రభుత్వాలకూ ఉండే ఒక లక్షణం. 1930 దశకంలో జర్మనీలో ముందుకొచ్చిన నాజీ ఉద్యమం గుత్త పెట్టుబడి మీద కారాలు మిరియాలు నూరడంతో మొదలుపెట్టింది. కానీ ఆ ఉద్యమం వెనుక ఉన్నది కొంతమంది గుత్తపెట్టుబడిదారులే. అధికారంలోకి వచ్చాక అదే గుత్త పెట్టుబడిదారులతో ఒడంబడిక కుదుర్చుకుంది. అటువంటి ఒప్పందం కుదరడానికి వీలుగా తన సొంత అనుయాయులలో సైతం అనేకమందిని అది ఊచకోత కోయడానికి వెనుకాడలేదు. ఎర్నెస్ట్ రోమ్ నాయకత్వంలో గుత్త పెట్టుబడికి వ్యతిరేకంగా నిలిచిన తమ సహచరులను "విచ్చుకత్తుల విషమ రాత్రి" (నైట్ ఆఫ్ లాంగ్ నైవ్స్)లో బలి తీసుకుంది. గుత్త పెట్టుబడితో కూటమి కట్టడానికి సిద్ధపడింది. అది దాని నైతిక దొల్లతనానికి నిదర్శనంగా నిలిచింది. నేటి నయా ఫాసిస్టులు గుత్త పెట్టుబడితో, ముఖ్యంగా అందులో కొత్తగా బలపడుతున్న ఒక భాగంతో అధికారంలోకి రావడానికి ముందే ఒడంబడిక కుదుర్చుకున్నారు. యథేచ్ఛగా దేశాన్ని దోచుకోడానికి గుత్తపెట్టుబడిదారులకు అవకాశం కల్పించే అటువంటి ఒడంబడికలతో నైతికత కాస్తా అదృశ్యం అవుతుంది. ఎటువంటి నైతికతా లేకుండా పోయింది కనుకనే ఫాసిస్టులకి ఇప్పుడు గోబెల్స్ తరహా ప్రచారం అవసరమైంది. మన దేశంలో బాలీవుడ్ నటులు "మోడీతో ఇది సాధ్యమే" ( మోడీ హై తో ముమ్కిన్ హై) అంటూ భజనలు చేసేలా వారిని ఒత్తిడి చేస్తున్నది ప్రభుత్వానికి నైతికత కొరవడినందువల్లనే.

ఈ నైతిక దొల్లతనాన్ని సవాలు చేయగల సరైన స్థానంలో ఉన్న ఒక సామాజిక తరగతి మన విద్యార్థులు. వాళ్లు కపటం లేనివారు. ఆదర్శ భావాలతో ఉంటారు. చాలా విషయాలను తెలుసుకుంటూ వుంటారు. ఆలోచిస్తారు. భయమన్నది ఎరుగరు. నైతిక విలువలను గౌరవిస్తారు. ఈ లక్షణాలన్నీ కలిసి ఈ ప్రభుత్వ నైతిక దొల్లతనాన్ని సవాలు చేయగల సామర్థ్యాన్ని వాళ్ళకి కలిగించాయి. ఆ ప్రభుత్వ గోబెల్స్ తరహా ప్రచారాన్ని తిప్పికొట్టగల నైపుణ్యం వారికి ఉంది. విద్యార్థులు సాధించిన విజయం నైతికమైనదే అయినా, రాజకీయాల్లో నైతిక విలువల ప్రాధాన్యతను ఎత్తి చూపగలిగినదే అయినా, దానితో మాత్రమే ఈ వ్యవస్థ మారిపోయిందని అనుకోరాదు. ఒక చిరుతపులిని బోనులో బంధించినంత మాత్రాన దాని వంటి మీద మచ్చలు పోవు కదా!

విద్యార్థులు ముందుకు తెచ్చిన డిమాండ్లు ఈ వ్యవస్థలో ఎటువంటి మార్పునూ తెచ్చేవి కావు. పాలనా వ్యవస్థలలోనూ మార్పులు తీసుకురావు. అటువంటి డిమాండ్లనే గనుక ముందుకు తెచ్చివున్నట్లైతే అప్పుడు వాటిమీద చర్చ చాలా జరిగివుండేది కాని ఉద్యమం ఇంత వేగంగా, ఇంత అప్రయత్నంగా దేశవ్యాప్తంగా విస్తరించి వుండేది కాదు. రైతాంగ ఉద్యమానికి, విద్యార్థి ఉద్యమానికి మధ్య తేడా ఒక్కటే కొట్టవచ్చినట్టు మనకి కనిపిస్తుంది. రైతు ఉద్యమం ప్రధానంగా వర్గ ఉద్యమం. ఒక ప్రధాన వర్గం ప్రయోజనాల పరిరక్షణ కోసం నడిచిన ఉద్యమం అది. ప్రభుత్వం నైతిక బాధ్యతను వహించాలన్న డిమాండ్ తో విద్యార్థి ఉద్యమం నడిచింది. అదే రైతు ఉద్యమం చూస్తే ప్రభుత్వం తెచ్చిన వ్యవస్థాగత మార్పులను వెనక్కి తిప్పికొట్టడం కోసం అది నడిచింది. నయా ఉదారవాద వ్యవస్థలో సామ్రాజ్యవాదుల ప్రయోజనాల కోసం,

**(మిగతా 13వ పేజీలో)**

# కాక్రోచ్ వ్యాఖ్యల నుంచి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వరకు

- మార్పు శరత్



**2**026లో భారతదేశాన్ని కుదిపేసిన అతిపెద్ద రాజకీయ, సామాజిక ఉద్యమాల్లో ఒకటి – నీట్ (NEET) వైద్య ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ నేపథ్యంలో పుట్టుకొచ్చిన "కాక్రోచ్ జనతా పార్టీ" (CJP) నిరసనలు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఓ సందర్భంలో చేసిన వ్యాఖ్యల నుంచి మొదలై, లక్షలాది మంది విద్యార్థుల ఆగ్రహం, వీధి పోరాటాలు, పార్లమెంటు స్తంభన దాటుకుని, చివరకు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఈ పరిణామాలు ఒక కీలక మలుపు తీసుకున్నాయి. ఈ వ్యాసంలో ఆద్యంతం జరిగిన పరిణామాలను గణాంకాలతో సహా వివరంగా చూద్దాం.

### 1.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు నిప్పు రవ్వ

ఈ మొత్తం ఉద్యమానికి బీజం 2026 మే 15న సుప్రీంకోర్టులో జరిగిన ఒక విచారణలో పడింది. సీనియర్ న్యాయవాది హోదా (Senior Advocate Designation) అంశంపై విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, నిరుద్యోగులైన యువ న్యాయవాదులను ఉద్దేశించి, వారికి వృత్తిలో స్థానం లేకపోవడాన్ని "బొద్దింకల్లా (cockroaches) ఉపాధి లేకుండా, వృత్తిలో స్థానం లేకుండా ఉన్నారు" అన్న అర్థంలో వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్య దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలకు, చర్చకు దారితీసింది. నిరుద్యోగ సమస్యతో సతమతమవుతున్న యువతకు ఈ మాట ఒక్కసారిగా బాధాకరంగా, అదే సమయంలో ఒక ప్రతీకగా మారింది.

### 2.నీట్-యూజీ 2026 పరీక్ష - పేపర్ లీక్ గణాంకాలు

**పరీక్ష తేదీ :** 2026 మే 3

**పాల్గొన్న అభ్యర్థులు:** సుమారు 22.7 లక్షల మంది (2.27 మిలియన్లు)

**పరీక్ష కేంద్రాలు :** దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లో 14 కేంద్రాలు

**రద్దు తేదీ:** 2026 మే 12

మే 3న పరీక్ష జరిగిన వెంటనే, ముందుగా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్న ఒక "గెస్ పేపర్" (guess paper)కు, అసలు ప్రశ్నపత్రానికి మధ్య అసాధారణ పోలికలు బయటపడ్డాయి. దాదాపు 400 ప్రశ్నలున్న ఆ గెస్ పేపర్లో



సుమారు 120 ప్రశ్నలు అసలు పరీక్ష ప్రశ్నలతో యథాతథంగా సరిపోలినట్టు గుర్తించారు. మరో దర్యాప్తు నివేదిక ప్రకారం, లాతూర్‌కు చెందిన ఒక ఉపాధ్యాయుడి ఫోన్ నుంచి సీబీఐ 136 ప్రశ్నలను స్వాధీనం చేసుకోగా, అందులో 111 ప్రశ్నలు మాస్టర్ సెట్‌తో సరిపోలాయి. ఈ ఆధారాలతో మే 12న ఎన్టీఏ (NTA) పరీక్షను రద్దు చేసింది.

### 3. దర్యాప్తు ఎలా మొదలైంది?

మే 4న ఒక ఉపాధ్యాయుడు (విజిల్‌బ్లోయర్) రాజస్థాన్ పోలీసులకు, టెలిగ్రామ్‌లో ప్రశ్నపత్రం చక్కర్లు కొడుతోందని ఫిర్యాదు చేశారు. తొలుత పోలీసులు కేసు నమోదు చేయలేదు.తర్వాత ఇంటెలిజెన్స్ బ్యూరో (IB) దృష్టికి వెళ్లడంతో సీబీఐ రంగంలోకి దిగింది. సీబీఐ దర్యాప్తులో జైపూర్‌కు చెందిన బివాల్ కుటుంబం మొదటి కీలక లింకుగా బయటపడింది. ఈ కుటుంబ సభ్యుడు దినేశ్ బివాల్ బీజేపీ యువమోర్చా (BJYM)తో సంబంధాలున్న వ్యక్తిగా గుర్తించారు (పార్టీ మాత్రం అతనితో సంబంధాన్ని ఖండించింది). అతని సోదరుడు మంగీలాల్, తన కుమారుడి కోసం పేపర్ కొనుగోలుకు రూ.10 లక్షలు చెల్లించేందుకు ముందుకొచ్చినట్టు తేలింది. గురుగ్రామ్‌కు చెందిన యశ్ యాదవ్ అనే మరో వ్యక్తి ఈ గొలుసులో భాగమైనట్టు వెల్లడైంది. మరాఠీ అనువాదకుడైన ఒక ప్రొఫెసర్ (కుల్కర్ణి) ఈ కేసులో తొలి ప్రధాన అరెస్టుగా నిలిచారు. మొత్తంగా ఇప్పటివరకు 13 మందిని సీబీఐ అరెస్టు చేసినట్టు నివేదికలు తెలిపాయి; బహుళ రాష్ట్రాలకు విస్తరించిన నెట్‌వర్క్‌గా దర్యాప్తు అధికారులు దీన్ని అభివర్ణించారు. మే 15న మీడియా సమావేశంలో మంత్రి ధర్మేంద్రప్రధాన్ మొదటిసారిగా, గెస్ పేపర్ ముసుగులో అసలు ప్రశ్నలే లీక్ అయినట్టు

అధికారికంగా అంగీకరించారు.

### 4. కాక్రోచ్ జనతా పార్టీ (CJP) ఆవిర్భావం

సీజేఐ వ్యాఖ్యలపై వచ్చిన ఆగ్రహాన్ని ఆసరాగా చేసుకుని, అమెరికాలోని బోస్టన్ యూనివర్సిటీ పట్టభద్రుడైన అభిజిత్ దీప్కే, "కాక్రోచ్ జనతా పార్టీ" (Cockroach Janta Party) పేరుతో ఒక వ్యంగ్య రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించారు. మొదట్లో ఇది ఆన్‌లైన్ వ్యంగ్యంగా మొదలైనా, నీట్ పేపర్ లీక్‌పై ప్రజాగ్రహం పెరుగుతున్న కొద్దీ ఇది పూర్తిస్థాయి నిరసన ఉద్యమంగా రూపాంతరం చెందింది. "బొద్దింకలు" అనే అవమానకర పదాన్ని యువత తమకు తామే ఒక ప్రతిఘటన చిహ్నంగా మలచుకున్నారు.

### 5. దేశవ్యాప్త నిరసనలు - జంతర్ మంతర్ కేంద్రంగా

నిరసనల ప్రారంభం: 2026 జూన్ 6, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద. CJPతో పాటు ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (AISF), ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (AISA), స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (SFI) వంటి వామపక్ష విద్యార్థి సంఘాలు ఈ ఉద్యమంలో చేరాయి. ఈ నిరసనలను "2026 ఢిల్లీ జంతర్ మంతర్ నిరసనలు" లేదా "భారత జెన్-జెడ్ నిరసనలు" అని కూడా వ్యవహరిస్తున్నారు. మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక సహా పలు రాష్ట్రాల్లో సమాంతర నిరసనలు జరిగాయి. బెంగళూరులో ఫ్రీడమ్ పార్క్ వద్ద జరిగిన నిరసనలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య సైతం పాల్గొన్నారు.

ప్రముఖ పర్యావరణవేత్త, విద్యావేత్త సోనమ్ వాంగ్చుక్ నిరవధిక నిరాహారదీక్షకు దిగారు. జూలై 17 నాటికి (దీక్ష 19వ రోజు) ఆయన 9.1 కిలోల బరువు కోల్పోయి నిలబడలేని స్థితికి చేరుకున్నారు. అనంతరం ఢిల్లీ పోలీసులు వైద్య కారణాలతో ఆయనను సఫ్దర్‌జంగ్ ఆసుపత్రికి తరలించారు. దీనికి నిరసనగా అభిజిత్ దీప్కేతోపాటు SFI నేతలు అదర్శ్ ఎం.సాజి, ఐషే ఘోష్ కూడా నిరాహారదీక్ష చేపట్టారు. జూలై 20న పార్లమెంటు వైపు వెళ్లేందుకు ప్రయత్నించిన వేలాది మంది నిరసనకారులపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జి, భాష్పవాయువు ప్రయోగించారు. ఈ ఘటనలో సుమారు 150 మంది గాయపడినట్టు CJP పేర్కొంది. ఈ పోలీసు చర్యను శశి థరూర్, రాహుల్ గాంధీ, అరవింద్ కేజ్రీవాల్ వంటి విపక్ష నేతలు తీవ్రంగా ఖండించారు.

### 6. విద్యార్థుల ఆత్మహత్యలు, పునఃపరీక్ష

పరీక్ష రద్దు వార్త తర్వాత తీవ్ర మానసిక ఒత్తిడికి గురైన కొందరు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడినట్టు మీడియా కథనాలు తెలిపాయి - దాదాపు పన్నెండు మంది వరకు ఈ ఘటనలతో ముడిపడి ఉన్నట్టు అంచనా. దీంతో ఎన్టీఏ 2026 జూన్ 21న పునఃపరీక్ష నిర్వహించింది. అయితే ఈ జాప్యం వల్ల మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ప్రవేశాల షెడ్యూల్ కూడా వాయిదా పడింది.

### 7. రాజకీయ పరిణామాలు, పార్లమెంటు స్తంభన

ప్రధాని నరేంద్ర మోదీ పేపర్ లీక్ నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు; దీంతో ఢిల్లీ హైకోర్టు ప్రత్యేక ఫాస్ట్-ట్రాక్ కోర్టును ఏర్పాటు చేసింది. జూలై 20న ప్రధాని నివాసం ఎదుట రాహుల్ గాంధీ నిరసన చేపట్టగా, పోలీసులు ఆయనతోపాటు పలువురు విపక్ష నేతలను అదుపులోకి తీసుకున్నారు.

పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈ వివాదంతో పదేపదే స్తంభించాయి. మంత్రి ప్రధాన్ రాజీనామాయే చర్చకు ముందస్తు షరతుగా విపక్షాలు పట్టుబట్టగా, షరతులు లేకుండా చర్చకు సిద్ధమని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో జూలై 23 నాటికి కూడా ఈ ప్రతిష్టంభన కొనసాగింది.

జూలై 22న "టైమ్" మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీప్కే, పోలీసు అణచివేత అనంతరం మోదీని "నియంత"గా అభివర్ణించడం మరింత దుమారం రేపింది.

### 8. సుప్రీంకోర్టు జోక్యం

నీట్ పేపర్ లీక్ కేసుపై సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం (జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆలోక్ అరాధే సభ్యులుగా) కేంద్రాన్ని, విద్యాశాఖను ఉద్దేశించి, ఇలాంటి "పొరపాట్ల పరంపర"కు తెరదించాలని ఆదేశించింది. ఈ అంశాన్ని నిశితంగా పర్యవేక్షిస్తామని, క్రమం తప్పకుండా విచారణ కొనసాగిస్తామని కోర్టు స్పష్టం చేసింది.

### 9. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా

వారాల తరబడి కొనసాగిన నిరసనలు, పార్లమెంటు ప్రతిష్టంభన, పోలీసు చర్యలపై దేశవ్యాప్త విమర్శల నేపథ్యంలో, 2026 జూలై 25(శనివారం) కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రధాని మోదీ ఇంతవరకు ఈ రాజీనామాను అధికారికంగా ఆమోదించలేదు. అయితే, ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించిందని పేర్కొంటూ CJP తమ దేశవ్యాప్త నిరసనలను తక్షణమే విరమిస్తున్నట్టు ప్రకటించింది. పరీక్ష రద్దు కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలన్నది వారి ప్రధాన డిమాండ్లలో ఒకటి. రాజీనామా అనంతరం జంతర్‌మంతర్ వద్ద మద్దతుదారులను ఉద్దేశించి మాట్లాడిన CJP వ్యవస్థాపకుడు దీప్కే, "సీజేఐ మమ్మల్ని బొద్దింకలు అని పిలవకపోతే, నేను భారత్‌కు వచ్చేవాడినే కాదు,

**(మిగతా 13వ పేజీలో)**

# ‘మో షా’ వాషింగ్ మెషిన్ - రాజకీయాలు




- ఎ.నర్సింహారెడ్డి

‘నేను అవినీతికి పాల్పడను.. అవినీతిని ప్రోత్సహించను’ (నా ఖావుంగా, నా ఖానే దూంగా) అనే నరేంద్ర మోదీ నినాదం ఒట్టి బూటకమని తేలిపోయింది. ఒకప్పుడు అవినీతిపరులుగా బీజేపీ స్వయంగా ముద్ర వేసిన నేతలే ఇప్పుడు ఆ పార్టీకి సారథుల య్యారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీల నుంచి బీజేపీలోకి పిరాయించే ఎంపి, ఎమ్మెల్యేలను అక్కున చేర్చుకోవడానికి ‘వాషింగ్ మెషిన్’ రాజకీయాలను బీజేపీ  చేస్తుంది. “వాషింగ్ మెషీన్” అనేది ఒక తీవ్రమైన రాజకీయ రూపం. తీవ్రమైన అవినీతి లేదా నేరారోపణ లను ఎదుర్కొంటున్న ప్రతిపక్ష రాజకీయ నాయకులు అధికార పార్టీలోకి ఫిరాయించిన తర్వాత వారి అవినీతి మటు మాయమైపోతున్నది. చట్టవ్యతిరేక చర్యలు సమస్యలు “పరిష్కరించబడతాయి” లేదా తొలగించబడతాయి అనే దృగ్విషయాన్ని వివరించడానికి దీనిని ఉపయోగిస్తున్నారు.

‘బీజేపీ వాషింగ్ మెషీన్’ అనేది ఒక అధికారిక ప్రభుత్వ విధానంగా మారిపోయింది. ఇతర పార్టీల నుంచి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులు బీజేపీలో చేరిన వెంటనే, వారిపై ఉన్న కేసులు మాఫీ అయిపోవడం లేదా దర్యాప్తు సంస్థలు వారికి క్లీన్‌చిట్ ఇవ్వడాన్ని విపక్షాలు వ్యంగ్యంగా ఈ పేరుతో పిలుస్తున్నాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులు బీజేపీలో చేరగానే లేదా ఆ పార్టీతో పొత్తు పెట్టుకోగానే, ఆటోమెటిక్ వాషింగ్ మెషిన్‌లో బట్టలు ఉతికినట్లుగా వారిపై ఉన్న కేసులు రద్దవుతున్నాయి. రూ.35,000 కోట్ల కుంభకోణంలో గాలి జనార్ధన్‌రెడ్డి ప్రమేయం, ఆయనపై ఉన్న పలు కేసులు ఉండగానే, ఆయనను తిరిగి పార్టీలోకి స్వాగతించడాన్ని బీజేపీని ప్రియాంకగాంధీ వాద్రా విమర్శించిన తర్వాత, బీజేపీ వాషింగ్ మిషన్ వ్యాఖ్య వైరల్ అయింది. 2014 నుంచి జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఫిరాయించి పోటీ చేసిన వారు 1,133 మంది అభ్యర్థులున్నారు.

### రాజకీయ నేతల అవినీతి-ఫిరాయింపులు

లూయిస్ బెర్గర్ కుంభకోణంలో కేవలం భారీ మొత్తంలో డబ్బు మాత్రమే కాకుండా, పలుకుబడి ఉన్న వ్యక్తులు కూడా ఉన్నారు. పలు నీటి అభివృద్ధి ప్రాజెక్టుల కాంట్రాక్టులను దక్కించుకోవడానికి 2010లో భారత ప్రభుత్వ అధికారులకు లంచం ఇచ్చినట్లు ఒప్పుకున్నారు. ఆ మొత్తం దిగ్భ్రాంతికరమైన రీతిలో సుమారు రూ.6.5 కోట్లు 2010లో ఆ పదవిలో ఉన్న, పేరు వెల్లడి కాని ఒక మంత్రికి ఈ లంచం చెల్లించారు. పలు దేశా




ల్లోని ఉన్నతాధికారులకు లంచాలు ఇచ్చినట్లు 2015 జూలైలో లూయిస్ బెర్గర్ అధికారులు అమెరికా కోర్టులో అంగీకరించారు. 2014లో దేశంలోని పశ్చిమబెంగాల్‌లో నారద న్యూస్ జర్నలిస్ట్ మాథ్యూ శామ్యూల్ నిర్వహించిన ఒక రాజకీయ స్టింగ్ ఆపరేషన్ ను నిర్వహించారు. ఈ రహస్య ఆపరేషన్‌లో, ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ (టియంసి)కు చెందిన పలువురు ఉన్నత స్థాయి నాయకులు, ఒక సీనియర్ ఐపిఎస్ అధికారి, ఒక కల్పిత కంపెనీకి అనధికారిక సహాయాలు చేసినందుకు ప్రతిఫలంగా నగదు లంచాలు తీసుకుంటుండగా కెమెరాలో చిక్కారు. ప్రతిపక్ష పార్టీలు విస్తృతంగా ఉపయోగించే ‘ఆపరేషన్ లోటస్’ అనే పదం కర్ణాటక(2019), గోవా (2022) వంటి కేసులలో భారత మీడియా చూసినట్లుగా, రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరచడానికి, కూల్చివేయడానికి ప్రతిపక్ష శాసనసభ సభ్యులను (ఎమ్మెల్యేలను) క్రమపద్ధతిలో ప్రలోభ పెట్టడాన్ని సూచిస్తుంది.

2019లో కర్ణాటక కాంగ్రెస్, జేడీఎస్ పార్టీలకు చెందిన 17 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. దీనివల్ల అక్కడ బీజేపీ  ప్రభుత్వం ఏర్పడింది. 2020లో మధ్యప్రదేశ్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 22 మంది ఎమ్మెల్యేలు మాజీ కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా నాయకత్వంలో రాజీనామా చేసి, బీజేపీలో చేరడంతో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోయింది. 2019, 2022 ఎన్నికల సమయంలో గోవా కాంగ్రెస్, ఇతర పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. 2022 మహారాష్ట్ర శివసేనలో చీలిక ఏర్పడిన ఏక్‌నాథ్ షిండే వర్గం బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు

చేసింది. తదనంతరం, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సిపి)లో చీలిక వచ్చి అజిత్‌పవార్ వర్గం బీజేపీ నాయకత్వంలోని ఎన్‌డీఏ కూటమిలో చేరింది. ఈశాన్య రాష్ట్రాల్లో వివిధ ప్రాంతీయ పార్టీలు, కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలో బీజేపీలో విలీనమయ్యారు. నారదా టేప్స్ మొదలు లూయిస్ బెర్గర్ కుంభకోణం వరకు ఆరోపణలు ఎదుర్కొన్న నాటి ప్రతిపక్ష నాయకులు నేడు బీజేపీ తరపున ముఖ్యమంత్రులుగా అధికార పీఠాలపై కూర్చున్నారు. 'బీజేపీ వాషింగ్ మెషీన్ మోడీ వాషింగ్ పౌడర్‌తో మళ్లీ వచ్చేసింది. సద్గుణం, నిజాయితీ, సిద్ధాంతాలకు ప్రతీకలమని తమను తాము ప్రదర్శించుకున్న వారు దారుణంగా బట్టబయలయ్యారు'. 2014 నుంచి బీజేపీ ప్రభుత్వం మోడీ నాయకత్వం తన ఉనికిని విస్తరించుకోవడానికి ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోయడానికి ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం రాజ్యసభలో బలం పెంచుకోవాల్సిన అవసరం కీలకంగా మారిన దశలో అధికార బీజేపీ... ఆప్‌కు చెందిన ఏడుగురు ఎంపీలను తమ పార్టీలోకి లాక్కున్న వైఖరి కనిపిస్తూనే ఉన్నది. వారి గత సిద్ధాంత వైఖరులకు, ప్రస్తుత రాజకీయాలకు మధ్య వైరుధ్యం కనిపిస్తోందని, అవినీతిని అంతం చేయడం కాకుండా దానిని సొంతం చేసుకోవడమే మోడీ విధానంగా కనిపిస్తోంది. దీంతో మోడీ రాజ్యంలో అవినీతిపరులకే పట్టమన్న తీరు కనిపిస్తోంది. 2024లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మోడీ నేతృత్వంలో మూడవసారి ఏర్పడినప్పటి నుంచి, ఇతర రాజకీయ పార్టీలను చీల్చడానికి, ఆ తరువాత వాటి అస్తిత్వాన్నే ప్రశ్నార్థకంగా మార్చటానికి ఎన్ని విన్యాసాలు చేయాలో బీజేపీ అన్ని విన్యాసాలూ చేస్తోంది. రాజకీయ పార్టీలను చీల్చడానికి మోడీ ప్రభుత్వం తన ఆధీనంలోని సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి), ఆదాయపు పన్ను శాఖను ఆయుధంగా ప్రయోగించడం సర్వసాధారణమైంది. ఎన్నికల్లో విజయం సాధించడానికి ఎన్ని అడ్డదారులు తొక్కాలో బీజేపీ అన్ని అడ్డదారులూ తొక్కుతోంది. బీజేపీకి సాధించదలచుకున్న లక్ష్యం మీద ఉన్న దృష్టి అనుసరించే మార్గం మీద ఎప్పుడూ లేదు. సైద్ధాంతిక అంశాలను వల్లిస్తూ స్వార్థ ప్రయోజనాల కోసం నాయకులు ఎలా పార్టీలు మారతారో అందరికీ తెలుసు. విద్రోహం లాంటి మాటలు, విమర్శలు ఇలాంటి పరిస్థితిలో వ్యర్థ పదాలుగానే మిగిలిపోయాయి. ఇవ్వాల్టి నేతలకు నైతిక విలువలకంటే పదవులు ప్రధానమైనాయి. ఒక సిద్ధాంతం అంటూ ఉంటే, దాన్ని నమ్మితే, తరువాత దాన్ని ఉల్లంఘిస్తే అది విద్రోహం అవుతుంది. ఆ బాదర బందీ లేనప్పుడు విద్రోహం అన్న మాటకు అర్థమే లేదు. అస్తవ్యస్త నడవడికకు సిద్ధాంతం ఒక సాకు మాత్రమే.

## ప్రత్యర్థి నేతలపై బీజేపీ ఆరోపణలు

దేశవ్యాప్తంగా ఏటా పలు రాష్ట్రాల్లో వివిధ విపక్ష పార్టీలకు చెందిన ఎమ్మెల్యేలు బీజేపీ పార్టీలోకి ఫిరాయిస్తున్నారు. కొన్ని చోట్ల అధికార పార్టీలను సైతం వీడి విపక్షాల్లోకి ఫిరాయిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లోనూ ఫిరాయింపుల బెడద ఎక్కువగానే ఉంది. ఈశాన్య రాష్ట్రం అసోంలో హిమంత విశ్వశర్మ దీనికి మొదటి ఉదాహరణగా చెప్పొచ్చు. ఆయన కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు లూయిస్ బెర్గర్ లంచం కేసులో బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. అప్పట్లో విడుదల చేసిన పుస్తకాల్లో ఆయనను అవినీతి ముఖచిత్రంగా చూపించింది. కానీ 2015లో ఆయన బీజేపీలో చేరాక ఆ ఆరోపణలన్నీ కనుమరుగయ్యాయి. ఇక బీహార్‌లో సామ్రాట్ చౌదరీపై హత్య కేసు, వయస్సు తారుమారు ఆరోపణలు ఉన్నప్పటికీ.. ఇప్పుడు బీజేపీ నాయకత్వం వాటిని పూర్తిగా విస్మరించింది. ఆయన కోసం నితీశ్‌కుమార్‌ను తప్పించి మరీ బీజేపీ అధినాయకత్వం సామ్రాట్ చౌదరీని సీఎం కుర్చీలో కూర్చోబెట్టింది. మరో ఈశాన్య రాష్ట్రం అరుణాచల్‌ప్రదేశ్‌లో పెమా ఖండూ పలు పార్టీలు మారుతూ ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు.

2014 నుంచి కాంగ్రెస్ అత్యధిక సంఖ్యలో ఫిరాయింపులను చవిచూడగా, మోడీ దేశ ప్రధానమంత్రి అయినప్పటి నుంచి బీజేపీ అతిపెద్ద లబ్ధిదారుగా నిలిచిందని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్(ఏడీఆర్) నివేదిక పేర్కొంది. మొత్తం ఫిరాయింపులలో, 2014- 2021 మధ్యకాలంలో దాదాపు 35 శాతం మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు కాంగ్రెస్ నుంచి ఫిరాయించగా, బీజేపీ నుంచి కేవలం ఏడు శాతం మంది మాత్రమే ఫిరాయించారని ఆ విశ్లేషణ తెలిపింది. ఫిరాయించిన చట్టసభ సభ్యులలో సుమారు 35శాతం మంది బీజేపీలో చేరారని ఆ నివేదిక వివరాలను జోడించింది. కాంగ్రెస్ ఎన్నికల అభ్యర్థులలో 20 శాతం మంది పార్టీని వీడగా, ఆ తర్వాత మాయావతి నేతృత్వంలోని బహుజన్ సమాజ్ పార్టీ 14 శాతం మంది అభ్యర్థులను ఇతర పార్టీలకు కోల్పోయింది. ఫిరాయించిన అభ్యర్థులలో అత్యధికులు బీజేపీలో చేరారు. పశ్చిమ బెంగాల్‌లో మొదలై ఇరుగుపొరుగు రాష్ట్రాలకు పాకిన శారద చిట్‌ఫండ్ కుంభకోణంలో హిమంత, సువేందులు ఇద్దరూ అవినీతికి పాల్పడినట్లు వార్తలు వచ్చాయి. సువేందు ఏకంగా నారదా స్టింగ్ ఆపరేషన్‌లో రూ.5 లక్షలు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. దీనిపై బీజేపీ అవినీతిపరులని ఆందోళనలు చేయడమే కాక, శారద చిట్‌ఫండ్ కుంభకోణంపై కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం సిబిఐ దర్యాప్తును చేపట్టింది. ఈ విషయంలో వారిద్దరూ విచారణను ఎదుర్కొన్నారు. ఇటు హిమంత, సువేందులపై స్వయంగా మోడీ గతంలో ఎన్నికల ప్రచారాలలో అవినీతి ఆరోపణాస్త్రాలను సంధించారు. వీరిద్దరికీ తీవ్రమైన రాజకీయ కాంక్షలు, ముఖ్యమంత్రి పదవి చేపట్టాలనే లక్ష్యం ఉండేది. కానీ, అవినీతి కేసులు, వేధింపులు ఆటంకాలుగా మారాయి. అదే సమయంలో బీజేపీ ఎంతో కాలంగా అసోం, పశ్చిమబెంగాల్ రాష్ట్రాలలో పట్టు సాధించేందుకు చేస్తున్న ప్రయ త్నాలు విఫలమవుతూనే

ఉన్నాయి. ఇదే అదునుగా భావించి ఆగస్టు 2015లో హిమంత, డిసెంబర్ 2020లో సువేందు బీజేపీలో చేరిపోయారు.

ఒకప్పుడు 'దేశాన్ని దోచుకున్నవారు' అని బీజేపీ ఆరోపించిన నేతలే ఇప్పుడు ఆ పార్టీకి ముఖ్య మంత్రులు, ప్రాంతీయ శక్తులుగా మారారు. విమర్శలు ఎదుర్కొన్న విపక్ష నేతలు బీజేపీ లో చేరిన వెంటనే పరిశుద్ధులుగా మారిపోవడాన్ని కాంగ్రెస్ విమర్శిస్తూ దానిని 'వాషింగ్‌మిషన్ రాజకీయంగా' అభివర్ణిస్తున్న ది. వారి మీద ఉన్న కేసులు, దర్యాప్తులు అదృపులు అదృశ్యమవడమో, నత్తనడకన సాగడమో జరుగుతున్నాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలు బీజేపీలోకి రాగానే వాషింగ్‌మిషన్‌లో శుభ్రపర్చి నట్టుగా 'క్లీన్' అవుతారని ప్రతిపక్షాలు సంధించి వ్యంగ్యాస్త్రాలు నిజమేనని తాజా రాజకీయ పరిణామాలు నిరూపిస్తున్నాయి. అసోంను హిమంత బిశ్వ శర్మకు కట్టబెట్టిన తర్వాత ఇప్పుడు పశ్చిమబెంగాల్ సీఎంగా సువేందు అధికారి ప్రమాణ స్వీకారం ఈ చర్చకు తావిస్తోంది. మోడీ అవినీతి వ్యతిరేక పోరాటం ఏనాడు చేయలేదు. ఆయన నాయకత్వంతో బీజేపీ నడిపినది అత్యున్నత స్థాయి మనీ లాండరింగ్ ఆపరేషన్ అన్న విమర్శలు ఉన్నాయి. హైప్రో ఫైల్ అవినీతి కేసులే మోడీ పాలనలో సీఎం పదవికి అర్హులన్న తీనే కనిపిస్తున్నది.

## అవినీతి నేతలకే ముఖ్యంత్రి పీఠాలు

అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ 2001 నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉంటూ, తరుణ్ గోగోయ్ ప్రభుత్వంలో విద్య, ఆరోగ్యం, ఆర్థికం వంటి ముఖ్యమైన మంత్రిత్వ శాఖలను నిర్వహించారు. 2015 ఆగస్టులో, ఆయన కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరారు. 2016లో కీలక మంత్రిగా, 2021 మేలో అసోం ముఖ్యమంత్రిగా ఆయనను బీజేపీ నియమించింది. ఆయన కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు లూయిస్ బెర్గర్ లంచం కేసులో బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. అప్పట్లో విడుదల చేసిన పుస్తకాల్లో ఆయనను అవినీతి ముఖచిత్రంగా చూపించింది. అవన్నీ మరిచిపోయి, మరోసారి సిఎం పదవి కట్టబెడుతోంది.

సువేందు అధికారి ప్రస్తుత పశ్చిమ బెంగాల్ సిఎం. ఒకప్పుడు పశ్చిమ బెంగాల్ రాజకీయాలలో మమతా బెనర్జీకి అత్యంత విశ్వసనీయ నాయకులలో ఒకడు. ఆయన రాజకీయ జీవితం కాంగ్రెస్‌తో ప్రారంభమైనప్పటికీ, 1998లో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. నందిగ్రామ్‌లో మమతా బెనర్జీతో కలిసి నానా యాగీ చేశాడు. 2020లో ఆయన తృణమూల్ కాంగ్రెస్‌ని వీడారు. 2020 డిసెంబర్ 19న అమిత్ షా సమక్షంలో బీజేపీలో చేరారు. 2026లో పశ్చిమబెంగాల్ సువేందు అధికారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాడు. అప్పట్లో బిజెపికి అవినీతి అనకొండగా కనబడ్డవాడు, ఇప్పుడు అదే నేతను బీజేపీ 'బెంగాల్ రక్షకుడు'గా కీర్తించడం కాషాయ పార్టీ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. బీహార్ నూతన సీఎం సామ్రాట్ చౌదరి ఈ జాబితాలో ఉన్నారు. ఆయన మొదట ఆర్‌జెడి నుంచి ఎమ్మెల్యే అయ్యారు. తర్వాత జెడియులో మంత్రిగా పనిచేశారు. 2018లో బీజేపీలో చేరి, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఉప ముఖ్యమంత్రిగా, ప్రస్తుతం బీహార్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. 1995 నాటి హత్య కేసు, వయస్సు తారుమారు ఆరోపణలు ఉన్నప్పటికీ.. బీజేపీలో చేరాక ఆ పార్టీ నాయకత్వం వాటిని పూర్తిగా విస్మరించింది. నితీశ్ కుమార్‌ను తప్పించి సీఎం కుర్చీలో కూర్చోబెట్టింది.

అరుణాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి పేమా ఖండా 2016లో, కాంగ్రెస్ తరపున ముఖ్యమంత్రిగా అయ్యారు. అదే సంవత్సరం ఆయన మొదట పీపుల్స్ పార్టీ ఆఫ్ అరుణాచల్ (పిపిఎ)లో చేరి, ఆ తర్వాత మద్దతుదారులైన ఎమ్మెల్యేలతో కలిసి బీజేపీలో చేరారు. బీజేపీ ఆయనను ముఖ్యమంత్రిగా కొనసాగించింది. ఇతర పార్టీల నుంచి వచ్చిన కీలక నేతలలో అసోం గణ పరిషత్‌కు చెందిన సర్బానంద సోనోవాల్ బీజేపీలో చేరడంతో అసోం సిఎంగా అవకాశం కల్పించింది. కాంగ్రెస్ నుంచి వచ్చిన ఎన్. బీరెన్ సింగ్ మణిపూర్ అల్లర్లకు కాకుడిగా ఉన్న ముందా బీజేపీలో చేరి, సిఎంగా పనిచేశారు. ఈ జాబితాలో ముఖ్యమంత్రులే కాదు, కేంద్ర క్యాబినెట్లో ఉన్న మంత్రులు జ్యోతిరాదిత్య సింధియాతో పాటు పలువురు ఎంపీలు తమ పదవులను కాపాడుకోవడం కోసం బీజేపీలో చేరడం దేశ ప్రజలకు తెలియనిదేమి కాదు.

## బీజేపీ నాలుగు 'ఐ'ల ఫార్ములా

మోడీ పాలనలో బీజేపీ నాలుగు ఐ ల ఫార్ములాను అమలు చేస్తోందని చెప్తున్నారు. అవి.. ఐడెంటిఫై (గుర్తించు), ఇన్వెస్టిగేట్ (దర్యాప్తు), ఇండక్ట్(చేర్చుకోవడం), ఇనాగురేట్(పదవి ఇవ్వడం). ప్రతిపక్ష నేతను భారీ అవినీతి కుంభకోణంలో ప్రధాన నిందితుడిగా చూపించడం 'ఐడెంటిఫై'లో భాగం. ఇన్వెస్టిగేట్‌లో సదరు నేతపై కేంద్ర దర్యాప్తులను ఎదుర్కొన్న వారి 90 శాతం మంది ప్రతిపక్ష పార్టీల నేతలేనని వివిధ మీడియా సంస్థల విశ్లేషణలు సైతం వెల్లడించాయి. దీంతో కేంద్ర దర్యాప్తు సంస్థలు బీజేపీ రాజకీయ ఆయుధాలుగా మారిపోయాయన్న ఆరోపణలు మరింత బలపడ్డాయి. ఇటీవల మోడీ చేసిన 'జో లూటా వో లౌటానా హోగా' (దోచుకున్నది తిరిగి ఇవ్వాల్సిందే) వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నాయి. 'దోచుకున్న డబ్బు ప్రజలకు తిరిగి రావడం లేదు, బీజేపీ రాజకీయ ఖజానాకే చేరుతోంది' అని విమర్శిస్తున్నాయి. జిజెపికి అవినీతి మచ్చలతో సంబంధం లేదనీ, అధికారంలోకి వచ్చే అవకాశం ఉంటే ఎవరినైనా అంగీకరిస్తోందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

పదేళ్లలో రాజకీయ నాయకులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) పెట్టిన 190కు పైగా కేసుల్లో రెండింటిలోనే అరెస్టులు జరిగాయి. ఈ మేరకు 2025 మార్చిలో పార్లమెంటుకు కేంద్రమే

స్వయంగా తెలిపింది. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్, స్క్రోల్ వంటి వార్తా సంస్థలు ఈ వ్యవహారాన్ని దర్యాప్తు చేసి, ఈడీ విచారించింది 90 శాతం మంది ప్రత్యర్థి పార్టీలపై కేంద్ర దర్యాప్తు సంస్థల చర్యలలో వేగం పెరగడాన్ని 'ది వైర్' నివేదించింది.

**ముగింపు :** కాంగ్రెస్ ముక్త్ భారత్ నినాదాన్ని ప్రచారంలో పెట్టిన నరేంద్ర మోడీ అసలు లక్ష్యం ఏకంగా ప్రతిపక్ష రహిత వ్యవస్థే. ఇప్పటిదాకా ఏదో ఒక రూపంలో 41 మంది ఎమ్మెల్యేలను బెదిరించో, బుజ్జగించో బీజేపీలో చేర్చుకున్నారు. క్రమంగా మనం ఒకేదేశం ఒకేపార్టీ వ్యవస్థవైపు వెళ్తున్నామేమో అనిపిస్తోంది. మోడీ హయాంలో ప్రతిపక్షాల రాజకీయాలు అసంభవం అవుతున్నాయి. తన అధికారాన్ని న్యాయబద్ధం చేయడానికి మాత్రమే మోడీకి ఎన్నికలు కావాలి. ఎదిరించే వారెవరూ లేకుండా ఎన్నికలు ఉండాలన్నది మోడీ అంతరార్థం. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అవినీతికి పాల్పడితేనే నేరమన్న సంకేతాలను బీజేపీ ఇస్తున్నది. మోదీ హయాంలో ముఖ్యమంత్రి బంగాళాకు వెళ్లేందుకు సైద్ధాంతిక నిబద్ధతతో ఏ మాత్రం పనిలేదని, అవినీతి ఆరోపణలు వచ్చిన వెంటనే సరైన సందర్భంలో పార్టీ మారితే సరిపోతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఇటీవల ఆమ్ ఆద్మీ పార్టీ ఏడుగురు ఎంపీల పార్టీ ఫిరాయింపును రాజ్యసభ అధ్యక్షులు శంఖంలో పోసేశారు. సంజయ్‌సింగ్ పెట్టుకున్న అభ్యర్థనపై విచారణ ఎప్పుడు జరుగుతుందో తెలియదు. జరగకపోనూవచ్చు. జరిగినా ఈలోగా ఫిరాయించిన ఎంపీల పదవీ కాలం ముగియనూవచ్చు. ఆమ్ ఆద్మీకి చెందిన ఏడుగురు ఎంపీలు బీజేపీలో చేరిపోవడంలో ఆశ్చర్యం లేదు. ఈ ఎంపీలను పార్లమెంటు సభ్యులుగా అనర్హులుగా ప్రకటించకుండా రాజ్యసభ అధ్యక్షులు సి.పి.రాధాకృష్ణన్ వారిని బీజేపీ సభ్యులుగా గుర్తించడంలోనూ విస్తుపోవాల్సింది ఏమీలేదు. పార్టీ ఫిరాయింపుల విషయంలో చట్టసభ అధిపతులదే నిర్ణయాధికారం అయినప్పుడు, సభాపతులు సహజంగా అధికార పార్టీకి చెందిన వారైనప్పుడు, పార్టీ ఫిరాయింపును నిషేధించే సదుద్దేశంతో రూపొందించిన రాజ్యాంగంలోని పదవ షెడ్యూలులోనే పూడ్చలేనన్ని లొసుగులు ఉన్నప్పుడు ఫిరాయింపుదార్లకు అగ్రాసనం లభించడం సహజమే. ఇక అవినీతి అంతమెక్కడ? ❑

## కాక్రోచ్ వ్యాఖ్యల నుంచి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వరకు

**(9వ పేజీ తరువాయి)**

ఈ ఉద్యమమే మొదలయ్యేది కాదు" అని వ్యాఖ్యానిస్తూ, పరోక్షంగా జస్టిస్ సూర్యకాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

**10.విశ్లేషణ - ఇది ఎందుకు ప్రాధాన్యం సంతరించుకుంది?**

మోదీ మూడోసారి అధికారంలోకి వచ్చాక, ఒక నిరసన ఉద్యమం ఒత్తిడితో మంత్రి రాజీనామా చేయాల్సి రావడం అరుదైన పరిణామం. భారత్‌లో పరీక్ష పేపర్ లీకులు కొత్త కాదు – 2024లోనూ నీట్ పేపర్ కొన్నిచోట్ల లీక్ అయినా, అప్పుడు పునఃపరీక్ష ఆదేశించలేదు. అయితే 2026 నాటి స్థాయి, తీవ్రత భిన్నమైనవి. నిరుద్యోగం, పరీక్షా వ్యవస్థపై నమ్మకం సన్నగిల్లడం వంటి లోతైన సామాజిక సమస్యలు యువతను ఏకతాటిపైకి తీసుకురావడంలో ఈ ఉద్యమం కీలక పాత్ర పోషించింది. సాంకేతికంగా వ్యంగ్యంగా మొదలైన ఒక "పార్టీ" (CJP), కొన్ని వారాల్లోనే దేశ రాజకీయాల్లో నిర్ణాయక శక్తిగా ఎదగడం ఈ పరిణామాల్లో అత్యంత గమనార్హమైన అంశం. వారి పోరాటం ముగిసిన తర్వాత ఆందోళన చేసిన ప్రాంతం మొత్తం విద్యార్థులు శుభ్రం చేయటం కొసమెరుపు. ❑

## నైతిక డొల్లతనం మీద విద్యార్థుల తిరుగుబాటు

**(7వ పేజీ తరువాయి)**

ఆ సామ్రాజ్యవాదులతో సమీకృతమైన గుత్తపెట్టుబడిదారీ వర్గం ఒత్తిడితో తీసుకువచ్చిన మార్పులను రైతు ఉద్యమం వ్యతిరేకించి పోరాడుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవస్థీకృతమైన మార్పులను వేటినీ ఈ ప్రభుత్వం ప్రజలకు అనుకూలంగా తీసుకువచ్చే పరిస్థితి లేదు. అందుచేత ఈ నయా ఫాసిస్టు ప్రభుత్వం, తన ప్రతిష్ట మసకబారినప్పటికీ, ప్రజల్లో సృష్టించిన భయోత్పాత వాతావరణం చెదిరిపోయినప్పటికీ, మళ్లీ వాటిని పునః ప్రతిష్టించేందుకు తన సర్వశక్తులనూ ఒడ్డుతుంది. రాబోయే రోజుల్లో మెజారిటీ ప్రజా సమూహాన్ని మతతత్వ భావోద్వేగాలకు మరింత ఎక్కువగా లోనయ్యేట్టు చేయడం, మత ఘర్షణలను సృష్టించడం, పొరుగు దేశాలతో సరిహద్దు వివాదాలను రెచ్చగొట్టడం (ప్రస్తుతం డొనాల్డ్ ట్రంప్ దక్షిణాసియా దేశాల వ్యవహారాలన్నీ తన కనుసన్నల్లోనే జరగాలని పట్టుబడుతున్న నేపథ్యంలో ఇది కొంత కష్టసాధ్యం కావచ్చు) ఉద్యమాల "నాయకత్వాన్ని" లోబర్చుకోవడం కోసం ప్రయత్నించడం వంటివి ఈ ప్రభుత్వం వైపు నుంచి జరుగుతాయి. ఈ నయా ఫాసిస్టుల మోసాన్ని, కాపట్యాన్ని, అన్నింటినీ మించి దాని విద్వేష రాజకీయాలని ఎండగట్టడంలో విద్యార్థి ఉద్యమం అమోఘమైన పాత్ర పోషించింది. "అధినాయకుడికి" తిరుగే లేదన్న ఒక భ్రమ ను పటాపంచలు చేసింది. కొన్నేండ్లుగా దేశాన్ని ఆవరించిన భయోత్పాత వాతావరణాన్ని చెదరగొట్టింది. ఈ నయా ఫాసిస్టు పాలన రాజకీయంగా సవాలు చేయగల దారిని అది చూపించింది. ❑

# నెహ్రూ, అంబేద్కర్ : దళితులు, సంస్కరణలు



- ప్రొ.దేవరాజు మహారాజు

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఈ దేశ తొలి ప్రధానిగా సుమారు పదిహేడు (1947-1964) సంవత్సరాలు అహో రాత్రులు శ్రమించారు. తన వందల కోట్ల ఆస్తి యావత్తూ ఈ జాతికి అంకితం చేశారు. తన సర్వశక్తుల్ని ఈ దేశ నిర్మాణానికి ధారపోశారు. అలాంటి మహామనీషి ప్రపంచ చరిత్రలోనే చాలా అరుదుగా కనిపిస్తారు. ఇప్పుడు ఆయన స్థాయిని తగ్గించి మాట్లాడుతున్న వారు తమను తాము ఎంత నీచమైన స్థానానికి దిగజార్చుకున్నారో అర్థం చేసుకోవడం లేదు. ఆయన కాలంలో దేశం వైజ్ఞానికంగా, పారిశ్రామికంగా ప్రగతి పథాన నడవడమే కాదు, ప్రాజెక్టుల నిర్మాణంలోనూ, వ్యవసాయ రంగంలోనూ గొప్పగా రాణించింది. ఆనాడు దేశంలో ఉన్న ఫ్యూడల్ విధానాల్ని రూపుమాపుతూ ఆయన చేస్తూ వచ్చిన సంస్కరణలు దేశాన్ని ఒక ప్రజాస్వామ్య దేశంగా నిలబెట్టాయి. ఆయన పంచవర్ష ప్రణాళికల గూర్చి, అలీన విధానం గూర్చి తెలుసుకుని ప్రపంచం హర్షించింది.



## నెహ్రూ కాలంలో జరిగిన ముఖ్యమైన సంస్కరణలు

- 1.1951లో రాజ్యాంగానికి మొదటి సవరణ ఆర్టికల్ 15 (4)కు జరిగింది.
- 2.1953 జనవరి 29న కాకా కాలేల్కర్: మొదటి వెనకబడిన తరగతుల కమిషన్.
- 3.1955- పౌరహక్కుల సంరక్షణ చట్టం.

ఈ మూడు స్వతంత్ర భారత చరిత్రలో చాలా కీలకమైనవి. అంతవరకు ఉన్న ఫ్యూడల్ వ్యవస్థ చీకట్లను ఛేదించడానికి ఇవే కాగడాలయ్యాయి. స్వాతంత్ర్యం లభించే నాటికి సాగవుతున్న భూముల్లో ఎనభై శాతం అగ్రవర్ణ జమీందార్లు/దొరలు/భూస్వాముల ఆధీనంలో ఉండేవి. కోట్లల్లో ఉన్న మిగతా జనం కూలీలుగా, కట్టు బానిసలుగా ఉండేవారు. నెహ్రూ ప్రభుత్వం వచ్చిన తరువాత జమీందారీ రద్దు చట్టం(1950) అమలులోకి వచ్చింది. దున్నేవాడికి భూమి దక్కాలని లక్షల మందికి భూములు పంచిపెట్టి, వారికి ఆ భూమి మీద అన్ని హద్దులూ ఇచ్చారు. ఇది దేశంలో ఒక గొప్ప మార్పునకు నాంది పలికింది. ఇప్పటి ప్రభుత్వపు కుంచిత మనస్తత్వంలాగా కాకుండా నెహ్రూ రాజకీయాలకు అతీతంగా ఆలోచించి, డా.బి.ఆర్. అంబేద్కర్‌ను ఈ దేశానికి తొలి న్యాయశాఖా మంత్రిగా చేశారు. అంబేద్కర్ నేపథ్యం తెలిసినవాడు గనక, జీవితాంతం నిరాదరణకు గురవుతూ, సంఘర్షించి వచ్చినవాడే న్యాయ శాఖ మంత్రి అయితే, అణగారిన వర్గాలకు, అసహాయులకు, ఆదివాసీలకూ అందరికీ సమన్యాయం లభిస్తుందన్నది నెహ్రూ భావన! తొలిదశలో తీసుకున్న ఈ సరైన నిర్ణయం దేశాన్ని సమానత్వం దిశగా నడిపించింది.

మొదటి పంచవర్ష ప్రణాళికలో(1951-56) నెహ్రూ ప్రభుత్వం రూ.39 కోట్లు షెడ్యూలు కులాలకు (ఎస్సీ,ఎస్టీ) కేటాయించింది. దేశ అభివృద్ధికి కేటాయించిన ఆనాటి నిధులలో ఇది ఎక్కువ మొత్తం. దేశంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రాముఖ్యమివ్వాలన్నదే ఆనాటి ప్రభుత్వ నిర్ణయం వెనక ఉన్న ప్రధాన ఉద్దేశం. ఆ తరువాత రెండో పంచవర్ష ప్రణాళిక (1956-1961)లో ఆ మొత్తాన్ని నాటి ప్రభుత్వం 91 కోట్లకు పెంచింది. ఇంత ఎక్కువ మొత్తం దేనికంటే- చదువు, ఆరోగ్యం లేక, వసతులు లేక అల్లల్లాడుతున్న షెడ్యూలు కులాల వారిని దృష్టిలో ఉంచుకుని వారికి అనువైన చోట్ల బావులు తవ్వించడం, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు కొన్ని లక్షల మంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం జరిగింది. ఆ రోజుల్లో మద్రాసు (తమిళనాడు)

రాష్ట్రం నుంచి రిజర్వేషన్‌కు సంబంధించి ఒక జటిల సమస్య ఎదురైంది. దాన్ని ఎదుర్కోవడానికి నెహ్రూ మొదటి రాజ్యాంగ సవరణ (1951)లో 15 (4) చేర్చారు. దానివల్ల రాష్ట్ర ప్రభుత్వాలు షెడ్యూలు కులాల వారికి ప్రత్యేక సదుపాయాలు కలిగించగలిగాయి. అణగారిన వారు అశ్రద్ధకు గురికాకుండా IIT/AIIMSలలో, ప్రభుత్వ ఉద్యోగాలలో వారికి సముచిత స్థానం లభించింది.

ప్రధానికాక ముందు నుంచే నెహ్రూ దళితవాడలకు వెళ్లేవాడు. వారి బావుల నుంచి నీళ్లు తాగేవాడు. వారితో కలిసి భోజనం కూడా చేసేవాడు. అది భరించలేని కొందరు కాంగ్రెస్ సంప్రదాయవాదులు 'ధర్మం భ్రష్టుపడుతోంది' అని విమర్శించారు. అయినా ఆయన పట్టించుకోలేదు. అందువల్ల నెహ్రూ మీద, గాంధీ మీద రాళ్లు విసిరిన వారున్నారు. నల్ల జెండాలు ప్రదర్శించిన వారున్నారు. 1933-34 నాటి గాంధీ 'హరిజన్ యాత్ర'లో నెహ్రూ చురుకుగా పాల్గొన్నారు. ఈ అనుభవాలు ఊరికే పోలేదు. ప్రధాని అయ్యాక 'భారతీయ ఆదిమ జాతి సేవా సంఘం'-'హరిజన్ సేవా సంఘం' వంటి వాటికి తన కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా నిధులు మంజూరు చేశాడు. ఇలాంటి సంఘాలు స్వాతంత్ర్యం లభించిన తర్వాత 1948లో ఏర్పడ్డాయి. వాటిని నెహ్రూ ప్రభుత్వం గుర్తించింది. చదువుకునే షెడ్యూలు కులాల విద్యార్థుల కోసం దేశవ్యాప్తంగా హరిజన హాస్టళ్లు ప్రారంభించింది. పరిపాలనా వ్యవహారాల్లో ఉన్నత వర్గానికి చెందిన ఉన్నతాధికారుల జోక్యం తగ్గించడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం 1950లలో తొలి ఎస్సీ, ఎస్టీ కమిషనర్ల నియామకం జరిగింది. మధ్యలో ఎవరో ఒకరు వీరిమీద పెత్తనం చేయకుండా వీరిని నేరుగా ప్రధాని కార్యాలయానికి అనుసంధానం చేశారు. ఫ్యూడల్ వ్యవస్థ, పెత్తందారీ ఆధిపత్యం బలంగా ఉన్న రోజులవి. అప్పటికి అణగారిన వర్గాల వారంతా మెడకు ముంత, నడుమును చీపురు కట్టుకుని నడవాల్సిన పరిస్థితి ఉండేది.

ఆ అమానవీయ పద్ధతుల్ని రూపుమాపడానికి నెహ్రూ 'అస్పృశ్యత : నేరం' అనే చట్టం 1955లో తీసుకొచ్చారు. అస్పృశ్యత పాటించే వారిని ఎప్పుడైనా, ఎక్కడైనా వారెంట్ లేకుండానే అరెస్టు చేసే అధికారం పోలీసులకు ఇచ్చారు. ఇది బాగా పనిచేసింది. చాలా తక్కువ సమయంలో ముంత-చీపురు వ్యవహారం సమసి పోయింది. దీనితోపాటు మొదటి సార్వత్రిక ఎన్నికలు జరగగానే 1952లో నెహ్రూ ప్రభుత్వం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఒక సీరియస్ సర్క్యులర్ పంపించింది. దళితుడు ఎవరైనా మంచి బట్టలు వేసుకుంటేనో, మీసాలు పెంచుకుంటేనో, ఘనంగా ఊరేగితేనో అతని మీద ఎవరైనా దాడిచేసి హింసిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలన్నది దాని సారాంశం! డిస్ట్రిక్ట్ మెజిస్ట్రేట్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసులు స్వయంగా వెంటనే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందనీ, లేకపోతే వారిపై శాఖాపరమైన చర్యలుంటాయని ఆ సర్క్యులర్ హెచ్చరించింది. ఇందులోని చాలా విషయాలు ప్రస్తుత ఆర్ఎస్ఎస్ - బీజేపీ ప్రభుత్వ (2014-26) విధానాలతో పోల్చిచూస్తే తేడా తెలుస్తుంది. నెహ్రూ ఆనాడు తీసుకున్న అన్ని నిర్ణయాలకు ఇప్పటి ప్రభుత్వం వ్యతిరేకంగా పనిచేస్తోంది. కావాలని ద్వేషపూరితమైన ప్రసంగాలు చేసి, జనాన్ని విడగొట్టాలని చూస్తోంది. మైనార్టీలను, దళితులను హింసించడం అలా ఉంచి, హిందువులను కూడా బతకనివ్వడం లేదుకదా? 'హిందువులంతా నా బంధువులు' అనే మాటను అపహాస్యం చేస్తున్నారు.

'హిందువులు ప్రమాదంలో ఉన్నారు' అని ప్రచారం చేస్తూ వారినే ప్రభుత్వం ప్రమాదంలో పడేస్తోంది. తరతరాలుగా ఇక్కడ పుట్టి పెరిగిన జనాన్నే 'మీరు ఈ దేశ పౌరులేనా?' అని ప్రశ్నిస్తూ, చూపించే పత్రాలేవీ పనికి రావని చెబుతూ భయ భ్రాంతులను చేస్తోంది. ఆర్ఎస్ఎస్, బీజేపీ, విశ్వ హిందూ పరిషత్ వంటి వారి అనుబంధ సంస్థల్లో ఉన్న వారినే - ఈ దేశ పౌరులుగా గుర్తించేట్టుగా కనిపిస్తోంది. దేశచరిత్రలో ఇప్పుడు ఒక చీకటికాలం నడుస్తోంది. నెహ్రూ వైజ్ఞానిక స్పృహకు పాధాన్యమిచ్చినవాడు. అలాగని దైవ విశ్వాసకుల్ని బాధపెట్టలేదు. వారి వారి ప్రార్థనా స్థలాల్ని కూల్చేయించలేదు. బీజేపీ వారు బాబ్రీ మసీదును కూలగొట్టారు. అది రాముడి జన్మస్థలమని అబద్ధాలు ప్రచారం చేసి, న్యాయమూర్తిని ప్రభావితం చేసి, తమకు అనుగుణంగా తీర్పు తెప్పించుకున్నారు. మసీదు అడుగున బౌద్ధ శిల్పాలు దొరికాయని ఆర్కియాలజీ విభాగం ఆధారాలు చూపింది. అయినా వీళ్లు అక్కడ అయోధ్యలో రామాలయం కట్టించారు. ఆ రాముడి పేరుతో రథయాత్రలు చేసి అధికారంలోకి వచ్చారు. ఇప్పుడు ఆ రాముడి పేరు చెప్పే జనాన్ని మళ్లీ మోసం చేశారు. జనం సమర్పించిన వేలకోట్ల రూపాయల డబ్బు, ఆభరణాలు దొంగిలించారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి, దేశ ప్రధాని బాధ్యత తీసుకోవాలి కదా? కనీసం తమ అసమర్థతను ప్రకటించుకుంటూ వారు దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలి కదా? వీరికి కుట్రలు, కుతంత్రాలు, అబద్ధాలు, విద్వేషాలు తప్ప, 'నైతికత' అనేది ఒకటి ఉంటుందని తెలియదు.

నెహ్రూ నైతిక పాలన అందించాడు. దేవాలయ ఆదాయాల్ని దోచుకోలేదు. రాజకీయాలకు మతం రంగు పులమలేదు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం శిధిలమైన ఆలయాల్ని పునర్నిర్మించింది. కానీ, ప్రచారం చేసుకోలేదు. ఎప్పుడూ ఏ విషయం లోనూ కొండంత రాగం తీయలేదు. అనాటి ప్రభుత్వం 38 వేల దేవాలయాల ఆస్తులను కాపాడింది. వాటిని ఆడిట్ చేయించింది. 1961లో మధ్యప్రదేశ్‌లోని ఖజురాహో దేవాలయం నుంచి

విగ్రహాల దొంగతనం జరిగితే, వెంటనే నెహ్రూ సిబిఐ దర్యాప్తు చేయించారు. అంతర్జాతీయ స్మగ్లర్ల నెట్‌వర్క్‌ను ధ్వంసం చేసి, దోషుల్ని జైలుకు పంపించారు. మరి ఇప్పటి ప్రభుత్వపు పనితీరు ఎలాఉందో దేశవాసులందరికీ తెలుసు. మరో విషయం చూడండి. 2014- 22 మధ్య 'నమామి గంగే' అనే పేరుతో గంగానదిని ప్రక్షాళనం చేస్తామన్నారు. రూ.20 వేల కోట్లు దోచేశారు. కానీ, గంగానది మాత్రం శుభ్రం కాలేదు. నెహ్రూ తర్వాత లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ ఇండియాన్ ఆర్కియలాజికల్ సర్వే (ASI) ను ప్రోత్సహించి, నిధులిచ్చి ఎన్నో ప్రాచీన దేవాలయాల్ని వెలుగులోకి తెచ్చారు. నెహ్రూ గానీ, ఆయన తర్వాత వచ్చిన ప్రధానులు గానీ ఎప్పుడూ ఎక్కడా ప్రచారాలు చేసుకోలేదు. దేవాలయాలను దోచుకోలేదు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఆర్ఎస్ఎస్ - బీజేపీ ప్రభుత్వం షెడ్యూల్ కులాల సబ్ ప్లాన్‌కు సంబంధించిన నిధుల్లో 45 శాతం తమ ప్రచార కార్యక్రమాలకు మళ్లించుకున్నది.

ఫలితంగా దళితుల విద్యారంగానికి అందాల్సిన నిధులు అందడం లేదు. మారుమూల గ్రామాల్లో పాఠశాలలు, హాస్టళ్లు మూతపడుతున్నాయి. స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా, మేకిన్ ఇండియా - అంటూ ప్రచారాల హోరు తప్ప, వాస్తవంగా అక్కడ జరుగుతున్నది ఏమీలేదు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కీము, ఎంటర్‌ప్యూనర్‌షిప్ స్కీములన్నీ మూతపడ్డాయి. అధిక ధరలతో సామాన్యుడు తిండి కూడా సరిగా తినలేకపోతున్నాడు. బడ్జెట్‌లో 65 శాతానికి పైగా ప్రధానీ, అతని సహచరులూ విదేశాలలో తిరగడానికి ఖర్చు పెడుతున్నారు. వృద్ధుల, మహిళల సంక్షేమానికి, సంరక్షణకు ఖర్చు పెట్టాల్సిన నిధులూ-వారికి ఇవ్వాల్సిన పెన్షన్లూ నానాటికీ తగ్గిపోతున్నాయి. అంతేకాదు 2014 నుంచి ఈ దేశంలో మరొక ప్రమాదకరమైన దృశ్యం కనిపిస్తోంది. స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్న ఆనాటి దేశ నాయకులపై బీజేపీ సోషల్ మీడియా వికృతమైన ప్రచారాలు చేస్తోంది.

యధార్థాలు తెలుసుకోని నేటి యువతరాన్ని విపరీతంగా ప్రభావం చేస్తోంది. తమ తండ్రులు, తాతలు నెహ్రూ పాలసీల వల్ల గౌరవంగా బతకగలిగారన్నది తెలుసుకోలేకపోతున్నారు. నెహ్రూను నాటి స్వాతంత్ర్య పోరాట నాయకుల్నీ అవహేళన చేయడం, ప్రస్తుతం అధికారంలో ఉన్నవారు ఒక ఫ్యాషన్‌గా మార్చేశారు. అయితే వారికి కాలం తప్పక గుణపాఠం నేర్పు తుంది. నైతికత, వైజ్ఞానిక స్పృహ, కనీసం ఇంగిత జ్ఞానం లేని నేటి పాలకుల నిజస్వరూపం బయట పడుతూనే ఉంది. దేశ ప్రజలు నిజాలు గ్రహిస్తూనే ఉన్నారు. ఉద్యమాలకు ఉద్యుక్తుల వుతూనే ఉన్నారు. ఒక చీకటి యుగాన్ని స్వర్ణయుగమని చేసు కుంటున్న ప్రచారం ప్రపంచం నిశితంగా పరిశీలిస్తోంది! ❑

**(నవతెలంగాణ సౌజన్యంతో)**

## ప్రజాస్వామ్యంపై దమనకాండ!

దేశ రాజధాని ఢిల్లీలో
యువతపై లాఠీఛార్జి - దేశ
భవిష్యత్తుపై బాష్పవాయువు !
తల్లిదండ్రుల ఆశలపై పెల్లెట్ గన్స్ !!
పేరు లేని దుండగుల వీరంగం
సంస్కృతీ సంప్రదాయాల వీరులు, ఇక్కడ
అమ్మాయిల గుడ్డలు చించేశారు-
వీళ్లసలు పోలీసులేనా? లేక
పోలీసు యూనిఫాముల్లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలా?

అబద్ధాల్ని, అక్రమాల్ని శాంతియుతంగా ఎదుర్కొన్న
'బొద్దింకలు'-ఇంకా కొట్టండని-నిలబడ్డారు.
చంపినా ఫరవాలేదని తెగబడ్డారు
బ్రిటిష్ తూటాలకు ఎదురు నిల్చిన నాటి,
స్వాతంత్ర్య పోరాట యోధులు గుర్తుకొచ్చారు -
నాటి 'జలియన్ వాలా బాగ్' ఉదంతం చూడలేని ఈ తరానికి
ఢిల్లీలో ఈ బీజేపీ ప్రభుత్వం, ప్రత్యక్షంగా చూపించింది.
గుజరాత్ మారణకాండ, మణిపూర్ మారణకాండల గురించి
ఈ తరం యువతీ యువకులకు పూర్తిగా తెలిసి ఉండదు,
అందుకే ఇక్కడ పార్లమెంట్ సాక్షిగా దాన్ని పునః ప్రసారం చేశారు
భవిష్యత్తుకు దారులు వేయలేని ఈ ప్రభుత్వం
ప్రతిరోజూ గతాన్ని తవ్వుతూనే ఉంటుంది కదా?
ఒకప్పుడు గాంధీ అహింసను కాల్చేసిన ఈ దుండగులు
నేడు యువత శాంతి ప్రదర్శనల్ని ఆదరిస్తారా?
కనీసం వారి ఆవేదన ఏమిటో వినే ఓపిక లేని వారు
ప్రశ్నకు భయపడి పార్లమెంట్ వెనక గేట్ నుంచి పారిపోతారు
యువతీ యువకులపై మాత్రం లాఠీలు, తూటాలు కురిపిస్తారు.
న్యాయం చేయడానికి న్యాయమూర్తులకు, వీడియోలు చూసే తీరిక లేదు
వ్యవస్థలన్నీ కుప్పగూలాయని చెప్పడానికి న్యాయదేవతకు ఇంతకన్నా సాక్ష్యం లేదు.
అసలు రాజీనామా చేయాల్సింది ప్రధాన్ కానే కాదు,
మొత్తం ప్రభుత్వమేనన్నది - ఈ దేశం కోరుకుంటున్నది!

**- ప్రొ.దేవరాజు మహారాజు**

# నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాష్ట్రాలకు హెచ్చరిక

- కె.విజయరావు




**పార్లమెంటు వర్షాకాల సమావేశాలలో నియోజకవర్గాల పునర్విభజన ప్రయత్నం దక్షిణాది రాష్ట్రాలకు ఆందోళన కలిగిస్తున్నది. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ అనేది దేశ భౌగోళిక రాజకీయ రూపురేఖలను, తద్వారా దాని భవిష్యత్తును మార్చే అత్యంత ప్రమాదకరమైన రాజకీయ ప్రయత్నం. ఇది దేశానికి తగిన ప్రయోజనాలను చేకూర్చకుండా, ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన భారాన్ని మోపుతుంది.**

543 మంది ఎంపీల నిర్వహణ ఖర్చు నిమిషానికి కనీసం రూ.2.5 లక్షలుగా అంచనా వేయబడింది. ప్రతి ఎంపీకి ప్రత్యక్ష జీతాల రూపంలో ఏడాదికి సుమారు రూ.35 లక్షల ఖర్చవుతుంది. దీనికితోడు ఉచిత ప్రయాణాలు, వైద్యం మరియు ఇతర ఖర్చులకు పరిమితి లేదు. అంతేకాకుండా, మాజీ ఎంపీలకు ఇచ్చే అహేతుకమైన పెన్షన్ పథకం వల్ల ఒక్కో వ్యక్తికి ఏడాదికి రూ.5–8 లక్షల ఖర్చవు తుంది. కాబట్టి, ఎలాంటి స్పష్టమైన ప్రయోజనాలు లేకుండా మరో 300 మంది ఎంపీలను చేర్చి, ఖర్చులను మరింత పెంచడం అర్థరహితం.

ప్రస్తుతం ఉన్న 543 మంది ఎంపీలలో కూడా, కేవలం 169 మంది ఎంపీలకు మాత్రమే మాట్లాడే అవకాశం లభిస్తుంది. అది కూడా అత్యంత కీలకమైన చర్చలలో సగటున 5–6 నిమిషాలు మాత్రమే. ఎంపీల భాగస్వామ్యాన్ని పెంచడానికి బదులు, మరో 300 మంది ఎంపీలను అదనంగా చేర్చడం వల్ల చర్చల నాణ్యత ఎలా పెరుగుతుంది?

చాలా వరకు బిల్లులు ఎలాంటి చర్చలు లేకుండానే ఆమోదం పొందుతున్నాయి. బడ్జెట్‌పై జరిగే అత్యంత ముఖ్యమైన చర్చలు సైతం కేవలం 17 గంటల చర్చకే పరిమితమవుతున్నాయి. నోట్ల రద్దు, మణిపూర్, వ్యవసాయ చట్టాలు, పెగాసస్, రాఫెల్, పార్లమెంట్ భద్రతా ఉల్లంఘన, యుద్ధాలు, ఎలక్టోరల్ బాండ్లు, ఎన్నికల సంఘం వంటి జాతీయ ప్రాధాన్యత కలిగిన విధానపరమైన అంశాలు తగినంత చర్చ జరగకుండానే పక్కన పెట్టబడుతున్నాయి. అలాంటప్పుడు ఇంకా ఎక్కువ మందిని ఎందుకు చేర్చాలి?

ఎంపీల సంఖ్యను పెంచడం అనేది గొలుసుకట్టు ప్రభావాన్ని




చూపుతుంది. దీనివల్ల రాష్ట్ర శాసనసభల స్థానాలను పెంచాల్సి వస్తుంది. రాష్ట్రాలు విద్య, ఆరోగ్యంపై ఖర్చు చేయాల్సింది పోయి, ప్రజలపై మరింత భారం పడుతుంది. రక్షణ రంగంతోపాటు దేశానికి స్థూల విధానపరమైన దిశా నిర్దేశాలు, ప్రాధాన్యతలను అందించడం కేంద్రం యొక్క రాజ్యాంగపరమైన పాత్ర. సమాఖ్య వ్యవస్థలో(ఫెడరలిజం) విధానాలను అమలు చేయడం మరియు క్షేత్రస్థాయిలో పనిచేయడం రాష్ట్రాల బాధ్యత. అందువల్ల, దాని స్వభావం రీత్యా, పార్లమెంట్ చిన్న పరిమాణంలో మరియు సువ్యవస్థితంగా ఉండాలి; అప్పుడే జాతీయ ప్రాధాన్యత కలిగిన ప్రతి విధానంపై లోతుగా, చర్చించడానికి, అవసరమైన మార్గదర్శకాలను అందించడానికి వీలవుతుంది. ఒకవేళ ప్రాతినిధ్య వాదననే సరైనదిగా భావిస్తే, పెంచాల్సింది రాష్ట్ర శాసనసభలను కానీ, పార్లమెంట్‌ను కాదు.

ప్రతి పౌరుడి మాట ముఖ్యమైనది కావడం అనేది ప్రజాస్వామ్యానికి పునాది. రాజ్యాంగ పరిషత్ (కాన్స్టిట్యూయంట్ అసెంబ్లీ) ఈ అవసరాన్ని గుర్తించింది. జనాభా నిష్పత్తికి అనుగుణంగా ప్రజల ప్రాతినిధ్యాన్ని పెంచడానికి నిబంధనలను కల్పించింది, అయితే అది వివేకవంతంగా మాత్రమే చేయాలి. అన్ని రాష్ట్రాలు

ఒకే విధమైన జనాభా వృద్ధిని సాధిస్తాయనేది నియోజకవర్గాల పునర్విభజన వెనుక ఉన్న ప్రాథమిక ఊహ. జనాభాను నియంత్రించడం, వృద్ధి, ఉపాధి కల్పనపై దృష్టి పెట్టాలని నిర్దేశించడం జరిగింది. దక్షిణాది రాష్ట్రాలు ఈ ఆదేశాన్ని శ్రద్ధగా పాటించగా, ఉత్తరాది రాష్ట్రాలు దీనిని ఉల్లంఘించాయి.

గతంలో కూడా నియోజకవర్గాల పునర్విభజన ప్రయత్నాలు జరిగాయి. కానీ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఆ నిర్ణయాన్ని వాయిదా వెయ్యడమే వివేకమని భావించారు. ఈ సంక్షోభాన్ని దాటడానికి అవసరమైన పరిస్థితులను సిద్ధం చేయడానికి బదులుగా, 16 ఏప్రిల్ 2026న ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన బిల్లును(Delimitation Bill) దానికి సరిపోయే రాజ్యాంగ(131వ సవరణ) బిల్లును ప్రవేశపెట్టింది. దీని ఉద్దేశం లోక్‌సభ స్థానాలను 543 నుంచి 850కి పెంచడం, 2026 తర్వాత జరిగే జనాభా గణన కోసం వేచి చూడకుండా, 2011 జనాభా లెక్కల ఆధారంగా ఈ ప్రక్రియను చేపట్టడం. అయితే, మూడింట రెండు వంతుల (2/3) మెజారిటీ లేకపోవడం వల్ల మరుసటి రోజే రాజ్యాంగ సవరణ బిల్లు ఓటింగ్‌లో విఫలమైంది. ఏప్రిల్‌లోనే ముగిసిపోయిందని అందరూ భావించిన ఈ బిల్లు, మళ్లీ 20 జూలై 2026న ప్రారంభమయ్యే ఈ వర్షాకాల సమావేశాలలో మొదటి ప్రాధాన్యత అంశంగా ముందుకువచ్చింది. తృణమూల్ కాంగ్రెస్, ఎన్‌సిపి, శివసేన, ఆప్, డిఎంకె, ఎస్పీ వంటి ప్రాంతీయ పార్టీలలో తమకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను ఉపయోగించి చీలికలు తీసుకురావడం ద్వారా మెజారిటీని సాధించడానికి బీజేపీ సరికొత్త ప్రయత్నం చేస్తోంది.

దక్షిణాది రాష్ట్రాల 24% ప్రాతినిధ్యాన్ని యథాతథంగా ఉంచుతామని హోంమంత్రి చేసిన ప్రకటన - సాంకేతికంగా ఆ వాటా కాపాడ బడినప్పటికీ - నిజం చెప్పాలంటే అది ఒక తప్పుదోవ పట్టించే అంశం మాత్రమే. దేశాన్ని ముక్కలు చేసే (బాల్కనైజేషన్) విత్తనాలను నాటే ప్రమాదం ఉన్నప్పటికీ, బీజేపీ నియోజకవ ర్గాల పునర్విభజనను తీసుకురావడానికి ఎందుకు అంత ఆసక్తిగా ఉంది. అది కూడా ఇంత తొందరపాటుతో ఎందుకు చేస్తోంది?

ఇది ఉత్తర భారతీయ ఆధిపత్యాన్ని బలోపేతం చేయడానికి ఉద్దేశించినది. వాస్తవానికి, పెద్ద సభ ఏర్పడినప్పుడు, దక్షిణాదికి దామాషా వాటా మారకుండా ఉన్నప్పటికీ, అది హిందీ ప్రాంతానికి(ఉత్తరాదికి) ఎక్కువ స్థానాలను కూటమిని (absolute bloc) అందిస్తుంది. ఇది మంత్రిత్వ శాఖల కేటాయింపు, కమిటీలు, వాయిస్ ఓట్ ద్వారా బిల్లుల ఆమోదం వంటి అధికారాన్ని నిర్ణయించే ప్రతి సంఖ్యను ప్రభావితం చేస్తుంది. భవిష్యత్తులో రాజ్యసభలోని సంఖ్యా పరంగా రాష్ట్రాలు లోబడి ఉండవలసిన నియమాలను వ్రాసే కమిటీలకు ఎవరు అధ్యక్షత వహిస్తారనేది ఇది నిర్ణయిస్తుంది. విప్ గణనలు (Whip counts), కమిటీల అధ్యక్ష పదవులు, క్యాబినెట్ పదవులు, ఎంపీ ల్యాడ్స్(MP LAD) నిధులు మరియు కూటమి ప్రభావాలు అనేవి సంపూర్ణ స్థానాల ఆధారంగా కేటాయించబడతాయి. విస్తరించిన సభలో ఉత్తరప్రదేశ్ మరియు బీహార్ రాష్ట్రాలు వరుసగా 63 మరియు 39స్థానాలను పొందుతాయని అంచనా; తమిళనాడు 10 స్థానాలను పొందుతుంది. కేరళకు ఏమీ లభించదు. దక్షిణాది రాష్ట్రాల వాదన ప్రభుత్వం తిరస్కరించలేని సంఖ్యాపరంగా ఆధారపడి ఉంది. దీనిని వారు కేవలం మార్చి చెప్పగలరు అంతే. 1971 మరియు 2011 మధ్య, బీహార్ జనాభా 147 శాతం, ఉత్తరప్రదేశ్ జనాభా 138 శాతం పెరగ్గా, తమిళనాడు జనాభా 75 శాతం, కేరళ జనాభా కేవలం 56 శాతం మాత్రమే పెరిగింది. ఆ తర్వాత ఈ వ్యత్యాసం మరింత పెరిగింది: కేరళ యొక్క మొత్తం సంతానోత్పత్తి రేటు(TFP) ప్రస్తుతంఒక మహిళకు 1.4 పిల్లలుగా ఉండగా, తమిళనాడులో 1.3గా ఉంది. దీనికి విరుద్ధంగా బీహార్‌లో 2.8, ఉత్తరప్రదేశ్‌లో 2.6గా ఉంది. బీహార్‌లో ప్రతి 1,000 మందికి దాదాపు 26గా ఉన్న జనన రేటు, తమిళనాడు యొక్క 13కి దాదాపు రెట్టింపుగా ఉంది ఈ వ్యత్యాసంలోని ప్రతి అంశం దక్షిణాది ఎంచుకున్న మరియు ఉత్తరాది అనుసరించడానికి నిరాకరించిన విధానాల ఫలితమే: మహిళా అక్షరాస్యత, ప్రజారోగ్య వ్యయం, ఆలస్యపు వివాహాలు, కుటుంబ నియంత్రణ వంటివి. కేవలం ముడి జనాభా ఆధారంగా చేసే పునర్విభజన, ఆయా విధానాల విజయాన్ని ఒక శిక్షగా (ప్రాతినిధ్య నష్టంగా) మారుస్తుంది.

దశాబ్దాలుగా జరుగుతున్న అధ్యయనాలు ఉత్తరాది ఆధిపత్యాన్ని స్థాపించడానికి ఒక స్థిరమైన నమూనాను ప్రదర్శిస్తున్నాయి: దశాబ్దాలుగా దక్షిణాది రాష్ట్రాలు ఉత్తరాదికి రాయితీలు ఇస్తున్నాయి (సబ్సిడీ ఇస్తున్నాయి). కర్ణాటక ముఖ్యమంత్రి ధృవీకరించిన ప్రకారం, రాష్ట్రం ఢిల్లీకి పంపే ప్రతి రూపాయికి కేవలం 13 నుంచి 15 పైసలు మాత్రమే తిరిగి పొందుతోంది8. జనవరి 2025 నాటి నెలవారీ పన్నుల బదిలీలో ఐదు దక్షిణాది రాష్ట్రాలు కలిసి పొందిన మొత్తం కంటే ఒక్క ఉత్తరప్రదేశ్ మాత్రమే ఎక్కువ నిధులను పొందింది ? జాతీయ జిడిపి(GDP)లో తమిళనాడు వాటా 8.5% దాటినప్పటికీ, డివిజబుల్ పూల్(పన్నుల పంపిణీ పూల్)లో దాని వాటా రెండవ ఆర్థిక సంఘం కింద 23.3% నుంచి 15.8%కి పడిపోయింది. పారిశ్రామిక, పన్నులను సృష్టించే మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్ వంటి రాష్ట్రాలు ఇప్పుడు పదహారవ ఆర్థిక సంఘం సూత్రం ప్రకారం ప్రతి రూపాయికి 35 నుంచి 55 పైసల మధ్య మాత్రమే తిరిగి పొందుతున్నాయి. అదే సమయంలో, బీహార్, ఉత్తరప్రదేశ్ పేదవి, ఎక్కువ జనాభా

**(మిగతా 20వ పేజీలో)**

# దేవుడి పేరిట మనుషుల పంతాలు : వందేళ్లనాటి గురజాడ ప్రశ్న

- మ్యాడం అభిలాష్

**"దేవుడు చేసిన మనుషుల్లారా.. మనుషులు చేసిన దేవుళ్ళారా.. మీ పేరేమిటి ?" అని కథ మొదట్లోనే గురజాడ వేసిన ఈ ఒక్క ప్రశ్న చాలు.. పాఠకుడి బుర్రలో ఆలోచనల తలుపులు తెరవడానికి. నిజానికి దేవుడు మనిషిని సృష్టించాడో లేదో కానీ, మనిషి మాత్రం తన స్వార్థం కోసం, పంతాల కోసం ఎన్నో దేవుడి రూపాలను సృష్టించుకున్నాడనేది పచ్చి నిజం. ఒక పక్క "మతములన్నియు మాసిపోవును - జ్ఞానమొక్కటి నిలిచి వెలుగును" అని నమ్ముతూనే, సమాజం దేవుడి పేరిట సాగించే వింత పోకడలను ఈ కథలో అత్యంత హేతుబద్ధంగా విశ్లేషిస్తూనే, అంతే వ్యంగ్యంగా కడిగిపారేశారు గురజాడ.**

మనిషి తనను తాను నియంత్రించుకోవడానికి పూజ అనే మార్గాన్ని ఎంచుకుంటే, అది కాస్తా మతోన్మాదంగా ఎలా మారిందో చూపించే సజీవ సాక్ష్యమే ఈ 'మీ పేరేమిటి?' కథ. ఈ కథకు వేదిక రామగిరి అనే గ్రామం. కథంతా ఒక రాత్రి సమయంలో గురు శిష్యుల మధ్య సాగే ఒక తాత్విక సంవాద రూపంలో నడుస్తుంది. రామగిరి కొండపై ఉన్న బుద్ధుడి విగ్రహాన్ని చూసిన శిష్యులకు ఒక సందేహం వస్తుంది. బుద్ధుడు విష్ణువు అవతారమే కాబట్టి అది వైష్ణవ రూపమని కొందరు, కాదు బుద్ధుడి తలపై ఉన్న జడలను బట్టి అది శివుడి రూపమేనని శైవులు.. ఇలా ఒకే విగ్రహాన్ని ఎవరికి నచ్చినట్లు వారు వాదించుకోవడం వెనుక ఉన్న మౌఢ్యం ఏమిటన్నదే ఆ సందేహం. ఈ మతపరమైన వ్యాఖ్యానాల వెనుక ఉన్న అసలు గుట్టును విప్పుతూ, శాయన్న భుక్త ఆ ఊరి గత చరిత్రను చెప్పడంతో ఆ కథ మరింత లోతుల్లోకి వెళ్తుంది.

ఈ కథలో గురజాడ సృష్టించిన పాత్రలు కేవలం వ్యక్తులు మాత్రమే కాదు, సమాజంలోని వివిధ మత దృక్పథాలకు ప్రతీకలు. శైవ మత ప్రతినిధి శరభయ్య, వైష్ణవ మత ప్రతినిధి మానవాళ్ళయ్య, విష్ణుక్షేత్ర ధర్మకర్త రంగాచార్యులు, ఆయన కొడుకు కృష్ణమాచార్యులు, కోడలు నాంచారమ్మ, బౌద్ధ మత విశ్వాసి రామ్మూర్తి, ఉపాధ్యాయుడు వెంకయ్య, ఊరి మునసబు రామి నాయుడు, పీరు సాహెబు.. ఇలా ప్రతి పాత్ర సమాజంలోని ఒక పార్శ్వాన్ని ఆవిష్కరిస్తుంది.



ఒకానొకసారి ఆ ఊరిలో శైవులకు, వైష్ణవులకు మధ్య ఉన్న పట్టింపులు, అహంకారాలు తారస్థాయికి చేరుకుంటాయి. ఒకరి భక్తికంటే మరొకరి భక్తి గొప్పదని నిరూపించుకోవడానికి వారు పడే తాపత్రయాన్ని గురజాడ తనదైన శైలిలో చిత్రించారు. శైవులు నిప్పుల గుండం తొక్కి తమ భక్తిని చాటుకుంటే, వైష్ణవులు తామేమీ తక్కువ కాదని మానవాళ్ళయ్యను నిప్పుల గుండం తొక్కించడానికి సిద్ధపడతారు. అయితే ప్రాణభయంతో ఆయన తప్పించుకోవడానికి చూసే ఘట్టం మనుషుల అంతరంగంలోని లౌక్యాన్ని, మత పిచ్చి వెనుక ఉన్న భయాన్ని బయటపెడుతుంది.

ఈ సందర్భంలోనే నాంచారమ్మ పాత్ర ద్వారా గురజాడ ఒక సామాజిక మలుపు తిప్పారు. ముస్లింలు సైతం వైష్ణవులలో భాగమేననే సరికొత్త సమీకరణాన్ని తెచ్చి, పీరు సాహెబు చేత పీరును పట్టించి గుండం తొక్కిస్తారు. మతాల మధ్య ఉండే కఠినమైన గీతలను సామాజిక అవసరాలు ఎలా చెరిపేస్తాయో చెప్పడానికి ఇదొక చక్కని ఉదాహరణ. ఆ తర్వాత ఆ పీరు త్రిశూలాకారంలో ఉందని శైవులు, విష్ణునామంలా ఉందని వైష్ణవులు పూజించడం మనుషుల స్వార్థపూరిత వ్యాఖ్యానాలకు అద్దం పడుతుంది. "విష్ణువూ శివుడూ పీరుగా మారినప్పుడు, బుద్ధుడు పీరు కాకూడదా?" అన్న శాయన్న భుక్త ప్రశ్న, మతాల సంకుచితత్వాన్ని నిలదీస్తుంది. ఇలా.. ఈ కథ పొడుగునా గురజాడ చాలినన్ని హేతుబద్ధమైన, వైచారికమైన సంభాషణలను చొప్పించారు. అవి నేటికీ మన సమాజానికి మార్గదర్శకాలుగా నిలుస్తాయి. మన దేశంలో ఏ చారిత్రక లేదా సహజ సిద్ధమైన ప్రదేశాన్ని చూసినా దానికి పురాణ గాథలను ముడిపెట్టి నిజమని నమ్మించే పద్ధతిపై గురజాడ విసిరిన వివేకవంతమైన చురకలు కూడా కథలో కనిపిస్తాయి. "ఈ దేశంలో పాండవులు

ఉండని గుహలు, సీతమ్మ స్నానమాడని గుంటలూ లేవు" అంటూ ఆయన చేసిన హాస్య వ్యాఖ్యానం సామాజిక భ్రమలపై గురజాడకున్న స్పష్టమైన అవగాహనకు నిదర్శనం. అలాగే, ఆచారాల పేరిట ప్రాణాలను సైతం పణంగా పెట్టే మూఢత్వాన్ని ఖండిస్తూ, దైవత్వంపై ఉండాల్సింది ఆత్మస్థైర్యాన్ని ఇచ్చే అంతర్గత నమ్మకమే కానీ బాహ్య ప్రదర్శనలు కావని ఆయన ప్రబోధించారు. "రాముడే కాదు, ఏ దేవుని మీదనైనా నిజమైన నమ్మకమన్నది ఏడిస్తే ఒక్క గుండమే కాదు, అన్ని కష్టాలూ తరించవచ్చు" అనే వాక్యం ద్వారా నిజమైన విశ్వాసానికి ప్రతీకను అందించారు.

రూపాలు, పేర్లు వేరైనా అంతిమంగా సత్యం ఒక్కటేననే తాత్విక సమన్వయాన్ని గురజాడ శాయన్న భుక్త పాత్ర ద్వారా ఆవిష్కరించారు. "శివుడన్నా, విష్ణువన్నా, బుద్ధుడన్నా, పీరన్నా పరమాత్మ మాత్రం ఒక్కడే కదా!" అన్న వాక్యం సర్వమత సమానత్వాన్ని వివరిస్తుంది. అయితే, దేవుళ్లంతా ఒక్కటే అని ఒప్పుకుంటూనే, ఆచరణలోకి వచ్చేసరికి పూజల దగ్గర మనుషులు విడిపోవడాన్ని చూసి కలిగిన తీవ్ర ఆవేదనను, ఆక్రోశాన్ని వెంకయ్య నోట పలికించిన పదునైన మాటల్లో గురజాడ ప్రతిఫలించారు. "అందరు దేవుళ్ళు ఒక్కరే అయితే, ఆ పీనుగుల్ని అందరినీ ఒక్కచోటే నిలిపి అందరూ కలిసి పూజ తగలెట్టరాదా?" అని వెంకయ్యతో అనిపించడం మత సమాజంపై ఒక శరాఘాతంగా నిలిచింది.

గురజాడ అప్పారావు గారి దృష్టిలో మతం అనేది మనిషి తన ఆధ్యాత్మిక, నైతిక, బౌద్ధిక వికాసం కోసం నిర్మించుకున్న ఒక సాధనం మాత్రమే. కానీ హేతువు లేని పూజలు, విచక్షణా రహితమైన పద్ధతులు మనిషిని వెనక్కి నెడుతున్నాయని ఆయన ఈ కథ ద్వారా బలంగా ఆక్షేపించారు. 'మీ పేరేమిటి?' కథ కేవలం నాటి శైవ-వైష్ణవ వైరాన్ని మాత్రమే కాదు, నేటికీ సమాజంలో వేర్వేరు రూపాల్లో వేళ్లనుకుపోయిన మతోన్మాదాన్ని, సంకుచితత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటుంది. మతాల పేరిట విడిపోయే కన్నా, జ్ఞానమనే వెలుగులో మానవత్వాన్ని వెతుక్కోవాలి.. అన్నదే ఈ కథ మనకు అందించే పరమార్థం. పదునైన సంభాషణలు, సజీవమైన పాత్రలతో సాగే ఈ కథ తెలుగు సాహిత్య చరిత్రలో ఎప్పటికీ ఒక దార్శనిక రూపమే. ❑

---

# నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాష్ట్రాలకు హెచ్చరిక

**(18వ పేజీ తరువాయి)**

కలిగినవి అనే కారణంతో ఇదే సూత్రం వాటికి ఎక్కువ నిధులను బహుమతిగా ఇస్తోంది. ఆర్థిక సంఘం దీనిని సమసమాజం (ఈక్విటీ) అని పిలుస్తుంది. పాఠశాలలు, క్లినిక్‌లపై ఐదు దశాబ్దాలపాటు పెట్టుబడి పెట్టిన రాష్ట్రాలు మంచి పాలన అందించినందుకు శిక్షించబడుతున్నాయి.

రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ రాజకీయం ఈ నమూనాను సమర్థిస్తోందే తప్ప వ్యతిరేకించడం లేదు. రాజకీయంగా, 240 మిలియన్లకంటే ఎక్కువ జనాభాతో దేశంలోనే అత్యంత భారమైన పరిపాలనా విభాగంగా ఉన్న ఉత్తరప్రదేశ్ – హరిత్ ప్రదేశ్, పూర్వాంచల్, బుందేల్‌ఖండ్, అవధ్ ప్రదేశ్ వంటి ప్రతి తీవ్రమైన విభజన ప్రతిపాదన నుంచి బ్రతికిబట్టకట్టింది. ఎందుకంటే పార్లమెంటరీ మెజారిటీని అత్యంత నమ్మకమైన సంఖ్యలో అందించే ఈ ఒక్క రాష్ట్రాన్ని బలహీనపరచడానికి ఏ జాతీయ ప్రభుత్వం ఇష్టపడలేదు. మహారాష్ట్ర పరిస్థితి ఇదే విధంగా ఉంది. రాజకీయంగా అనుకూలమైనప్పుడు చిన్న రాష్ట్రాలను విభజించడానికి కేంద్రం ఏ మాత్రం సంకోచించలేదు. సదరు రాష్ట్రాల అసెంబ్లీ తీర్మానాలు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ వెనకాడలేదు : 2014లో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ విడిపోయింది, 2000లో బీహార్ నుంచి జార్ఖండ్ విడిపోయింది. నెహ్రూ కాలంలో, మరియు ఆధారాల ప్రకారం 1952-1991 మధ్య కాలంలో, అన్ని రాష్ట్రాలలో భారీ పరిశ్రమల వ్యూహాత్మక స్థాపనతో సాపేక్షంగా సమతుల్య ప్రాంతీయ పంపిణీ ఉండేది. 1991-2014 సరళీకరణ విధానాలు ప్రైవేట్ పెట్టుబడులకు మరియు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (FDI) ఊతం ఇచ్చాయి. ముఖ్యంగా ఐటీ (IT) రంగం కారణంగా దక్షిణాది, పశ్చిమ రాష్ట్రాలు లాభపడ్డాయి. 2014-2026 కాలం ఉత్తరప్రదేశ్, గుజరాత్ మరియు సరిహద్దు ప్రాంతాలలో కేంద్ర మూలధన వ్యయంలో (capital expenditure) గణనీయమైన పెరుగుదలను చూసింది. దీనిని బట్టి కేంద్రం స్పష్టంగా ఉత్తరాదిపైనే ఎక్కువ మొగ్గు చూపిందని ఊహించవచ్చు.

కేంద్రంలో ఉన్న ఐఏఎస్ (IAS) అధికారుల నిష్పత్తి – అత్యంత సీనియర్ బ్యూరోక్రాటిక్ పోస్టింగ్‌లను భర్తీ చేసే పూల్ – 2014 లో దక్షిణాది రాష్ట్రాలకు గల 14% వాటా నుంచి నేడు 6.6% కి పడిపోయింది. ప్రస్తుత కేంద్ర క్యాబినెట్‌లో అత్యంత కీలకమైన నాలుగు పోర్ట్‌ఫోలియోలు – హోం, రక్షణ, ఆర్థిక మరియు విదేశీ వ్యవహారాలు – ఈ ఐదు శాఖలు దక్షిణాది రాష్ట్రాల వెలుపల ఉన్న మంత్రుల వద్దే ఉన్నాయి. బీజేపీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేయడానికి ప్రయత్నిస్తున్న వేగం మరియు విధానం, రాజకీయ ఆధిపత్యం కోసం వారికున్న ఏకైక ఎజెండాను బట్టబయలు చేస్తోంది. ఇది దక్షిణాది రాష్ట్రాలకు బలమైన, ప్రమాదకరమైన సంకేతాన్ని పంపుతోంది. ❑

# రాహుల్ సాంకృత్యాయన్‌ను చూసి ఎవరు భయపడుతున్నారు ?

- మాలిని భట్టాచార్య



**జూ**లై 20 అర్ధరాత్రి సమయంలో పశ్చిమ బెంగాల్‌లోని పారిశ్రామిక నగరమైన రాణీగంజ్‌లో ప్రధాన కూడలిలో నెలకొల్పిన మహాపండిత రాహుల్ సాంకృత్యాయన్ పూర్తి ఆకారపు విగ్రహాన్ని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి తీసుకెళ్లారు. మరుసటి ఉదయం అక్కడ విరిగిపోయిన ఇటుకలు, రాళ్లు మాత్రమే కనిపించాయి. స్థానిక ప్రజలు వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చినా, ఇప్పటి వరకు ఒక్క నిందితుడినీ పోలీసులు గుర్తించలేకపోయారు. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా ఏర్పడిన బీజేపీ పాలనలో శాంతి భద్రతల పరిస్థితిపై ఇది ఒక తీవ్రమైన వ్యాఖ్యలా కనిపిస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి గానీ, స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు గానీ ఈ ఘటనపై ఎలాంటి ఆందోళన వ్యక్తం చేయలేదు, ఖండించలేదు. విగ్రహ పునర్నిర్మాణానికి హామీ ఇవ్వలేదు. పైగా ఈ విధ్వంసాన్ని ఖండిస్తూ స్థానిక ప్రజలతో కలిసి నిరసన నిర్వహించిన సీపీఐ(ఎం) కార్యకర్తలను బీజేపీకి చెందిన కొందరు గూండాలు బెదిరించినట్లు సమాచారం. ఈ ప్రవర్తన ఆశ్చర్యకరం కాదు. ఎందుకంటే ఈ పాలన ప్రారంభమైనప్పటి నుంచే గాంధీజీ, లెనిన్ విగ్రహాల అవమానీకరణ, బెంగాల్‌లోని నీలి తిరుగుబాటు స్మారక నిర్మాణాల ధ్వంసం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. బీజేపీ అధికారంలోకి రాకముందే ఏబీవీపీ కార్యకర్తలు ఈశ్వరచంద్ర విద్యాసాగర్ కళాశాలలోని విద్యాసాగర్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజా స్థలాల్లో ప్రత్యామ్నాయ భావజాలాన్ని సూచించే చిహ్నాలను తొలగించి, వాటి స్థానంలో తమకు అనుకూలమైన చరిత్రను నెలకొల్పాలనే ప్రయత్నం జరుగుతోంది. ఫాసిస్టు శక్తులు ఎక్కడైనా ఇదే చేస్తాయి–చరిత్రను తిరగరాస్తాయి.

### రాణీగంజ్ విగ్రహం చరిత్ర

రాణీగంజ్‌లోని రాహుల్ సాంకృత్యాయన్ విగ్రహానికి ప్రత్యేకమైన చరిత్ర ఉంది. అసాధారణ పండితుడు, స్వాతంత్ర్యోద్యమ కార్యకర్త, తత్వవేత్త అయిన రాహుల్ సాంకృత్యాయన్‌కు భారతచరిత్రలో తగిన స్థానం దక్కలేదనే విమర్శలు ఉన్నాయి. అయితే ఆయన జన్మ శతాబ్ది సందర్భంగా 1993లో పశ్చిమ బెంగాల్‌లో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యంగా బొగ్గు గనుల ప్రాంతమైన రాణీగంజ్‌లో కార్మిక నాయకులు, అభ్యుదయ రచయితలు, కళాకారులు, ఉపాధ్యాయులు కలిసి ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ




కార్యక్రమాల లక్ష్యం రాహుల్‌ను కేవలం గొప్ప పండితుడిగా కాకుండా ప్రజల మధ్య తిరుగుతూ వారి దోపిడీ, అణచివేతలను అర్థం చేసుకుని సామాజిక విముక్తి మార్గాన్ని అన్వేషించిన ప్రజా మేధావిగా పరిచయం చేయడం. ఈ అన్వేషణలో ఆయన బౌద్ధ తత్వంలోని భౌతికవాద ధోరణులను అధ్యయనం చేసి, ఆపై చారిత్రక భౌతికవాదం, మార్క్సిస్టు సిద్ధాంతాలను భారతీయ సమాజానికి అన్వయించడానికి ప్రయత్నించారు. రాహుల్ జీవితం, రచనలను కార్మికులు, రైతులకు చేరువ చేయడానికి కార్మికవాడల్లో, గ్రామాల్లో సమావేశాలు, చర్చలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల ముగింపుగా 1994లో రాణీగంజ్ కూడలిలో విగ్రహాన్ని ప్రతిష్టించారు. అప్పటి వామపక్ష ప్రభుత్వ మంత్రి, రైతు ఉద్యమ సీనియర్ నాయకుడు బెనోయ్‌కృష్ణ చౌధురి దీనిని ఆవిష్కరించారు. రాహుల్ కుటుంబ సభ్యులు, రచయితలు, మేధావులతోపాటు పెద్ద సంఖ్యలో కార్మికులు కూడా పాల్గొన్నారు. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఏప్రిల్ 9న ఆయన జయంతిని పశ్చిమబంగ గణతాంత్రిక రచయిత–కళాకారుల సంఘం అక్కడే నిర్వహిస్తోంది.

### ప్రజల పండితుడు రాహుల్

రాహుల్ సాంకృత్యాయన్ అసలు పేరు కేదార్‌నాథ్ పాండే. ఆయన బీహార్‌లోని పండహా గ్రామంలో ఒక సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. అయితే స్వాతంత్ర్యోద్యమ ప్రభావం ఆయనలో విమర్శనాత్మక దృక్పథాన్ని పెంపొందించింది. ఆధునిక విద్యా సంస్థల్లో చదవకపోయినా సంప్రదాయ విద్య ద్వారా అపారమైన జ్ఞానాన్ని సంపాదించారు. అదే సమయంలో భిన్నాభిప్రాయాలను అధ్యయనం చేస్తూ

(మిగతా 38వ పేజీలో)

# అంబేద్కర్ కార్మిక సంక్షేమ దృక్పథం



- కాత్యాయనీ విద్మహే



**భా**రతదేశంలో ప్రాదేశిక నియోజకవర్గాల ఏర్పాటు, పౌరుల ఓటు హక్కు అర్హతల నిర్ణయం మొదలైన అంశాలపై విధి విధానాల రూపకల్పన కోసం లార్డ్ సౌత్‌బరో అధ్యక్షతన ఏర్పాటైన బ్రిటిష్ కమిటీ 1918-19 మధ్యకాలంలో భారతదేశంలో పనిచేసింది. అప్పుడు బొంబాయి కళాశాలలో పొలిటికల్ ఎకానమీ అధ్యాపకుడిగా ఉన్న అంబేద్కర్ 1919 జనవరి 27న ఆ కమిటీ ముందు సార్వజనీన వయోజన ఓటు హక్కును, సామాజిక అణచివేతకు గురవుతున్న అస్పృశ్యులకు ప్రత్యేక నియోజక వర్గాలను ప్రతిపాదిస్తూ వాంగ్మూలం ఇచ్చాడు. ఉన్నత విద్య వల్ల, విదేశాలలో అధ్యయనం వల్ల పెరిగిన విశాలదృష్టి, చదివిన పొలిటికల్ ఎకనామి వల్ల కలిగిన సమగ్ర అవగాహన మాత్రమే కాదు, అంత చదివినా పనిచేసే చోట అందరూ తాగే కుండ నీటికి, అందరికీ సేవలందించవలసిన ప్యూన్ సేవలు పొందటానికి తనను బహిష్కృతుడిగా చేసిన అస్పృశ్య అస్తిత్వం చేసిన గాయం కూడా అలాంటి ఒక రాజకీయ ఆకాంక్షాభివ్యక్తికి కారణమై ఉంటుంది.

ఆ మరుసటి సంవత్సరమే అంటే 1920లో నోరు లేని వర్గాల ప్రతినిధిగా తనను తాను సంభావించుకొని అస్పృశ్యుల ప్రయోజనాల కోసం చర్చకు వేదికగా 'మూక్ నాయక్' పత్రికను పెట్టాడు. కొల్హాపూర్ మహారాజు ఆర్థిక సహాయంతో మళ్లీ లండన్ వెళ్లి 1922లో రెండవ పోస్ట్ గ్రాడ్యుయేషన్, న్యాయవిద్య పూర్తి చేసుకొని ఇండియాకి తిరిగి వచ్చాడు. 1924 జూలై 20న 'చైతన్యపరచటం, సమీకరించటం, పోరాడటం' అనే కార్యాచరణ ప్రణాళికతో బహిష్కృత హితకారిణీ సమాజాన్ని స్థాపించి భారతీయ సమాజంలో దీర్ఘకాలంగా అణచివేయబడుతున్న వర్గాల అభ్యున్నతికి సాంఘిక ఉద్యమాన్ని నడిపాడు అంబేద్కర్. ఉన్నత విద్యార్హతలు, ఆర్థిక రాజకీయ అవగాహన, అణచబడ్డ వర్గాల సంక్షేమం, సమన్యాయం కోసమైన ఆరాటం ఆయన వ్యక్తిత్వాన్ని ప్రభావశీలమైనదిగా నిర్మించాయి.

ఈ నేపథ్యంలో అంబేద్కర్ బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడుగా నియమించబడ్డాడు. 1927 నుంచి 34 వరకు ఆ బాధ్యతలలో ఉన్నాడు. అప్పటి నుంచి 1936లో ఇండిపెండెంట్ లేబర్ పార్టీ ఏర్పరచి 1937 ఎన్నికలలో బొంబాయి సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో 13 రిజర్వుడ్ స్థానాలకు 4 జనరల్ స్థానాలకు పోటీ చేసి 11 రిజర్వ్‌డ్ స్థానాలను, 3 జనరల్ స్థానాలను గెలుచుకొని అసెంబ్లీలోకి ప్రవేశించాడు. 1942 వరకు ఎంఎల్ఏగా కొనసాగాడు. 1942 నుంచి 1946 వరకు గవర్నర్ జనరల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా ఉన్నాడు. కార్య నిర్వాహక పరిషత్తులో రాజ్య ప్రతినిధిగా కార్మిక శాఖను నిర్వహించాడు. ఈ మూడు సందర్భాలలో కార్మిక చట్టాల చర్చ వచ్చినప్పుడల్లా ఆయన ప్రతిస్పందించిన, చర్చించిన తీరు ప్రాతిపదికగా అంబేద్కర్ కార్మిక సంక్షేమ దృక్పథం ఏమిటో నిర్ధారించవచ్చు.

భారతదేశానికి స్వాతంత్ర్యం రావటంతో అంబేద్కర్ పార్లమెంట్‌లో న్యాయమంత్రిగా 1951 వరకు బాధ్యతలు నిర్వహించాడు. కానీ ఆ కాలంలో కార్మిక సమస్యల మీద చర్చ ప్రధానం కాదు. బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడు అయ్యే నాటికే కార్మికవర్గ సమస్యల గురించిన అవగాహన ఉంది అంబేద్కర్‌కు. 1924లో బహిష్కృత హితకారిణీ సమాజాన్ని స్థాపించటంతోనే అంబేద్కర్ అధ్యయనశీలతకు ఆచరణ ముఖం సమకూడింది. అందులో భాగమే బొంబాయి టెక్స్‌టైల్ పరిశ్రమకు సంబంధించిన కార్మికుల సమస్య విషయంలో అయన పనిచేయటం. బొంబాయి 19వ శతాబ్దిలో టెక్స్‌టైల్ పరిశ్రమకు కేంద్రంగా అభివృద్ధి చెందింది. 1921 నాటికి 85 చిన్నా పెద్దా మిల్లులతో తూర్పు మాంచెస్టర్‌గా ప్రసిద్ధి చెందింది. సగటున 1,46,000 మంది కార్మికులు పనిచేస్తుండేవారు. వారిలో చుట్టుపక్కల గ్రామాల నుంచి అస్పృశ్యత అనే అవమానం నుంచి బయటపడటానికో, భూమి లేని పేదరికం నుంచి విముక్తికో మెరుగైన జీవితాన్ని ఆశించి నగరానికి వలస వచ్చిన మెహర్ తదితర అణచబడ్డ కులాల వారు ఉన్నారు.

అణచబడిన వర్గాల చైతన్య వికాసానికి, సాంఘిక ఉన్నతికి, ఆర్థికాభివృద్ధికి ఏ విధమైన సహాయాన్నైనా చేయటం, సంస్థలను ఏర్పరచటం, ఉద్యమాలను నిర్మించటం బహిష్కృత హితకారిణీ సభ లక్ష్యాలలో ఒకటి. దానికి అనుగుణంగానే బొంబాయి వస్త్ర పరిశ్రమలో కార్మిక రంగాన్ని కార్యక్షేత్రంగా చేసుకొన్నాడు. 16 నుంచి 18 వరకు పనిగంటలతో, తక్కువ వేతనాలతో దోపిడీకి గురవుతున్న మిల్లు కార్మికుల కోసం బొంబాయిలో పనిచేయటానికి 1926లో ఎన్.ఏం.జోషి, ఆర్ఆర్ బాక్లే స్థాపించిన బాంబే టెక్స్‌టైల్ లేబర్ యూనియన్‌లో భాగమయ్యాడు. కార్మికవర్గం స్థితిగతులను సన్నిహితంగా పరిశీలిస్తూ, వాళ్లలో కులం వల్ల అణచబడ్డ వర్గాల వారి పరిస్థితి మరెంతో హీనంగా ఉండటాన్ని గుర్తించాడు అంబేద్కర్. అణచబడ్డ వర్గాల అస్పృశ్యత వాళ్లతోపాటు నీడగా నగరాలలోకి ప్రవేశించి అద్దెకు ఇల్లు దొరకని పరిస్థితి, విడిగా షెడ్డుల వంటి నిర్మాణాలలో ఒకటి రెండు గదుల నివాసాలలో సర్దుకు పోవలసి రావటం దగ్గర నుంచి, పనిచేసేచోట పనిస్థలాల కేటాయింపు, మంచి నీళ్లు తాగే నల్లాలు విడిగా ఉండటం మొదలైన వివక్షలతో గ్రామాలలోని శ్రేణీకృత కులవ్యవస్థ మిల్లులలోకి విస్తరించటం గమనించాడు. అణచబడ్డ వర్గాల కార్మికులకు నైపుణ్యాలు పెంచుకొనే అవకాశం లేని తక్కువ స్థాయి పనులలో పెట్టటం, మరీ ముఖ్యంగా నేత పనిలో వెఫ్ట్ బాబిన్స్ మార్చేటప్పుడు ముడి వెయ్యటానికి దారాన్ని నోటిలోని లాలాజలంతో తడి చేయవలసిన పనికి అణచబడ్డ వర్గాలను దూరంగా ఉంచటం గుర్తించాడు.

ఈ పరిస్థితులలో 1928లో ఆరు నెలలపాటు డాంగే, రణదివె మొదలైన వారి నాయకత్వంలో పనిచేస్తున్న కమ్యూనిస్టు ట్రేడ్ యూనియన్ - గిర్ని కామ్‌గర్ యూనియన్-ఆధ్వర్యంలో మెరుగైన పని పరిస్థితుల కోసం, వేతనాల కోతకు వ్యతిరేకంగా నడిచిన కార్మిక సమ్మె సందర్భాన్ని అణచబడ్డ వర్గ కార్మికులు ఎదుర్కొంటున్న అమానవీయమైన తరతరాల వివక్షను గురించి చర్చించటానికి అవకాశంగా తీసుకొన్నాడు. అణచబడ్డ వర్గాల కుల సమూహాలకు మిల్లులో అన్నిరకాల ఉద్యోగాలలో సమాన అవకాశాల పరికల్పన అనే అంశాన్ని సమ్మె అజెండాలోకి చేర్చేట్లు ఒత్తిడి తేగలిగాడు. విజయం సాధించాడు. బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడుగా ఉంటూనే ఆయన ఈ ఉద్యమంలో భాగం అయ్యాడు.

అయితే 1929లో మళ్లీ 1934లో గిర్ని కామ్ గర్ యూనియన్ - కార్మిక సమ్మెలను తలపెట్టినప్పుడు అంబేద్కర్ వ్యతిరేకించాడు. దీర్ఘకాలపు సమ్మెలు, వెంట వెంట సమ్మెలు కార్మికులను ఆర్థిక సంక్షోభంలోకి నెడతాయన్నది ఒక కారణమైతే, అవి మిల్లులలో దళిత కార్మికుల వివక్షను పట్టించుకోవటం లేదన్నది మరొక కారణం. ఈ సమ్మెలలో కమ్యూనిస్టులకు రాజకీయ ప్రయోజనాలు తప్ప కార్మిక సంక్షేమం, సంసిద్ధతల గురించి పట్టింపు లేదన్నది ఆయన ఆరోపణ. కార్మికులను చీల్చి ఐక్యతకు గండికొట్టటంగా దీనిని కమ్యూనిస్టులు భావిస్తే ఐక్యతకు సమానత్వం ప్రాతిపదిక అని, కులం వల్ల శ్రామికులమధ్య వచ్చిన విభజన రద్దు కాకుండా కార్మిక వర్గ సమ్మెలు ప్రభావశీలం కాలేవని అంబేద్కర్ భావిస్తాడు. ఈ అనుభవాలు, ఆలోచనల నుండే 1936లో ఇండిపెండెంట్ లేబర్ పార్టీ ఏర్పడింది. దానిని రాజకీయ పార్టీ కన్నా ఎక్కువగా శ్రామిక వర్గ సంస్థగా, శ్రామిక సంక్షేమాన్ని వేగవంతం చేయటానికి అవసరమైన చట్టాలను ప్రవేశపెట్టటానికి నిబద్ధమైన సంస్థగా భావించాడు. ఫ్యాక్టరీలలో ఉద్యోగుల పని భద్రతకు, పదోన్నతులకు సంబంధించిన చట్టాలను, పనిగంటలు, వేతనాలు, జీతంతో కూడిన సెలవు, సౌకర్యాల పెంపు, జబ్బులు, ప్రమాదాలు మొదలైన అవసరాలకు సోషల్ ఇన్సూరెన్స్ మొదలైనవాటికి సంబంధించిన చట్టాలు తీసుకురావటం లక్ష్యం ఈ సంస్థకు. ఈ ఆదర్శాల సంబంధంలో తన జీవిత కాలంలో అంబేద్కర్ కార్మికవర్గ సంక్షేమం కోసం చేసిన ఆలోచనలను, తనకు లభించిన అవకాశాలను ఉపయోగించుకొని చేసిన చట్టాలను తీసుకొన్న చర్యలను రెండు విభాగాల కింద వర్గీకరించి అధ్యయనం చేయవచ్చు.

1. సాధారణ కార్మిక వర్గ సంక్షేమం
2. మహిళాకార్మిక సంక్షేమం.

బొంబాయి సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో (1937-1942) కార్మిక సమస్యకు సంబంధించి అంబేద్కర్ దృష్టికోణాన్ని నిరూపించిన సందర్భం పారిశ్రామిక వివాదాల బిల్లుపై చర్చ (1938, సెప్టెంబర్ 15). కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టింది. పారిశ్రామిక వివాదాలు అంటే పరిశ్రమలలో యాజమాన్య వర్గానికి, కార్మికులకు మధ్య వచ్చే వివాదాలే. అందులో భాగమే సమ్మెలు. ఆ వివాదాల పరిష్కారానికి సంబంధించిన ఈ బిల్లు 1934లో వచ్చిన బాంబే ట్రేడ్ డిస్ప్యూట్స్ కన్సీలియేషన్ స్థానంలో ప్రవేశపెట్టటానికి ఉద్దేశించబడింది కనుక దానితో పోల్చి ఇదెంత మెరుగయ్యిందో అంచనా వేయాలని అంబేద్కర్ అభిప్రాయపడ్డాడు. 1934 చట్టం వివాదాల సందర్భంలో రాజీ కోసం ఒక యంత్రాంగాన్ని ఏర్పరచటాన్ని ఉద్దేశించింది. 1934 చట్టం రాజీ స్వచ్ఛందం అంటుంది. కానీ ఈ కొత్తబిల్లు రాజీ తప్పనిసరి అని మార్పుచేసింది. ఇలా మార్చటానికి వాళ్లను బలవంతపెట్టిన ఘటన 1934 - 1938 మధ్యకాలంలో ఏమి జరిగింది అని ప్రశ్నించాడు అంబేద్కర్. రాజీ తప్పనిసరి అని చెప్పటానికి ప్రధానమంత్రి బిల్లులో భారతదేశంలో జరిగిన సమ్మెలను పేర్కొంటూ అవి తరచు జరుగుతున్నట్లు అభిప్రాయపడి దానిని అరికట్టటానికి 'రాజీ'ని తప్పనిసరి చెయ్యాల్సి వచ్చిందని చెప్పారు. బాంబే

నగరం వరకు చూసినా లేబర్ గెజిట్ ప్రకారం 1921 నుంచి 1937 వరకు సమ్మెల సంఖ్యలో తగ్గుదల కనిపిస్తుందని పరిశ్రమలలో సంభవించే అవాంతరాల విస్థాపనల అంచనాకు సమ్మెలు ప్రాతిపదిక చేసుకొనటం సరైన పద్ధతి కాదని, కోల్పోయిన పనిదినాల సంఖ్య ఒక్కటే ప్రాతిపదిక కావాలని, ఆ రకంగా చూసినప్పుడు 1928లో పోయిన పనిదినాలు చాలా ఎక్కువ అని, 1929లో కాస్త తగ్గి ఆ తరువాత సమ్మెలో పాల్గొన్న వాళ్ళ సంఖ్య, నష్టపోయిన పనిదినాలు గణనీయంగా తగ్గాయని, 1934 చట్టం తరువాత అసలా సమస్యే లేదని 1937లో అహ్మదాబాద్‌లో జరిగిన సాధారణ సమ్మె కారణంగా పని దినాలలో కొంత నష్టం జరిగినా 1934 చట్టాన్ని మార్చి రాజీ నిర్బంధం అని చేర్చటం సరికాదని పేర్కొన్నాడు.

ఆ తరువాత ఆ బిల్లులోని నిబంధనలను గురించి చర్చిస్తూ కొన్ని పరిస్థితులలో సమ్మె చట్టవిరుద్ధం అన్న నిబంధనను వ్యతిరేకించాడు అంబేద్కర్. ఆ నిబంధన కింద సమ్మె ప్రారంభించటం, సమ్మెలో పాల్గొనటం, సమ్మె లో పాల్గొనమని ఇతరులను ప్రోత్సహించటం, సమ్మె ప్రయోజనాల కోసం నిధులు వసూలు చేయటం అన్నీ నేరాలే అవుతాయి. ఈ నేరాలకు పారిశ్రామిక న్యాయస్థానం జైలు, జరిమానా, సర్వీసుల నుంచి తొలగించటం వంటి శిక్షలు ఏవైనా వేయవచ్చు. 1857 నుంచి వచ్చిన చట్టాలలో ఒప్పంద ఉల్లంఘన నేరంగా చెప్పబడినప్పటికీ ఆ సందర్భాలు వేరని, అరుదైన ఘటనలని, ఇప్పుడు భారత న్యాయం ప్రకారం ఒప్పంద ఉల్లంఘన అయితే పౌర తప్పిదం కావచ్చుగానీ నేరం మాత్రం కాదు అని వివరించి చెప్పాడు. భారత చట్టం ఒప్పంద ఉల్లంఘనను నేరం అని ఎందుకు అనలేదంటే తన ఇచ్ఛకు వ్యతిరేకంగా ఎవరైనా పనిచేయవలసి రావటం బానిసత్వం అని భావించటం వల్లనే. సమ్మెను నేరంగా భావించి శిక్షకు సిద్ధపడటం అంటే శ్రామికులను బానిసలుగా చేయటమే అంటాడు అంబేద్కర్. ఈ సందర్భంలో ఆయన సమ్మెకు మరోపేరు స్వేచ్ఛా హక్కు అంటాడు. స్వేచ్ఛ స్వాతంత్ర్య హక్కులు దైవదత్తమైనవి అనుకొంటే సమ్మె చేసే హక్కు కూడా దైవదత్తమైనదేనని నిర్ధారించి చెప్పాడు. శ్రామిక సమూహాలు సమాఖ్యలు తమ పని పరిస్థితులలో, జీతాలతో, జీవితాలలో మెరుగుదల కోసం సమ్మెకు దిగటం కుట్ర అనే వాదం పునాది లేనిదని ఆయన అనేక తార్కాణాలతో నిరూపించాడు.

ఈ బిల్లు, ఈ నిబంధనలు ఇలాగే అమలులోకి వస్తే శ్రామికుల బానిసత్వ స్థిరీకరణ జరిగి ఇక జీవితంలో సమ్మె చేసే అవకాశాలను వాళ్ళు కోల్పోవటం తథ్యం అంటాడు అంబేద్కర్. అందుకనే ఆయన ఈ బిల్లును 'ది వర్కర్స్ సివిల్ లిబర్టీస్ సస్పెన్షన్ ఆక్ట్' - శ్రామికుల పౌరహక్కుల బహిష్కరణ చట్టం- అనటానికి సందేహించ లేదు.

1942 జూలై నుంచి 1943 సెప్టెంబర్ మధ్యకాలంలో అంబేద్కర్ కార్మిక సమస్యల మీద చేసిన ప్రసంగాలు ఆయన కార్మికవర్గ దృక్పథాన్ని స్పష్టం చేస్తాయి. వాటిలో మూడు కార్మిక సభలలో చేసిన ప్రసంగాలైతే ఒకటి రేడియో ప్రసంగం. 1942 జులై 9న వైస్రాయ్ ఎక్సిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా చేరిన అంబేద్కర్ ఆగస్టు 7న న్యూఢిల్లీలో జరిగిన సంయుక్త కార్మిక సభ (జాయింట్ లేబర్ కాన్ఫరెన్స్)లో చేసిన ప్రసంగం మొదటిది.. భారతకార్మికుల సమస్యలపై ఏర్పడిన విట్లీ కమిషన్ (1929-1931) ప్రతిపాదనలను అనుసరించి 1934 ఫ్యాక్టరీ ఆక్ట్, పేమెంట్ వేజ్ ఆక్ట్ 1936 వచ్చి కార్మికుల పని పరిస్థితులలో, వేతనాలలో కొంత మెరుగుదల వచ్చినప్పటికీ ఆ కమిటీ సిఫారసు చేసిన పారిశ్రామిక మండలి అనే శాశ్వత సంస్థ ఏర్పాటు చాలా కాలంగా అలావుండిపోయింది. దానికి మార్గం సుగమం చేయటం లక్ష్యంగా జాయింట్ లేబర్ కాన్ఫెరెన్స్ జరిగింది. అక్కడ చేసిన ప్రసంగంలో అంబేద్కర్ ఈ లక్ష్యం గురించి తన అభిప్రాయం ప్రకటించాడు. ఇది వరకు సభ నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వానికి, ప్రాదేశిక ప్రభుత్వాలకు, కొన్ని భారతీయ సంస్థానాల ప్రభుత్వాల ప్రతినిధులకు మాత్రమే ప్రాతినిధ్యం ఉండగా యజమానులు, ఉద్యోగులు అనే అత్యంత ముఖ్యమైన అవసరమైన వారికి ప్రాతినిధ్యం కల్పించటం ఈ కొత్త సంస్థ నిర్మాణంలో కీలకమైన అంశం అని అంబేద్కర్ భావించాడు. ప్రజాస్వామికీకరణ వైపుగా సంస్థ విస్తరణ ఆయన ఉద్దేశం.

కార్మిక శాసనాలలో ఏకరూపత పెంపొందించటం అనే అంశంపై మాట్లాడుతూ అంబేద్కర్ రాష్ట్రాల స్వతంత్ర శాసనల వల్ల కార్మిక శాసనాలలో భిన్నత్వం ఉంటున్నదని, అందువల్ల కలిగే అవాంతరాలను సరిదిద్దటానికి తగిన చర్యలు అవసరం అని భావించాడు. 1935 భారత ప్రభుత్వ చట్టం వల్ల ఏర్పడిన సమాఖ్య రాజ్యాంగం వల్ల, కార్మిక శాసనాలను ఉమ్మడి జాబితాలో చేర్చటం వల్ల ఈ సమస్య వచ్చిందని, కేంద్ర శాసనం అందరికీ వర్తిస్తుండగా ప్రాంతీయ అవసరాలు, ప్రాధమ్యతలవల్ల ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం చేసుకొనే శాసనాలవల్ల భిన్నత్వం ఉంటుందని దానిని వీలైనంత తగ్గిస్తూ కార్మిక శాసనాలలో ఏకరూపత సాధించటం లక్ష్యంగా ఆ సభ జరగాలని అయన భావించాడు. వివిధ పాలనావిధానాలు, ప్రాంతీయ పరిధులు ఉన్న భారతదేశం వంటి పెద్ద దేశాలలో ఏకరూప కార్మిక శాసనాల అవసరం ఎప్పటికీ ఉంటుంది అని భావించాడు.

ఆ కాన్ఫరెన్స్ లక్ష్యాలలో మరొకటి పారిశ్రామిక వివాదాల పరిష్కారానికి ఒక విధానాన్ని రూపొందించటం.పారిశ్రామిక వివాదాలు శ్రమరంగానికి, పెట్టుబడి రంగానికి మధ్య ఘర్షణ కారణంగా ఏర్పడతాయని సమ్మెల రూపం తీసుకొంటాయని తెలిసిన అంబేద్కర్. రెండవ ప్రపంచయుద్ధ సందర్భంలో రెండు రంగాలవారు బాధ్యతగా ప్రవర్తించారని, సమ్మెలు పెద్ద ఎత్తున

కలవరం కలిగించే స్థాయిలో లేవని మెచ్చుకున్నాడు. ప్రస్తుత యుద్ధం సరఫరాల యుద్ధం అని, సరఫరాలు పారిశ్రామిక శాంతిపై ఆధారపడి ఉంటాయి కనుక పారిశ్రామిక శాంతిసాధన మన ముందున్న జటిల సమస్య అని అంటాడు. పారిశ్రామిక వివాదాల తక్షణ పరిష్కారమే ఆ సమస్యకు పరిష్కారం అని ఆయనకు తెలుసు. పారిశ్రామిక వివాదాల మూలం ఉద్రేకాలను ప్రేరేపించే పరిస్థితులు. అవి చాలావరకు సాంఘిక సంక్షేమానికి సంబంధించినవే అయి ఉంటాయి. ఆ సమస్యల పరిష్కారానికి సలహా ఇచ్చే యంత్రాగాన్ని ఏర్పాటు చేయాలని అభిప్రాయ పడ్డాడు. అందుకోసం కార్మిక సభను శాశ్వతసంస్థగా ఏర్పాటు చేయాలని అందులో సర్వప్రతినిధుల సభ, స్థాయీ సలహా సంఘం అని రెండు భాగాలు ఉండాలని ప్రతిపాదించాడు.

1943 సెప్టెంబర్ 6 న ఢిల్లీ లో సర్వసభ్య కార్మిక సమావేశం జరిగింది. ఇది 1942 ఆగస్టు 7 సభ ప్రతిపాదనల నుంచి ఏర్పడిన సర్వసభ్య కార్మిక సంస్థ మొదటి సమావేశం. ఇందులో మాట్లాడుతూ అంబేద్కర్ పారిశ్రామిక సమస్యలు కానీ, కార్మిక సంక్షేమానికి సంబంధించిన సమస్యలు కానీ ప్రభుత్వం, యజమానులు, ఉద్యోగులు ఈ మూడు వర్గాలు సమావేశమై చర్చించుకొంటే తప్ప పరిష్కారం కావని త్రైపాక్షిక చర్చల అవసరాన్ని నొక్కి చెప్పాడు. యుద్ధవొత్తిడుల మధ్య పారిశ్రామిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపిందని, కార్మికులకు వేతనాలు పెంచటం, సాంకేతిక శిక్షణ ఇప్పించటం, కార్మిక సంక్షేమకోసం ఒక అధికారిని నియమించే నిర్ణయం తీసుకొనటం ప్రభుత్వం వైపు నుంచి సాహసోపేత చర్యలని అభిప్రాయపడ్డాడు. సరైన వేతన, పనిపరిస్థితులు కార్మికుల హక్కులుగా అంగీకరించటం అభినందించవలసినవి అన్నాడు.

అలాగే సాంఘిక భద్రత, కనీసవేతనాలు మొదలైన వాటితో పాటు శాసనసభల్లో తదితర సంస్థలలో కార్మిక ప్రాతినిధ్య గురించి కూడా ప్రస్తావించాడు అంబేద్కర్. ఈ సందర్భంలో ఆయన రెండు వైరుధ్యాల గురించి మాట్లాడాడు. ఒకటి పెట్టుబడిదారీ పారిశ్రామికవిధానానికి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఉన్న వైరుధ్యం. అది ధనవంతులు నిరుపేదలు మధ్య ఉన్న వ్యత్యాసం అని చెప్పి పనిచేయని వాళ్ళు ధనవంతులుగా, పనిచేసేవాళ్ళు నిరుపేదలుగా ఉన్న తీవ్రస్థాయి వ్యత్యా సంగా దానిని వివరిస్తాడు. రెండవ వైరుధ్యం రాజకీయ ఆర్థిక వ్యవస్థలకు సంబంధించింది అని చెప్పి రాజకీయాల్లో సమానత్వం ఆర్థికంగా అసమానతలు దాని లక్షణం అని చెప్పాడు. ఒక మనిషికి ఒక ఓటు, ఒక ఓటుకు ఒకటే విలువ అనేది భారత రాజకీయ సూత్రం అని చెప్తూ ఆర్థిక రంగంలో ఇది రాజకీయరంగానికి వ్యతిరేకంగా ఉందని పేర్కొన్నాడు. ఈ సమస్యలను నిర్లక్ష్యం చేయరాదని అంటాడు.

భారతదేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయటం ఒక్కటే లక్ష్యం కాకూడదని, అది సామాజికంగా ఒక స్థాయిలో జరగాలని అన్నాడు. కేవలం భారతదేశ ఉత్పత్తిని, సంపదలను పెంచటానికే మన శక్తిసామర్థ్యాలను వినియోగిస్తే సరిపోదని భావించాడు. సంపదలను పంచుకొనటానికి భారతీయులందరికీ అవకాశం ఉండాలని, అభద్రత నుంచి రక్షణ కూడా అవసర మేనని అభిప్రాయపడ్డాడు.

మూడవ ఉపన్యాసం 1943 సెప్టెంబర్ 8 నుంచి 17 వరకు ఢిల్లీలో జరిగిన అఖిలభారత ట్రేడ్ యూనియన్ వర్కర్ల అధ్యయన శిబిరం ముగింపుసభలో చేసినది. పార్లమెంటరీ ప్రజా స్వామ్యం లోని వైరుధ్యాలను గురించి అప్పటికే ఆలోచిస్తున్న అంబేద్కర్ వాటిని గురించి మరింత వివరంగా చర్చించాడు ఈ ఉపన్యాసంలో. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అంతకు ముందున్న ప్రభు త్వాలకన్నా ఉత్తమమైనదే అయినా ఒక శతాబ్దం పూర్తి కాకుండానే ప్రపంచవ్యాప్తంగా దానిపట్ల అసంతృప్తి, ప్రత్యామ్నాయాల వెతుకులాట మొదలు కావటాన్ని ప్రస్తావిస్తూ బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్ర్యాన్ని పొంది పార్లమెంటరీ ప్రజాస్వామ్య పద్ధతిలో స్వపరిపాలన గురించి ఆశ పడుతున్న భారత సమాజానికి దాని గురించి చర్చించవలసిన అవసరం ఉందన్నాడు అంబేద్కర్. పైకి కనిపించేత అత్యుత్తమ వస్తువు కాదది అని హెచ్చరించాడు.

రాజకీయహక్కులు అందరికీ సమానంగా ఉండాలన్న అభిప్రాయం ప్రాతిపదికగా అభివృద్ధి చెందటం, సామాజిక ఆర్థిక సమానత్వ నియమాన్ని ఆమోదించటం పార్లమెంటరీ ప్రజాస్వామ్యం మౌలిక లక్షణమే అయినా అధిక సంఖ్యాకులైన ప్రజలకు స్వేచ్ఛ, సమానత్వం, ఆస్తి, సంతోషం పెంపొందించుకొనే హక్కును కల్పించటంలో అది విఫలం అయింది అంటాడు అంబేద్కర్. ఈ వైఫల్యానికి కారణాలు లోపభూయిష్టమైన సిద్ధాంతాలలో, నిర్మాణాలలో ఉన్నాయంటాడు. స్వేచ్ఛ, ఒప్పందం అనే రెండు అంశాలతో ఆయన దానిని వివరించాడు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఏ విషయంలో నైనా ఒక ఒప్పొందం లోకి వచ్చే స్వేచ్ఛ అందరికీ సమానమే. కానీ ఇక్కడ సమాజంలోని ఆర్థిక అసమానతలను దృష్టిలో పెట్టుకోకపోవడం వల్ల అసమానుల మధ్య ఏర్పడే స్వేచ్ఛ ఒప్పొందాలు బలవంతుల ప్రయోజనాలకు, బలహీనుల అణచివేతకు ఉపయోగపడే వాస్తవాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. అంతిమ ఫలితం స్వేచ్ఛకు ప్రతీక అయిన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పేదవారిని, ఆస్తిలేనివారిని ఇబ్బందుల పాలు చేయటం అంటాడు అంబేద్కర్.

అలాగే సామాజిక ఆర్థిక ప్రజాస్వామ్యం లేకుండా రాజకీయ ప్రజాస్వామ్యం మనలేదు అని అంబేద్కర్ అభిప్రాయపడ్డాడు. సామాజిక ఆర్థిక ప్రజాస్వామ్యం రాజకీయ ప్రజాస్వామ్యానికి కణజాలం, తంతువులు వంటివి అని ఆయన భావించాడు.

సామాజిక ఆర్థిక ప్రజస్వామ్యాలే రాజకీయ ప్రజాస్వామ్యానికి బలాన్ని చేకూరుస్తాయి అని గట్టిగా నమ్ముతాడు. రాజకీయ ప్రజా స్వామ్యం స్వేచ్ఛాకాంక్షను పెంచింది కానీ సమానత్వ ప్రాధాన్యతను గుర్తించక పోవటం వల్ల స్వేచ్ఛ సమానత్వాన్ని కబళించి అసమానత్వాన్ని మిగిల్చింది అని వేదన పడ్డాడు.

ఇక నిర్మాణాల విషయాన్ని గురించి మాట్లాడుతూ అంబేద్కర్ రాజకీయ సమాజం పాలకులు – పాలితులు అనే రెండు వర్గాలుగా చీలిపోవటం గురించి చెప్పాడు. ఇది సమాజంలో శ్రేణీకృత వ్యవస్థను అభివృద్ధి పరుస్తూ పాలకవర్గం నుండే ఎప్పుడూ పాలకులు రావటానికి అప్రకటిత విధానాన్ని నిర్మిస్తుంది అని భావించాడు. ప్రజాప్రభుత్వ రూపాలక్షణాలు ఎన్ని ఉన్నప్పటికీ వాస్తవంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యం శాశ్వత అనువంశిక పాలకులు , శాశ్వత ఆనువంశిక పాలితులు గల వ్యవస్థను తయారుచేస్తుందని ఆయన 1943 లో గుర్తించి చెప్పిన ప్రమాదం ఈ 82 ఏళ్ళ కాలం మీద ఎంత వికృతరూపం తీసుకొన్నదో చూపిస్తున్నది వర్తమాన పార్లమెంటరీ ప్రజస్వామ్యం.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం బీదలకు శ్రామికులకు, అణచబడ్డ వర్గాలకు ప్రయోజనాలు చేకూర్చ లేకపోవటానికి కారకులు ఆ బీదలు, శ్రామికులు, అణచబడ్డ వాళ్లే అంటాడు అంబేద్కర్. జీవనాన్ని ప్రభావితంచేసే ఆర్థికాంశం పట్ల అశ్రద్ధ చూపటాన్ని కారణంగా పేర్కొన్నాడు. ఈ సందర్భంలో కారల్ మార్క్స్ ను ప్రస్తావిస్తూ.. ఆయన సిద్ధాంతంతో తనకు ఉన్న విభేదాలను కొనసాగిస్తూనే అవసరమైన తన వాదనకు మద్దతుగా ఒకోసారి అంగీకరిస్తూ చేసిన చర్చ ఆసక్తిక రంగా ఉంటుంది. మానవుడు కేవలం ఆహారంతోనే జీవించడు అని నమ్ముతూ మార్క్స్ వాదాన్ని ఖండిస్తాము కానీ పస్తులతో కునారిల్లుతున్న కార్మికవర్గం మొదట తమ తిండి గురించే కదా ఆలోచించాలి అంటాడు అంబేద్కర్. మళ్లీ మార్క్స్ చరిత్రకు ఆర్థికపరమైన విశ్లేషణ చేసాడు కానీ దానిని సిద్ధాంతంగా కాకుండా కార్మికులు ఆర్థికాంశాలకు ప్రాముఖ్యం ఇయ్యటానికి దిశానిర్దేశంగా రూపొందించాడు అని పేర్కొన్నాడు. అది పెట్టుబడిదారీ వర్గం ఆర్థికానికి, ఆస్తులకు ఇచ్చిన ప్రాధా న్యం వంటిది కాదని చెప్తూ మార్క్స్ చారిత్రక ఆర్థిక సిద్ధాంత వైఫల్యానికి శ్రామికుల ఆర్థిక విషయా నికి ప్రాధాన్యత ఇయ్యకపోవటమే కారణం అన్నాడు.

అధికారాన్ని సంపాదించుకోవాలన్న ఆశయాన్ని రూపొందించు కోకపోవటం కార్మికులవైపు నుంచి పెద్ద తప్పిదం అని అంబేద్కర్ భావన. కార్మిక సంఘాలు కొంతవరకు వాళ్ళ ప్రయోజనాలకు పనిచెయ్యవచ్చుగాక కార్మికుల రుగ్మతను తగ్గించటానికి అవి ఎంతమాత్రం సరిపోవని అంబేద్కర్ అభిప్రాయం. కార్మిక సంఘాలు శక్తిమంతంగా పనిచేయటానికి వారి వెనుక కార్మిక ప్రభుత్వం ఉండాలంటాడు. అదేసమయంలో జాతీయవాదాన్ని కార్మికుల లక్ష్యాన్ని పక్కదారి పట్టించే ప్రమేయంగా గుర్తించాడు అంబేద్కర్. సమానత్వ విలువ అనుభవానికి లేకుండా ఆకలి, ఆత్మగౌరవ ఆకాంక్షలు తీరకుండా భారతజాతి భావనలో సంలీనం కావటంలోని నష్టాన్ని గురించిన హెచ్చరిక అది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో కార్మికవర్గాలు జీవించా లనుకొంటే దానిని తమ ప్రయోజనాలకు అనుగుణంగా నిర్మిం చుకోవాలని, అందుకు కార్మిక సంఘాలు ఏర్పరచుకొంటూ పోతే సరిపోదని కార్మికులు అధికారం చేపట్టటానికి వీలుగా ఒక కార్మిక రాజకీయ పార్టీ పెట్టుకోవాలని అంటాడు. హిందూ మహాసభ, కాంగ్రెస్ మొదలైన మతపరమైన పెట్టుబడిదారీ రాజకీయపక్షాలకు దూరంగా ఉండాలని సూచించాడు. అంతేకాదు విజ్ఞాన లేకుండా అధికారం లభించదని కూడా కార్మికులను హెచ్చరించాడు. రూసో సోషల్ కాంటాక్ట్ , మార్క్స్ కమ్యూనిస్టు మేనిఫెస్టో , జాన్ స్టువర్ట్ మిల్ రచించిన ఆన్ లిబర్టీ వంటి పుస్తకాలు తప్పక చదవాలని చెప్పాడు.

అంబేద్కర్ ఆకాశవాణి ప్రసంగం 1943 జనవరి 1 నాటిది. యుద్ధంలో గెలవాలని భారతీయ కార్మికులు ఎందుకు దృఢ నిశ్చయులయ్యారు? అన్నది ఆ ప్రసంగ వ్యాసానికి శీర్షిక. భారత జాతీయవాద నాయకులతో సంప్రదించకుండానే 1939 లో ప్రారంభమైన రెండవ ప్రపంచయుద్ధంలో భారతదేశం కూడా చేరినట్లు ప్రకటించింది బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం. దానిని దేశ సార్వభౌమాధికారానికి భంగకరమైనదిగా భావించి జాతీయ వాదులు బ్రిటన్‌కు యుద్ధంలో ఎటువంటి సహకారం ఇయ్యకూ డదని తీర్మానించారు. సహాయనిరాకరణ ఉద్యమంలో అది కూడా ఒక అంశం అయింది. కానీ ఆ సమయంలో కార్మికవర్గం మాత్రం బ్రిటన్ యుద్ధాన్ని తన యుద్ధంగా భావించి ఆ యుద్ధంలో బ్రిటన్ గెలుపును ఆకాంక్షించింది. అది ఎందుకో, ఎలా జరిగిందో తనదైన కోణం నుంచి వివరించాడు అంబేద్కర్.

యుద్ధకాలంలో కార్మిక సంక్షేమ చట్టాలు అనేకం అమలయ్యాయని, కార్మికులు రక్షణ , భద్రత పొందారని అయితే అందువల్లనే వాళ్ళు యుద్ధానికి మద్దతునిచ్చి బ్రిటిష్ వారి విజయాన్ని కాంక్షించారని అనుకోనక్కరలేదని అంటాడు అంబేద్కర్. పనిలో మంచి స్థితిగతులు సాధించినంత మాత్రాన కార్మికులు సంతృప్తి చెందరని జీవితంలో మంచి స్థితిగతులుం డాలని కోరుకొంటారని, అందుకు హామీ ఇయ్యగలిగిందిగా బ్రిటిష్ ప్రభుత్వం మీద ఉన్న ఆశ ఏదో యుద్ధంలో వాళ్ళు గెలు పును ఆశించటానికి కారణం అయివుంటుందని అంబేద్కర్ ఆంతర్యం. కార్మికులు మంచి జీవితం కోరుకొనటం అంటే ఏమిటో అంబేద్కర్ ఇచ్చిన వివరణను బట్టి అలా అనుకోవచ్చు.

కార్మికులు కోరుకొనే మంచి జీవితానికి ప్రధాన సూత్రాలు మూడు. స్వేచ్ఛ సమానత్వ సౌభ్రాతృత్వాలు. కార్మికుల స్వేచ్ఛ

దృక్పథంలో సమాన అవకాశాల హక్కులు, ప్రతివ్యక్తికి అవసరాల మేరకు అభ్యున్నతికి పూర్తి సౌకర్యాలు కల్పించటం ప్రభుత్వం విధి అనే భావం ఇమిడి ఉంటుందని చెప్పాడు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అంటే వాళ్ళ దృష్టిలో ప్రజలచేత ప్రజలకొరకు ప్రభుత్వం అన్నది నామమాత్రం కాకుండా వాస్తవికంగా ఉండేది. కార్మికులు కోరే సమానత్వంలో చట్టాలు, సివిల్ సర్వీసులు, పన్నులు, సైన్యం, వాణిజ్యం, పరిశ్రమలు మొదలైన వాటిలో ఉండే ప్రత్యేక సౌకర్యాలు రద్దు కావాలన్న ఆకాంక్ష ఉంటుందని, కార్మికులు కోరే సౌభ్రాతృత్వంలో మానవులపట్ల సహృదయత, భూమి మీద శాంతి అనే ఆదర్శాలతో అన్ని వర్గాలను, జాతులను ఏకంచేసే ఆదర్శం ఉంటుందని పేర్కొన్నాడు. ఈ ఆదర్శాల వ్యవస్థ నిర్మాణం మిత్రదేశాల విజయంతో ముడిపడి ఉందని కార్మికులకు తెలుసునంటాడు. మిత్రదేశాలు యుద్ధంలో ఓడిపోతే వచ్చే నాజీవ్యవస్థ శాశ్వతంగా స్వేచ్ఛను అణచివేసేది, సమానతను నిరాకరించేది, సోదర భావాన్ని తుడిచిపెట్టేది కనుక కార్మికులకు బ్రిటన్ విజయం కోరదగినది అయింది అంటాడు. నాజీజం ఇదిమాత్రమే కాదు ఇది అందులో ఒకభాగం, జాత్యహంకారం అందులో అత్యంత ప్రమాదకరమైన అంశం అని అంటాడు. నాజీలను ఓడించటంలో కార్మికుల ప్రయోజనం విద్యావకాశాలు, అభివృద్ధి. యుద్ధం జరుగుతున్నప్పుడు విముఖంగా ఉంటూ పోరాటాన్ని నిరాకరించటం శాంతిప్రియుల కర్తవ్యం అనేది కార్మికుల అభిప్రాయం అని నిర్ధారించాడు అంబేద్కర్. పాత వ్యవస్థ కోసం కాక పాత వ్యవస్థతోపాటు నాజీజానికి వ్యతిరేకంగా జరిగే యుద్ధం కనుక రెండవ ప్రపంచయుద్ధం కార్మికుల ప్రయోజనాలకు అనుకూలమైన కొత్త వ్యవస్థ నిర్మాణాన్ని గురించిన ఆశను గర్భీకరించుకొని ఉన్న కారణాన కార్మికులకు ఆ యుద్ధం ఆమోదయోగ్యమైనది అని అంబేద్కర్ తన వివరణలతో ధ్రువపరిచాడు.

భారతదేశ స్వాతంత్ర్యానికి ఎలాంటి హామీలు పొందకుండానే కార్మికులు బ్రిటిష్ ప్రభుత్వానికి యుద్ధంలో సహకరించటం జాతీయవాదులకు నచ్చలేదు. ఈ వైఖరి భారత జాతీయ వాదానికి హానికరమైనదని భావించారు. అందువల్ల శ్రామిక వర్గానికి తీవ్ర ప్రత్యర్థులు జాతీయవాదులు అంటాడు అంబేద్కర్. జాతీయవాదానికి అర్థం గతించిన పురాతనకాలాన్ని పూజించటమూ మూలంలోనూ, రంగులోనూ, స్థానికమూ, సొంతమూ కానీ అన్నిటినీ త్యజించటమూ అనుకొంటే కార్మికులు దానిని తమ సంప్రదాయంగా అంగీకరించలేరు అని, వర్తమానంలో పనికి రానిది, భవిష్యత్తుకు ఆశాజనకం కానిది, అయిన గతం రోజురోజుకు విస్తరిస్తున్న మానవ స్ఫూర్తి గొంతు నులిమెయ్యటాన్ని కార్మికులు సహించలేరని చెప్పాడు. కార్మికులకు జాతీయ వాదం లక్ష్య సాధన మార్గమే కానీ జీవన సూత్రాలలో అత్యంత ముఖ్యమైనవాటిని ఒదులుకొనటం కాదు అని స్పష్టం చేసాడు.

కార్మికుల మతం అంతర్జాతీయ వాదం అని ప్రకటించాడు.

బాహ్య స్వాతంత్ర్యం అంతర్గత బానిసత్వంతో సహజీవనం చేస్తున్న సామాజిక నిర్మాణంలో కార్మికుల స్వాతత్ర్యం పాక్షికమైనది, సాపేక్షమైనది అన్న అభిప్రాయం అంబేద్కర్ తర్కంలో కనబడుతుంది. ఈ దేశానికి నాయకత్వం ఇవ్వగలిగిన సత్తా కార్మికులకే ఉందని కూడా విశ్వసించాడు అంబేద్కర్. సరైన నాయకత్వానికి ఆదర్శవాదం, స్వేచ్ఛాయుత ఆలోచన రెండూ అవసరమని ప్రతిపాదించి అవి ఉన్నత మధ్యతరగతి వర్గాలలోకన్నా కార్మిక వర్గంలోనే ఉన్నాయని స్థాపించాడు.

కార్మిక వర్గ హక్కులగురించి, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం గురించి, జాతీయవాదం గురించి, స్వేచ్ఛ సమానత్వ విలువల పరస్పర సంబంధం గురించి, స్వేచ్ఛా ఒప్పంద భావన గురించి కార్మిక వర్గపు శక్తి గురించి, కర్తవ్యాల గురించి అంబేద్కర్ చేసిన విమర్శనాత్మక పరిశీలనల, విశ్లేషణల వెలుగులో ఇటీవలి కాలంలో వచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను, నాలుగు కార్మిక చట్టాలను, తీవ్ర జాతీయవాద ధోరణిని అధ్యయనం చేయవచ్చు.

కార్మిక చట్టాల చరిత్ర అధ్యయనశీలతే కాక అంబేద్కర్‌కి కార్మికుల పనిప్రాంతాల, కార్మికుల జీవనవిధానాల ప్రత్యక్ష పరిశీలనానుభవం ఉంది. కౌన్సిల్ సభ్యుడుగా కార్మిక శాఖా బాధ్యుడుగా కార్మిక సంక్షేమ విధానాల రూపకల్పనకు అది ఎంతగానో పనికి వచ్చింది. 1943 లో అంబేద్కర్ కార్మిక శాఖ అధికారులతో కలిసి బొగ్గుగనులలో పని పరిస్థితులను అధ్యయనం చేయటానికి ధన్ బాద్ వెళ్ళాడు. (డిసెంబర్ 9) ఝరియా, తిస్ర, రాణిగంజ్ మొదలైన అనేక గనులను దర్శించాడు. భూగర్భంలో, ఉపరితలంలో రెండు చోట్లా కార్మికులతో వాళ్ళ పని పరిస్థితుల గురించి వేతనాల గురించి, ఆదాయాల గురించి మాట్లాడాడు. భూగర్భంలోకి 400 అడుగుల లోతుకు సీతా పూర్ గనిలో 1000 అడుగుల లోతుకు దిగి బొగ్గు ముక్కలు చేస్తున్న కార్మికులను చూసాడు. గనులలలోకి ఆడవాళ్ళ ప్రవేశ నిషేధాన్ని ఎత్తివేయటం వల్ల ఆడవాళ్లు కూడా ఉన్నారు. కార్మికుల నివాసగృహాలలోకి వెళ్లి ఆహార నాణ్యత, అలవాట్లు, ఇంటి పరిస్థితులు, సామగ్రి మొదలైన వాటి గురించి తెలుసుకొన్నాడు. గని యాజమానులు కట్టించిన ఆసుపత్రిని. కార్మికులకు కట్టించిన ఇళ్లను పరిశీలించారు. ధన్‌బాద్‌కు తిరిగి వచ్చే టప్పుడు బేగానియ గనుల వద్ద ఒంటి గది కార్మికుల నివాసాలు చూసి అవి చీకటి గుయ్యారాలుగా ఉండటం గమనించాడు. కార్మికుల ఇంటి అవసరాలకు తగిన బొగ్గు ఉచితంగా లభిస్తున్నట్లు తెలిసింది.

అప్పుడే ధన్‌బాద్‌లో బొగ్గు కొరతపై కేంద్రప్రభుత్వ ప్రతినిధులు, బెంగాల్ బీహార్ ప్రభు త్వాల ప్రతినిధులు, ఆ మూడు ప్రాంతాల బొగ్గు గని ప్రతినిధులు, కార్మికవర్గ ప్రతినిధులు పాల్గొన్న ఆ సమావేశానికి అంబేద్కర్ అధ్యక్షత వహించాడు.

భారతదేశ పరిశ్రమలు, యుద్ధ అవసరాలకు బొగ్గు ఉత్పత్తిని అధికం చేయాలని అందుకు సలహాలు ఇమ్మని ప్రతినిధులను కోరాడు. బొగ్గు ఉత్పత్తి తరుగుదలకు కార్మికుల సంఖ్య తగ్గటం ఒక కారణంగా గుర్తించటం జరిగింది. వ్యవసాయ అవసరాల కోసం తరలివెళ్లటం, సైన్యంలో చేరటానికి పోటీ పడటం ఫలితంగా కార్మికుల సంఖ్య తగ్గినట్లు నిర్ధారణకు వచ్చారు.

కొద్దికాలం క్రితం కేంద్రప్రభుత్వం ప్రకటించిన రేషన్ పథకం చర్చకు వచ్చింది. గనుల్లో పనిచేసే స్త్రీపురుషులకు సరిపడేంత రేషన్ ఏర్పాటుచేయడం, కార్మికులపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు కూడా రేషన్ ఇయ్యటం, వారానికి పనిదినాలు అయిదే అయినా ఆరు పనిదినాలకు రేషన్ ఏర్పాటుచేయడం వంటివి ఆ పథకంలో భాగం. బియ్యం, పప్పు దినుసులుతో పాటు ఉప్పు, ఆవ నూనె, వస్త్రాలు కలిపి పెద్ద మొత్తంలో గని సంఘాలకు చేరవేస్తే అక్కడినుంచి గనులకు పంపిణీ చేయాలనీ ఈ పథకం చెబుతుంది. ఈ పథకం అమలు గురించిన చర్చతో పాటు వేతనాల పెంపు సమస్యకూడా చర్చకువచ్చింది ఈ సదస్సులో. కార్మికుల కోసం భోజన వసతి విరామ క్యాంటీన్ల పనితీరు ప్రగతిపై జరిగిన చర్చలో అవి కార్మికుల ఆదరణ పొందాయని తేలింది. 1944లో బొగ్గుగనుల కార్మిక సంక్షేమ ఆర్డినెన్స్ ప్రకటించబడింది. కార్మికుల సంక్షేమానికి నిధిని సమకూర్చటం దాని ఉద్దేశం. బ్రిటిష్ ఇండియాలోని బొగ్గు గనుల నుంచి రైల్లద్వారా పంపిణీ అయ్యే బొగ్గు, బొగ్గు దినుసులపై టన్నుకు నాలుగు అణాలు మించకుండా, ఒక అణాకు తగ్గకుండా నిర్ణయించి వసూలు చేసే సుంకం ఈ నిధికి మూల వనరు. వసతి సౌకర్యం, నీటిసరఫరా, విద్యావైద్య అవసరాలు, పౌష్టిక ఆహారం, రవాణా సౌకర్యాలు, సాంఘిక పరిస్థితుల మెరుగుదల, జీవనప్రమాణాల పెరుగుదల మొదలైన అంశాలకోసం ఈ నిధులను వెచ్చించటం జరుగుతుంది అని తెలియపరిచాడు.

అలాగే అంబేద్కర్ 1944 ఏప్రిల్ 28న మైకా గనులలోకి 400 అడుగుల లోతుకు దిగి కార్మికుల పని పరిస్థితులను తెలుసుకొన్నాడు. మైకా కార్మికుల గుడిసెల కాలనీలో తిరిగి వాళ్ళ జీవిత పరిస్థితులను అర్థం చేసుకొనే ప్రయత్నం చేసాడు. గుడిసెల మధ్య ఒక చెట్టుకు ఆనించి వున్న రెండు జేగురు రంగు ముక్కోణపు రాళ్లను మైకా దేవతగా భావించి కార్మికులు పూజలు చేయటాన్ని ఆయన తెలుసుకొన్నాడు. కోడర్మా కర్మాగారంలో వేల మంది స్త్రీ పురుష కార్మికులు పెద్ద పెద్ద వసరా గదుల్లో కూర్చుని మైకా అచ్చులతో పనిచేయటం, మైకాను పలకలుగా చేయటం, కత్తులతో సరిచేయటం,కొడవళ్ళతో పల్చని రేకులుగా విడదీయటం వంటి పనులను నైపుణ్యంతో వాళ్ళు చేయటం చూసాడు. ఆ మర్నాడే బీహార్‌లోని కోడర్మాలో జరిగిన మైకా గని భారత ప్రభుత్వప్రతినిధుల, బీహార్ ప్రభుత్వ ప్రతినిధుల, వృత్తి సంఘాల, మైకా గనికార్మిక ప్రతినిధుల సభలో పాల్గొని ప్రసంగించాడు. విద్యుత్ సాంకేతిక పరిశ్రమలు, యుద్ధ సామగ్రి తయారీ పరిశ్రమలు మైకా మీదనే ఆధారపడి ఉన్నాయని, ప్రపంచ ఉత్పత్తిలో 81 శాతం భారత దేశానిదే అని సగర్వంగా పేర్కొన్నాడు. 60 వేల మంది కార్మికులతో ఒక లక్ష కుటీర కార్మికులతో – అంటే ఇళ్లల్లో పనిచేసే కార్మికుల శ్రమతో నడుస్తున్న ఈ పరిశ్రమ దేశంలో చాలా కీలకమైనదని యుద్ధానంతర పరిస్థితి గురించిన అనుమానంతో దానిని స్థిరంగా ఉంచడానికి భారత ప్రభుత్వం చర్యలు చేపడుతున్నదని, అందులో భాగంగా మైకా పరిశ్రమలోని తక్షణ సమస్యలను గుర్తించి, పరిష్కార మార్గాలు సూచించటానికి విచారణ సంఘాన్ని ఏర్పరచిందని చెప్పాడు. పత్తి నూలు, జనపనార వంటి పరిశ్రమల గురించి తెలిసినంత మైకా పరిశ్రమ గురించి తెలియకపోవటానికి ఉత్పత్తి అయిన మైకాను అంతా ఎగుమతి చెయ్యటం వల్ల భారతీయులకు మైకాతో సంబంధం లేకుండా పోవటమేనంటాడు.

1942 నుంచి 1946 వరకు గవర్నర్ జనరల్ ఎక్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడిగా కార్యనిర్వాహక పరిషత్తులో రాజ్య ప్రతినిధిగా కార్మికశాఖను నిర్వహించిన కాలంలో అంబేద్కర్ కార్మికుల సంక్షేమానికి సంబంధించి ప్రవేశపెట్టిన బిల్లులు, వాటి మీద చేసిన చర్చలు ఆయన కార్మికవర్గ దృక్పథాన్ని తెలుసుకొనటానికి అదే సమయంలో భారతదేశపు కార్మికవర్గ సమస్యలను ప్రభుత్వ పరంగా తీసుకోబడిన పరిష్కార చర్యల చరిత్రను తెలుసుకొనటానికి చక్కగా ఉపయోగపడతాయి. దానికి తార్కాణంగా కొన్నిటిని కాలక్రమ వరుసలో పరిశీలించటం ప్రయోజనకరం.

యుద్ధగాయాల (పరిహార) బిల్లు ( 31-3-1943) యుద్ధంలో గాయపడ్డ కార్మికులకు నష్టపరిహారం ఇయ్యటం, దానిని చెల్లించే బాధ్యతను యజమానుల బాధ్యతగా చేయటం, ఆ బాధ్యతకు బద్ధులై యజమానులు ఇన్సూరెన్స్ తీసుకొనేట్లు ఆదేశించటం లక్ష్యంగా రూపొందింబిల్లు ఇది. దీనిని సభకు వివరించే క్రమంలో అంబేద్కర్ 1941 నాటి యుద్ధగాయల అత్యవసర చట్టంతో, 1936 నాటి యుద్ధగాయల చట్టంతో పోల్చి వర్తమాన బిల్లు అవసరాన్ని స్థాపించాడు.

కార్మికులు యుద్ధంలో గాయపడటం అంటే వాళ్ళు ప్రత్యక్ష యుద్ధంలో పాల్గొన్నారని కాదు. యుద్ధ ప్రాంతాలకు సమీపంలో ఉండే ఫ్యాక్టరీలలో పని చేసే కార్మికుల కోసం ప్రవేశపెట్టిన బిల్లు ఇది. పని ప్రదేశంలో ఉన్నప్పుడు – ఏ బాంబులో పడటం వల్ల గాయపడిన వాళ్ళు, వాటి తీవ్రత వల్ల పని చేయలేని పరిస్థితిలో పడ్డవాళ్ళ ప్రయోజనాలకోసం రూపొందించింది. ఆ పరిధిలోకి అస్సాం తేయాకు తోటల్లో పనిచేసే కార్మికులను, సముద్ర తీరప్రాంతాల కార్మికులను తీసుకు రావాలనే సూచనలతో సెలక్ట్ కమిటీ ముందర దానిని ఉంచటానికి సభ ఆమోదించింది. కార్మికులతో సన్నిహిత సంబంధం కలిగి ఉండటానికి పారిశ్రామిక సంస్థలలో లేబర్ ఆఫీసర్ల నియామకం గురించిన

చర్చకూడా వచ్చింది

ఆ బిల్లు సెలక్ట్ కమిటీ చేసిన చేర్పులు, మార్పులతో 13-8-1943లో మళ్లీ సభలో ప్రవేశపెట్టబడింది. ఫ్యాక్టరీ కార్మికులకు, కాంట్రాక్ట్ కార్మికులకు, ఫ్యాక్టరీ గుమస్తాలకు, తోటల కార్మికులకు కూడా వర్తించేలా సమగ్రతను పొంది చర్చకు వచ్చింది. భారత యుద్ధ గాయాల పథకంలో అలవెన్స్ రేట్లను పురుషులతో సమానంగా స్త్రీలకూ వర్తింపచేయాలన్న చర్చ (1943 సెప్టెంబర్ 9 ) వచ్చింది. ఇంగ్లాండ్ లో స్త్రీ పురుష భేదం తొలగించిన నేపథ్యంలో ఈ చర్చ జరిగింది.

భారత ట్రేడ్ యూనియన్ల (సవరణ) బిల్లు (1943 నవంబర్ 13) 1926 భారత ట్రేడ్ యూనియన్ల చట్టాన్ని ఇంకా సవరించటానికి ప్రజాభిప్రాయసేకరణకు పంపిణీ చేయాలని ఈ బిల్లును అంబేద్కర్ ప్రవేశపెట్టాడు. ఈ బిల్లులో మూడు ముఖ్యాంశాలు ఉన్నాయని పేర్కొన్నాడు. వాటిలో మొదటిది ట్రేడ్ యూనియన్‌ను గుర్తించేందుకు యాజమాన్యంపై ఒత్తిడి తేవటం. రెండవది ట్రేడ్ యూనియన్ నిర్మాణానికి సంబంధించిన షరతుల విధింపు. ఆ పద్ధతిలో నిర్మాణమైన ట్రేడ్ యూనియన్లు యాజమాన్య గుర్తింపుకు అర్హమైనవవుతాయి. మూడవది అలా గుర్తింపుకు అవసరమైన అర్హతలు అన్నీ ఉన్నా గుర్తించ నిరాక రించే యాజమాన్యం శిక్షార్హం అవుతుంది. కార్మిక సంఘాలు ఆరోగ్యంగా ఎదగటానికి, యజమానులకు కార్మికులకు మధ్య శాంతియుత సంబంధాల కొనసాగింపుకు ట్రేడ్ యూనియన్లను గుర్తించాల్సిన అవసరం ఉందని చెప్పిన రాయల్ కమీషన్ అభి ప్రాయంతో ఏకీభవిస్తూ అంబేద్కర్ సభ ఆమోదాన్నీ కోరాడు. కమీషన్ నివేదిక వచ్చి(1929) పన్నెండు ఏళ్లుగడిచినా యజ మానులు తమంతట తాము కార్మిక సంఘాలను గుర్తిస్తారనే ఆశ లేకపోవటం వల్లనే ఈ బిల్లు అవసరమైంది అని చెప్పాడు.

ఫ్యాక్టరీల(సవరణ) బిల్లు (1944 ఏప్రిల్ 4) 1934 ఫ్యాక్టరీ చట్టంలోని 9, 19, 23, 45, 54 నిబంధనల సవరణను ఉద్దే శించిన బిల్లు ఇది. దీనిని సభలో ప్రవేశపెడుతూ అవి ఎందుకు సవరించాలో వివరించాడు. ఆ క్రమంలో నాలుగు సవరణలను ప్రతిపాదించాడు. ఒకటి – ఫ్యాక్టరీలు ప్రారంభించేవాళ్ళు అవస రమైన సమాచారంతో ఒక నివేదికను ఫ్యాక్టరీ తనఖీదార్లకు సమర్పించవలసి ఉండగా దానిని నిరాకరించి ఫ్యాక్టరీ నిర్మాతలు పరిశీలకులకు జవాబుదారులంకామన్నట్లుగా వ్యవహరించటా నికి అవకాశం ఇస్తున్నందు వల్ల సవరణ అవసరం అవుతున్నదని అంబేద్కర్ వివరించాడు. రెండవది స్నానపు గదుల ఏర్పాటు కార్మికులకు అందరికీ కాక దుర్గంధపూరితమైన, హానికరమైన పరిస్థితిలో పనిచేసే వాళ్ళకే పరిమితం చేయటం. మూడవది ఫ్యాక్టరీలో అగ్నిమాపక సాధనాల ఏర్పాటు ఏ సంఖ్య లో ఉండాలి అనేది యాజమాన్య నిర్ణయంగా కాక ప్రభుత్వ నిర్ణయంగా ఉండాలి. పరిశీలకుల సూచన మేరకు ఆ పని జర గాలి. నాలుగవది స్త్రీలు పిల్లలు పనిచేసే సమయానికి సంబం ధించింది. 13 గంటల పనికాలంలో ఏ మార్పు లేదు కానీ పని సమయాన్ని ఉదయం 7.30 నుంచి రాత్రి 8. 30 కి మార్చటం. కాలమానంలో మార్పు, విద్యుత్తు పొదుపు దృష్ట్యా ఈ సవరణ అవసరం అవుతున్నదని పేర్కొన్నాడు. ఫ్యాక్టరీల మీద ప్రభుత్వ నియంత్రణ, పరిశీలకుల హక్కులు ఇందులో కీలకం.

కర్మాగారాల (రెండవ సవరణ) బిల్లు (1944 నవంబర్ 1) ఇది కూడా 1934 ఫ్యాక్టరీ చట్టానికి సవరణే. ఈ సవరణలో రెండు భాగాలు ఉన్నాయి. ఒకటి సెలవులకు సంబంధించింది. ఫ్యాక్టరీ కార్మికుల ఆరోగ్యం, సామర్థ్యం పరిరక్షణకు వరుస శ్రమ తరువాత అవసరమైన విశ్రాంతికోసం నిర్దేశిత సెలవలు ఫ్యాక్టరీ చట్టాలలో భాగమే. అయితే ఫ్యాక్టరీ యజమానుల అవసరాలు నిర్దేశాల మేరకు కార్మికులు హక్కుగా పొందే తప్పనిసరి సెలవును ఉపయోగించుకొనే అవకాశం కోల్పోయి నప్పుడు నష్ట పరిహారం సెలవులకు సంబంధించిన నిబంధనలు చేర్చటం మొదటి సవరణ లక్ష్యం. రెండవది వేతన సెలవులకు సంబం ధించినది. 1936 అంతర్జాతీయ కార్మిక సదస్సులో వేతన సెల వులకు సంబంధించిన తీర్మానం రూపొందిన సంగతి గుర్తు చేసి భారత ప్రభుత్వం ఆ సదస్సును ఆమోదించలేదు కానీ అందు లోని కొన్ని అంశాలనైనా ఆమోదించటానికి ఉన్న అవకా శాలను పరిశీలించటానికి సిద్ధపడిందని ఈ ఏడెనిమిదేళ్ళుగా వివిధ స్థాయిలలో జరిగిన చర్చల ఫలితం వేతన సెలవు విషయాన్ని పరిగణనలోకి తీసుకొనటం అని వివరించాడు అంబేద్కర్.

నిరంతరం పనిచేసే ఫ్యాక్టరీలకు మాత్రమే ఇది వర్తిస్తుంది అని చెప్తూ ఏడాదిపాటు నిరంతరం పనిచేసిన కార్మికులు ఏడు రోజులు వేతనంతో కూడిన సెలవుకు అర్హులని, అంతర్జాతీయ కార్మికసదస్సు నిర్దేశించిన ఆరు రోజుల సెలవుకన్నా ఇది మెరుగైందని చెప్పాడు. వారాంతపు సెలవు దినం ఎలాగూ ఉన్నదే. ఏడాదికాలపు నిరంతర పనిలో అనారోగ్యం, ప్రమాదం, అధికారిక సెలవు, లాకౌట్ కాలం, చట్ట బద్ధ సమ్మె కాలం మొదలైన వాటివల్ల ఏర్పడే అవాంతరాలకు మినహా యింపు ఉంటుందని, అలాగే ఫ్యాక్టరీ యజమాని తన ఇచ్ఛానుసారం ఫ్యాక్టరీ మూసివేసినప్పుడు కలిగే అవాంఛిత నిరుద్యోగ కాలం ముప్ఫయి రోజులకు మించనప్పుడు అది కూడా వేతనంతో కూడిన సెలవు పొందటానికి అవరోధం కాదని ఈ బిల్లులో పొందుపరచటం జరిగిందని అంబేద్కర్ వివరణ ఇచ్చాడు. ఈ ఏడురోజుల వేతన సెలవును రెండేళ్ల కాలంలో 14 రోజులు సమకూర్చుకొని ఉపయోగించుకోవచ్చు అన్న షరతు కూడా ఇందులో చేర్చారు. కార్మికులకు సెలవు ఇవ్వటంతో పాటు దానిని వినియోగించుకొనటానికి కొంత నగదు ఇప్పించే ఏర్పాటు, అందులో సగం ముందుగా చెల్లించాలనే షరతు ఈ బిల్లులో చేర్చబడ్డాయి.

అయితే కార్మికులు ఈ వేతనంతో కూడిన సెలవు సంపాదించుకోకుండా 12 నెలల పనికాలం పూర్తి కావటానికి ముందే యజమానులు వాళ్ళను తొలగించటం, అలా కాకపోయినా సంపాదించుకొన్న సెలవలు ఉపయోగించుకోనీయకుండా ఒత్తిడి పెట్టటం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది కాదా అని సందేహం కలగవచ్చు. అయితే ఆ పరిస్థితి ఇప్పుడిప్పుడే రాదన్న నమ్మకంతో ప్రభుత్వం వాటిని ఈ బిల్లులో ప్రస్తావించలేదని చెప్పి అంబేద్కర్ అలాంటి ఘటనే జరిగితే అవి పునరావృత్తం కాకుండా చట్టంలో సవరణ తేవచ్చని అన్నాడు.

సెలెక్ట్ కమిటీ నివేదికను అనుసరించి 1934 సంవత్సరపు కర్మాగారాల చట్టాన్ని మరింత సవరించటానికి 1935 మార్చి 29 న సభముందు పెట్టాడు అంబేద్కర్. సెలెక్ట్ కమిటీ చేసిన ముఖ్యమైన సవరణలను సభ దృష్టికి తీసుకువస్తూ మాట్లాడాడు. 1. ఈ చట్టంలో కల్పించిన సెలవలు కాక ఇతర చట్టాల ప్రకారం గానీ, ఒప్పందాల వల్ల గానీ అనుమతించబడిన సెలవులు సర్వీసు నిబంధనల ప్రకారం లభించిన సెలవులు కార్మికులు హక్కుగా కలిగివుండే అవకాశాన్ని పరిరక్షించటం 2. వేతనంతో కూడిన సెలవుని బాలలకు కూడా వర్తింపచేయటమే కాక కార్మికులకు ఉన్న ఏడురోజుల వేతనంతో కూడిన సెలవును బాలలకు పద్నాలుగు రోజులకు పెంచటం. 3. వేతనంతో కూడిన సెలవు వినియోగించుకొనే అవకాశాన్ని కార్మికులు వినియోగించకుండా నిర్ణీత సంవత్సర కాలం కంటే ముందే వాళ్ళను యజమానులు పని నుంచి తొలగించినా , సెలవు ఫలితంగా పొందవలసిన వేతనం పొందకపోయినా వచ్చే కార్మికవివాదాల పరిష్కారం రాజ్యం బాధ్యతగా నిర్ధారించి కార్మికుల పక్షాన వ్యవహరించటానికి ఇన్స్పెక్టర్లకు అధికారాలు ఇయ్యటం. 4. బిల్లు అమలుకు అవసరమైన నియమావళి రూపకల్పనకు రాష్ట్రాలకు అవకాశం ఇయ్యటం వల్ల దేశమంతా ఇది అమలయ్యేటప్పుడు ఏకరూపత లేకుండా పొయ్యే ప్రమాదాన్ని నివారించటానికి నియమాల రూపకల్పన బాధ్యత భారత ప్రభుత్వమే తీసుకొనటం.

ఫ్యాక్టరీల(సవరణ) బిల్లు (1946, ఫిబ్రవరి 21) దీనిని ఫ్యాక్టరీల సవరణ చట్టం 1934కి తదుపరి సవరణ బిల్లు అన్నాడు అంబేద్కర్. పనికాలాన్ని తగ్గించటం, అదనపు పనికాలానికి చెల్లింపులు అనే రెండంశాల పై కేంద్రీకరించబడిన బిల్లు. ఏడాది పొడుగునా నడిచే కర్మాగారాల్లో వారానికి 54 అలాకాక ఆయా కాలాలకు పరిమితమై నడిచేవాటికి 60 పనిగంటలుగా ఉండగా వాటిని 48 పని గంటలకు, 54 పనిగంటలకు తగ్గించటం దీని ఉద్దేశం. ఈ సందర్భంగా ఆయన కార్మికుల పని గంటల గురించిన చర్చ 1919 లో వాషింగ్టన్ లో జరిగిన సదస్సులో చర్చకువచ్చిందని, అక్కడ ఫ్యాక్టరీ కార్మికుల పనిగంటలు 40 అని నిర్ణయమైనా భారతదేశ పరిస్థితుల దృష్ట్యా 60 అని నిర్ణయించి కొనసాగించటం జరిగిందని, ఆ తరువాత రాయల్ కమీషన్ సిఫారసుమేరకు 1934 చట్టం ద్వారా 54 గంటల పనికాలాన్ని అమలులోకి తెచ్చిందని ఇప్పుడు యుద్ధకాలంలో పెరిగిన పనిగంటలవల్ల కార్మికులు ఎదుర్కొన్న సమస్యలను, ఒత్తిడిని, భారతదేశ వాతావరణ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని పనిగంటలు తగ్గించటానికి ఈ చర్య తీసుకొంటున్నదని చరిత్ర ను ప్రస్తావిస్తూ వివరించాడు. ఇక అధికపనిగంటల చెల్లింపులో సీజనల్ కర్మాగారాలలో 60 గంటల పనికాలానికి ఒకటిన్నర రేట్లు చెల్లింపు ఉంటే పూర్తికాలపు కర్మాగారాలలో 54 నుంచి 60 పనిగంటలకు ఒకటింపావు రేట్లు, పనిగంటలు 60 దాటితే ఒకటిన్నర రేట్లు చెల్లింపు ఉంటున్నదని ఈ తేడాలు అన్యాయమని భావించి అన్నిరకాల పనిగంటలకు ఒకటిన్నర రేట్లు ఇవ్వాలని ప్రతిపాదించింది ఈ బిల్లు.

ఫ్యాక్టరీల(సవరణ) బిల్లు(1946 ఏప్రిల్ 4) ఇది కూడా 1934 చట్టానికి సంబంధించినదే. పూర్తికాలం పనిచేసే ఫ్యాక్టరీలో పనిగంటలు రోజుకు 10 1/2 గంటలుగా, ప్రత్యేక సీజన్ లో నడిచే ఫ్యాక్టరీలో 11½ గంటలుగా ప్రతిపాదించబడితే అధ్యక్షుడు వాటిని 12 గంటలుగా సవరించాలని చెప్పినప్పుడు అంబేద్కర్ దానిని తిరస్కరిస్తూ చేసిన వాదం ఆసక్తికరమైనది. ఈ సవరణ ప్రతి పాదనలో ఆయా ఫ్యాక్టరీలలో కార్మికుల పనికి సంబంధించి అమలులో ఉన్న విధానాలకు అను కూలంగా చట్టం రూపొందాలి అన్న ఉద్దేశం కనబడుతుంది అది తప్పు అంటాడు అంబేద్కర్. యజమానుల ఆచరణకు అనుగుణంగా ప్రభుత్వాలు చట్టం చేయరాదు. ఎందుకంటె యజ మానులు ఆచరణ తరచు వాళ్ళ ప్రయోజనాలకు అనుగుణంగానే ఉంటుంది. అలాగే 12 గంటల పని గంటలు విరామ సూత్రానికి విరుద్ధం అని కూడా చెప్పాడు. చట్టం విధించిన గరిష్ట కాలానికి మించి ఎక్కువకాలం కార్మికుడికి ఫ్యాక్టరీ లో ఉండే అగత్యం కలిగించకపోవటం. ఈ బిల్లు గరిష్ట కాలాన్ని రోజుకు తొమ్మిది గంటలుగా నిర్ణయిస్తున్నది. పన్నెండు గంటల సవరణను ఆమోదిస్తే అదనంగా మూడుగంటలు కార్మికులను ఫ్యాక్టరీ ఆవరణలో ఉంచవలసి వస్తుంది. నిజం చెప్పవలసివస్తే ఫ్యాక్టరీ బృందావనం ఏమీ కాదు. ఉండవలసిన సౌకర్యాలు అక్కడేమీ లేవు. అందువలన కార్మికులను సాధ్యమైనంత త్వరగా ఫ్యాక్టరీ నుంచి ఇంటికి పంపించి స్వేచ్ఛగా గాలిపీల్చుకొంటూ తనకున్న సరదాలు తీర్చుకొంటూ చట్టం ఇచ్చిన విశ్రాంతి సమయాన్ని సద్వినియోగ పరుచుకొనటానికి అనుమతించటం వాంఛనీయం అంటాడు అంబేద్కర్. కార్మికులను సంపద సృష్టించే యంత్రాలుగా కాక సహజ స్వేచ్ఛా కాంక్షలు ఉన్న మానవులుగా సంభావించటంలో ఉన్నది అంబేద్కర్ ప్రత్యేకత.

కార్మికుల సంక్షేమం – సాంఘికభద్రత (1946 మార్చి 11)

కు సంబంధించిన చర్చ సందర్భంలో అంబేద్కర్ నిరుద్యోగ భృతి, దినబత్తెం, సాంఘిక భద్రతా సౌకర్యాలు కేంద్రప్రభుత్వ ఉద్యోగులైన కార్మికులకు మాత్రమే వర్తించేవిగా ఉంటే తద్వారా గౌరవనీయమైన కార్మికవర్గం ఒకటి రూపొందే ప్రమాదాన్ని శంకించి నిరాకరించాడు. భారతదేశంలో కార్మికులకు ప్రభుత్వమే కాక ప్రయివేటు వ్యక్తులు కూడా పనికల్పిస్తున్నారు. భారతప్రభుత్వం రూపొందించే విధానాలు అందరికీ సమానంగా వర్తించేవిగా ఉండటమే న్యాయం అంటాడాయన. కార్మిక శాఖ సరిగా పనిచేయటం లేదన్న విమర్శ వచ్చినప్పుడు, ఉద్యోగుల జీతభత్యాలలో వివక్ష గురించి ఆరోపణలు వచ్చినప్పుడు అంబేద్కర్ కార్మిక సంఘాలు, నాయకులూ తమ బాధ్యతలను సరిగా నిర్వహించకపోవడం వల్లనే అందుకు అవకాశం ఏర్పడుతున్నదని సమాధానం ఇయ్యటం చూస్తాం.

ఏ పరిమితులలోనైనా కార్మికుల సంక్షేమం గురించి ఆ నాటి ప్రభుత్వం ఎలా ఆలోచిస్తున్నదో ఈ బిల్లులు చెప్తాయి. అవి సభలో చర్చకువచ్చినప్పుడు అంబేద్కర్ ఎంత అధ్యయనంతో , చారిత్రక అవగాహనతో మెరుగైన వర్తమాన నిర్మాణం కోసం తన ప్రతివాదాన్ని వినిపించాడో కూడా ఈ సందర్భాలు స్పష్టం చేస్తాయి. వేతనాల చెల్లింపు(సవరణ) బిల్లు (1944 నవంబర్ 16) 1936 వేతన చెల్లింపు చట్టంలోని పాలనాపరమైన ముఖ్య లోపాల సవరణకు ఉద్దేశించిన బిల్లు ఇది. వేతనాల చెల్లింపు, వేతనాలలో కోత మొదలైన విషయాలలో కార్మికుల ప్రయోజనాల దృష్ట్యా స్పష్టమైన మార్గదర్శక సూత్రాలు రూపొందించటం ఇందులో ప్రధానం.

కార్మికుల నష్టపరిహారం (సవరణ) బిల్లు (1946, ఫిబ్రవరి 8) కార్మికుల నష్టపరిహార చట్టం 1923 ను బట్టి నెలకు 300/ రూపాయలు వేతనం పొందుతున్న కార్మికులకు నష్టపరిహారం పొందే హక్కు పరిమితం. యుద్ధ అలెవెన్స్, కరువుభత్యం, బోనస్, సత్ప్రవర్తన వేతనం మొదలైన వాటిని కలిపి వేతనంగా పరిగణించటం వల్ల చాలా మంది ఈ నష్టపరిహార హక్కు పొందే పరిధిలోకి రాకుండా పోయారు. ఈ అన్యాయాన్ని సవరించటానికి కార్మికుల వేతన పరిమితిని 400 రూపాయలకు పెంచటానికి ఈ సవరణ బిల్లు అవసరమైంది. అంతేగాక ఈ నష్టపరిహార చట్టంలోని 4వ షెడ్యూల్ సవరణ ద్వారా మరణం, శాశ్వత లేదా తాత్కాలిక అంగ వైకల్య సందర్భాలలో నష్టపరిహారం పొందే హక్కు కల్పించటం కూడా ఈ సవరణ బిల్లులో చేర్చబడింది.

భారతగనుల (సవరణ) బిల్లు (1946 ఫిబ్రవరి 8) గని కార్మికులకు గని సొరంగ ముఖ ద్వారాలవద్ద స్నానపు గదులు నిర్మించేట్లు యాజమాన్యాన్ని నిర్దేశించటానికి ఉద్దేశించిన బిల్లు ఇది. గనులలలో పనిచేసే కార్మికులకు జల్లుల కొళాయి (షవర్బాత్ నల్లాలు) సౌకర్యంతో స్నానాల గదులు, లాకర్ గదులు, ప్రత్యేక స్థలాలలో మహిళా గని కార్మికులకు కూడా స్నానపు గదులు ఏర్పాటు చేయాలి. 12 నెలలలోపు ఈ నిర్మాణాలు చేసే గని యజమానులకు ఖర్చులో పది శాతం ఇవ్వటానికి భారతప్రభుత్వం తనంతట తానే ముందుకువచ్చింది. బొగ్గు గనులలోపల గాలి ఆడని వేడిలో పనిచేసి చెమటోడ్చి బట్టలు శరీరమూ మురికి అయి గని బయటకువచ్చే శ్రామికులు అలసట, నిస్సత్తువతో మనుషులు గుర్తించలేనంతగా మసిబారి ఇళ్లకు ఎలా నడచి వెళ్తుంటారో అల్లం రాజయ్య, తుమ్మేటి రఘోత్తమరెడ్డి మొదలైన వాళ్ళ కథలు చదివితే కళ్ళకు కడతారు. భూగర్భంలోకి చొచ్చుకువెళ్లి సంపద సృష్టించే కార్మికుల అటువంటి స్థితి అన్యాయం, అమానవీయమూ అనిపించింది అంబేద్కర్ కి. జల్లుల కొళాయి స్నానాలతో సేదదీరి శుభ్రమైన శరీరంతో బట్టలతో ఇల్లు చేరటం కార్మికుల ఆత్మగౌరవాన్ని పెంచుతుంది అని భావించాడాయాన.

ఈ క్రమంలో శాసన సభలో ప్రశ్నోత్తరాల సమయం కూడా కార్మికుల పట్ల అంబేద్కర్ వైఖరి తెలుసుకొనటానికి ఉపయోగపడుతుంది. 1944 నవంబర్ 20 న మలేరియా వల్ల బొగ్గుగనులలో శ్రామిక కొరత ఏర్పడుతున్నదన్న సభ్యుల ఆరోపణ కు అంబేద్కర్ సమాధానాలు ఇచ్చాడు. రేణుకా రే ఆగస్టు సెప్టెంబర్ నెలలలో మలేరియా సోకి, మందుల సరఫరా, తగిన వైద్య సహాయం లేకపోవటం వల్ల బొగ్గు గనుల్లో శ్రామికుల కొరత ఏర్పడిందని, తీవ్రంగా రోగపీడితులు కావటం, పౌష్టికాహార లోపం వల్లా శ్రామికుల సామర్థ్య తగ్గిన వాస్తవం మీకు తెలుసా అని నిలదీస్తూ వాటి నివారణాలకు మీరేమి చర్యలు తీసుకొన్నారు అని అడిగింది.

1944 ప్రారంభం నుంచి అంబేద్కర్ బొగ్గు గనులలో శ్రామికుల కొరత గురించి మాట్లాడు తూనే ఉన్నాడు. గనుల భూగర్భంలో పనికి మహిళల పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయటానికి దానినే కారణంగా చెప్తున్నాడు. ఆ సందర్భంగా జరిగిన చర్చలలో శ్రామికుల కొరతకు వాళ్ళు వ్యవసాయ రంగంలోకో, అధిక వేతనాలు గల సైనికోద్యోగాలలోకి వెళ్ళటమో కారణంగా చెప్తున్నాడు. బహుశా దానికి సవాల్ గా శ్రామికుల కొరతకు మలేరియాను కారణంగా ఈ ప్రశ్నోత్తరాల సమయంలో ముందుకు తెచ్చారు సభ్యులు. ఆయా కాలాలలో వచ్చే మలేరియాకు కార్మికులు అతీతులు కాదని, తరచువచ్చే మలేరియా రోగాన్ని ఎదుర్కొనే వ్యాధి నిరోధక శక్తి కార్మికులలలో లేదని వారి చికిత్సకు అవసరమైన చర్యలు – మందుల సరఫరా వంటివి – తీసుకొంటూనే ఉన్నామని, ఉన్న ఆసు పత్రులు సరిపోవటం లేదని, వాళ్ళ సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొనే కార్మిక సంక్షేమ నిధిని ఏర్పరచటం జరిగిందని ఆయన చెప్పాడు. పౌష్టికాహార లోపం వల్ల శ్రామికుల కొరతతో పాటు వ్యక్తిగత ఉత్పాదకత కూడా తగ్గిందన్న ఒక సభ్యుడి ఆరోపణకు

సమాధానంగా ఉత్పాదకత తగ్గుదలకు యంత్రాల లేమిని కారణంగా చెప్పాడు అంబేద్కర్.

1944 నవంబర్ 20న గనుల అంతర్భాగంలో బాల కార్మికులను నిషేధించే చట్టాలను ఉల్లంఘించిన సందర్భాల గురించి రేణుకారే లేవనెత్తిన ప్రశ్నకు అంబేద్కర్ గనుల శాఖ అధికారులు తరచు తనిఖీలు చేస్తూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలు ఉంటే తగిన చర్య తీసుకొంటారని, సభ్యులు నిర్దిష్ట గనులకు సంబంధించి నిర్దిష్ట దృష్టాంతాలు దృష్టికి తెస్తే తగిన చర్య తీసుకొంటానని హామీ ఇచ్చాడు. అదేరోజు బీహారులో బొగ్గు గని పని వారికి బియ్యం సరఫరా ఏర్పాట్ల మీద ప్రశ్నోత్తరాలు నడిచాయి. నియంత్రిత ధరకన్నా ఎక్కువ వసూలు చేయటం, బియ్యంలో నాణ్యత లోపించటం చర్చకు వచ్చాయి. బీహార్ ప్రభుత్వం కార్మికులకు సరఫరా చేయవలసిన బియ్యాన్ని నేపాల్ నుంచి నియంత్రిత ధరకన్నా ఎక్కువకు కొనుగోలు చేసిందని ఆ మేరకు కార్మికులకు నియంత్రిత ధరకన్నా కాస్త ఎక్కువకు అమ్మటం జరిగిందని, నాణ్యత విషయం ఇంకా నిర్ధారించవలసి ఉందని జవాబు ఇచ్చాడు.

1945 ఫిబ్రవరి 21 నాడు బొగ్గు గనులలో ఘోరక్‌పూర్ కార్మికులకు సంబంధించిన ప్రశ్న వచ్చినప్పుడు అంబేద్కర్ ఇచ్చిన సమాధానాలు వలస కార్మిక వ్యవస్థ నిర్మాణం గురించి తెలియ చేస్తాయి. గోరఖ్‌పూర్ శ్రామిక సరఫరా విభాగం బొగ్గు గనులలలో, ఇతర ప్రభుత్వ సంస్థలలో పనిచేయటానికి కార్మికులను భర్తీ చేస్తుంది. వేల మంది ఇలా పంపబడుతుం టారు. ప్రతి యాభై మంది జట్టుకు ఒక గిర్దావర్ 250 మందికి ఒక యూనిట్ పర్యవేక్షకుడు, 1000 మంది ఉన్న ప్రతి శిబిరానికి ఒక శిబిర పర్యవేక్షకుడు, ఒకటిని మించిన శిబిరాలకు ప్రాంతాన్ని బట్టి ఓకే గ్రూప్ అధికారి ఉంటారు. ఈ పనిశిబిరాలకు బాధ్యత వహించే అధికారి ఉపసంచాలకుడు. ఈ విస్తృత నిర్మణపు కేంద్ర కార్యాలయం ధన్‌బాద్.

ఈ పనివాళ్లను పని జరిగే స్థలంలో ఆరు నెలలకు లేదా ఒక సంవత్సరానికి లేదా పని పూర్తయ్యేవరకు ఏది తక్కువ కాలం అయితే ఆ కాలానికి భర్తీ చేస్తారు. కూలీలకు కొంత బయానా, ఉచిత నివాసం, వంట చెరుకు, దినవెచ్చాలు, ఒక జత బట్టలు, కంబళి ఇచ్చి పనిలో చేరుస్తారు. వాళ్ళ పనికి నిర్ణీత వేతనం, మంచి పనికి దీర్ఘకాలిక బోనస్ లభిస్తాయి అని చెప్పాడు అంబేద్కర్. అప్పటికి అలాంటి పనివాళ్లు 15 వేల మంది ఉన్నట్లు చెప్పాడు. బొగ్గు క్షేత్రాలలో పనిచేస్తున్న వారికి రోజుకు 12 అణాలు మూల వేతనం, ఉత్పత్తి బోనస్ రోజుకు 4 అణాలు, భూగర్భంలో పనిచేసినందుకు అదనంగా నాలుగు అణాలు ఇస్తారు. స్థానిక పనివాళ్ల కన్నా ఇది మెరుగైన వేతనం. గోరఖ్ పూర్ పనివాళ్ళు పనికి బాగా అలవాటుపడి నైపుణ్యంతో చేస్తున్నట్లు సమాచారం ఉందని ఆయన చెప్పాడు.

అంబేద్కర్ మహిళా కార్మిక శ్రమ శక్తి ప్రాధాన్యతను గుర్తించిన వాడు. 1944లో మైకా గనుల కార్మిక సమస్యలను చర్చిస్తూ బెంగాల్ రూబీగా పేరుబడ్డ బీహార్ మైకా వల్ల ప్రపంచ మార్కెట్లో భారతదేశ మైకాకు ప్రాధాన్యత ఉందని చెప్తూ ప్రధానంగా ఆదివాసీల పనివల్ల, అందులోనూ ఎక్కువ సంఖ్యలో ఉన్న స్త్రీల పనివల్ల మైకాకు నాణ్యత, విలువ వచ్చాయని చెప్పటంలో స్త్రీ శక్తి ఎంతకళాత్మక శ్రమ సంయుతమో చెప్పినట్లయింది.

అట్లాగే ఆయన మహిళా కార్మిక సంక్షేమానికి కట్టుబడి ఉన్నాడు. మహిళా కార్మిక సమస్యలపై అంబేద్కర్ ఆలోచనలు బొంబాయి లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యుడుగా(1927-1934) ఉన్న కాలంలోనే వ్యక్తమైనాయి. 1938లో ఎంఎల్ఏ పదవీ కాలం లోనూ ఆ తరువాత గవర్నర్ జనరల్ ఎక్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యు డిగా అందునా కార్మిక శాఖ నిర్వాహకుడిగా మహిళా సమస్య లపై చర్చలో ఆయన ప్రభావవంతమైన పాత్ర నిర్వహించాడు. ఆ కాలపు చర్చ ప్రధానంగా రెండు అంశాలమీద కేంద్రీకృతం అయింది. ఒకటి ప్రసూతి ప్రయోజన బిల్లు. రెండు-బొగ్గు గనుల లోపలి పనులకు స్త్రీలను నియమించటం, నిషేధించటం అనే రెండు విరుద్ధ అంశాల మీద సంవాదం.

**ప్రసూతి ప్రయోజనాల బిల్లు**

1928 జులై 28న ప్రసూతి ప్రయోజన బిల్లుకు మద్దతుగా ఆయన చేసిన వాదం కీలకమైనది. ఆ బిల్లుకు వ్యతిరేకంగా ప్రసూతి ప్రమాదం లాంటిది కాదు. పరిహారం అవసరం లేదన్నట్లు ఒక సభ్యుడు మాట్లాడిన దాన్ని ఖండించటంతో తన వాదం ప్రారంభించాడు. అది ప్రమాదం కాదనుకున్నా ఈ బిల్లు వల్ల కలిగే ప్రయోజనాలకు స్త్రీలు అర్హులు కాకుండా పోరు అంటాడాయన. తల్లిపై ప్రభావం చూపే ప్రసూతి పూర్వ పరిస్థితులు, తరువాత బిడ్డను పెంచటం ఈ బిల్లులో ముఖ్యమైన అంశాలని, జాతీయ ప్రయోజనాల దృష్ట్యా కాన్పుకు ముందూ తరువాత తల్లికి కొంత విశ్రాంతి అవసరమన్న సూత్రం మీద ఈ బిల్లు ఆధారపడి ఉందని పేర్కొన్నాడు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా అనటం వల్ల అంబేద్కర్ బిడ్డను కనటం స్త్రీల వ్యక్తిగత సమస్య అన్న భావనను నిరాకరించినట్లయింది. అందుకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి అని కూడా ఆయన భావించాడు. ప్రభుత్వ ప్రజాసంక్షేమ బాధ్యతలో స్త్రీల ప్రసూతి ప్రయోజనాల పరిరక్షణను భాగంగా సూచించాడు.

అంతమాత్రాన స్త్రీలను పనిలో పెట్టుకొనే యజమానికి ప్రసూతి సదుపాయాల బాధ్యత లేదు అని అర్థం కాదని కూడా స్పష్టం చేసాడు. కొన్ని పరిశ్రమలలో పనిలోకి పురుషులను తీసు కొనటం కన్నా స్త్రీలను తీసుకొనటం లాభకరం అని వాళ్లనే ఎక్కువగా తీసుకొంటున్నారు. అందువల్ల లాభాలు పొందుతు న్నప్పుడు కొంత వరకన్నా యజమానులు ప్రసూతి వేతన బాధ్యత

వహించటం సమంజసం అని అంబేద్కర్ అభిప్రాయం. ఇందువల్ల పరిశ్రమల మీద పడే భారం వేతనాల తగ్గుదలకు కారణమవుతుందని ఈ బిల్లుపై వచ్చిన ఒక అభ్యంతరాన్ని తోసిపుచ్చుతూ ఈ భారం బహుళ వినియోగదారులపైకి మళ్లుతుందని, ఉత్పత్తిదారులైన స్త్రీలకు ప్రయోజనకరమైనప్పుడు, వారు తయారు చేసే వస్తువుకు ఎక్కువ ధర చెల్లించటానికి సమాజానికి అభ్యంతరం ఉండకూడదంటాడు అంబేద్కర్.

అప్పటి నుండి చట్టసభలో తన బాధ్యతల నిర్వహణలో భాగంగా ఆయన ప్రసూతి ప్రయోజనాలు సాధ్యమైనంత విస్తృతంగా లభించేట్లు ఎప్పటికప్పుడు సవరణలు ప్రతిపాదిస్తూ చర్చిస్తూనే ఉన్నాడు. ఆ క్రమంలో 1943 జూలై 29న గని కార్మికుల ప్రసూతి సదుపాయాల సవరణ బిల్లును ప్రవేశపెట్టి మాట్లాడాడు. రోజుకు ఎనిమిదణాల చొప్పున 8 వారాల ప్రసూతి ప్రయోజనం పొందే హక్కు గని కార్మికులకు యియ్యబడింది. అందులో నాలుగువారాలు ప్రసూతికి ముందు మిగిలిన నాలుగు ప్రసూతికి తరువాత ఉపయోగించుకోవచ్చు. ప్రసవానికి ముందు నాలుగువారాల సెలవు స్త్రీల ఐచ్ఛిక నిర్ణయం. ఆ కాలంలో పని చేసి పూర్తి జీతం పొందే అవకాశం వుంది. ప్రసవం తరువాత మాత్రం విశ్రాంతి తప్పనిసరి. అప్పుడు పని చెయ్యలేరు. అలా చెయ్యటం చట్ట విరుద్ధం అందువల్ల రోజుకి ఎనిమిది అణాల చొప్పున నాలుగు నెలల సెలవు తీసుకోవలసిందే. అయితే ఇందులో కొన్ని పదాల ప్రయోగం సందిగ్ధతకు తావు ఇస్తుండటం వల్ల వాటి సవరణకు ఈ బిల్లును ప్రవేశ పెట్టి ఆమోదం పొందాడు అంబేద్కర్.

1944 నవంబరు 20న రేణుకారే ప్రశ్నోత్తరాల సమయంలో గనుల లోపల మహిళలు తొమ్మిది నెలలు నిండే వరకు పని చేస్తున్నట్లు, మళ్లీ ప్రసవించిన 15 రోజుల నుండే పనిలోకి వస్తున్నట్లు, భూగర్భంలో పనిచేసే స్త్రీలు తరచు ప్రమాదాలకు లోనవుతున్నట్లు చెప్తూ ప్రభుత్వం తీసుకొంటున్న చర్యల గురించి ప్రశ్నించింది. ఇది నిరాధార ఆరోపణ అని గనుల ప్రసూతి చట్టం ప్రకారం ప్రసవానికి ముందు, ప్రసవానికి తరువాత నాలుగు వారాల సెలవకు వాళ్లు అర్హులని ఈ చట్టం నిర్దేశించిన మేరకు దానిని అమలు పరచటానికి వైద్యులతో కూడిన అధికార యంత్రాంగం క్రమంగా తప్పకుండా తనిఖీలు చేస్తుంటుందని జవాబిచ్చాడు అంబేద్కర్. చట్టం కింద లభించే హక్కుల గురించి మహిళా కార్మికులకు తెలియచెప్పటం జరుగుతున్నదని చెప్పాడు. మహిళా కార్మికులకు ప్రమాదాలు జరిగాయి కానీ వాళ్లలో గర్భిణీ స్త్రీలు ఎందరో సమాచారం లేదని, కానీ ఘటనలు జరిగినచోట్ల అవన్నీ నమోదు అయి ఉంటాయని చెప్పాడు. గనులలలో గర్భిణీ స్త్రీలను పనిచేయకుండా నిరోధించటానికి మంచి మార్గం భూగర్భంలో స్త్రీల పని నిషేధాజ్ఞలను పునరుద్ధరించటమే కదా అని రేణుకారే అన్న మాటలతో తాను పూర్తిగా ఏకీభవిస్తానని అయితే అందుకు పరిస్థితులు అనుకూలించాలి అని అంబేద్కర్ భావించాడు.

1945 ఫిబ్రవరి 9న అసెంబ్లీ చర్చలలో గనుల్లో పనిచేసే స్త్రీలకు తలస్నానపు గుంటల ఏర్పాటు, వారి పిల్లలకు శిశు సదనాల ఏర్పాటు గురించి ప్రశ్న వస్తే అంబేద్కర్ ఒక బొగ్గు క్షేత్రంలో తలస్నానపు గుంటలు, ఎనిమిది క్షేత్రాలలో శిశు సదనాలు ఏర్పరచినట్లు సమాచారం ఇచ్చాడు. ఇది చాలా తక్కువ అని తెలుసుకనుకనే గనులలలో చేర్చుకొనే యజమానులు విధిగా శిశు సదనాలు ఏర్పాటు చేసేట్లు భారత గనుల చట్టంలో సవరణ తేవాలన్నది పరిశీలనలో ఉందని చెప్పాడు. 1945 మార్చి 13న అసెంబ్లీ చర్చలలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా అంబేద్కర్ 1943 లో గనుల్లో పనిచేసే స్త్రీ కార్మికులు 72,403 మంది అని 1944 లెక్క అందుబాటులో లేదని, భారతీయ గనుల చట్టం ప్రకారం పిల్లలను గనులలోకి తీసుకొనే పద్ధతే లేదుకనుక బాలకార్మికుల సంఖ్య ఎంత అనే ప్రస్తావనకే తావే లేదని అంబేద్కర్ జవాబు.

అదే రోజు ఢిల్లీ ఫాక్టరీలలో స్త్రీ కార్మికుల వేతన సౌకర్యాల గురించి సభ్యులు అడిగిన ప్రశ్నలకు స్పందిస్తూ అంబేద్కర్ మహిళా సగటు వేతనం గురించి సమాచారం సిద్ధంగా లేదని, కొన్ని ఫ్యాక్టరీలలలో నెలవారీ వేతనం ఇస్తుండగా మరికొన్ని ఫ్యాక్టరీలలో రోజువారీ వేతనం ఉందని, కరువు భత్యం 10 నుంచి 32 రూపాయల వరకూ ఉందని, ఒకేరకం పనిచేస్తున్న స్త్రీపురుషుల మధ్య తనకు తెలిసినంత వరకు వేతన వ్యత్యాసాలు లేవని, రెండు ఫ్యాక్టరీలు ప్రసూతి శిశు సంక్షేమ సదుపాయాలు కల్పించాయని, రెండు ఫ్యాక్టరీలలలో స్త్రీలు పనిలో ఉంటే ఆ సమయంలో వాళ్ల పిల్లలను జాగ్రత్తగా చూసుకొనటానికి క్రెచ్ లు ఏర్పరచాయని, ఒక ఫ్యాక్టరీలో ఉద్యోగుల పిల్లలకు ఉచిత స్నానాల ఏర్పాటు, బలహీనంగా ఉన్న పిల్లలకు రోజుకు అర్ధశేరు పాలు ఉచితంగా ఇయ్యటం ఉన్నాయని మరొక ఫ్యాక్టరీ ఉద్యోగుల పిల్లలకు పాఠశాల పట్టి ఉచితవిద్య అందియ్యటంతో పాటు పిల్లలకు రోజుకు అర్ధసేరు పాలు కూడా ఇస్తున్నదని పూర్తి సమాచారం ఇచ్చాడు. ఫ్యాక్టరరీలలో చేర్చుకొన్న స్త్రీలు నేరుగా చేర్చుకోబడ్డావాళ్లే కానీ కాంట్రాక్టర్ల ద్వారా ఏర్పాటైనవాళ్లు ఎవరూ లేరని కూడా ఆయన స్పష్టం చేసాడు.

1941 గని కార్మికుల ప్రసూతి సదుపాయ(సవరణ) బిల్లులో మరికొంత సవరణను ఉద్దేశించి 1945 మార్చి 29 న ప్రవేశపెట్టబడింది. గని ఉపరితల కార్మికులకే కాదు, ఇప్పుడు గని లోపలి పనిలో స్త్రీలు కూడా ఉన్నారు కనుక వాళ్లకు కూడా ఆ ప్రయోజనాన్ని వర్తింపచేయటానికి అవసరమైన మార్పులు సూచించటం ఇందులో ప్రధానం. గని లోపలి పని తాత్కాలికమైనదీ, త్వరలో మళ్లీ నిషేధింపతగినదే అయినా అంత వరకు పనిచేసే స్త్రీల సంక్షేమ బాధ్యత దృష్ట్యా ఈ సవరణలు

చేయబడ్డాయి. చట్టప్రకారం ఇంతకు పూర్వం ప్రసవానంతరం నాలుగు వారల సెలవు ఉంటే ఈ చట్ట ప్రకారం ఇప్పుడు భూగర్భంలో పని చేసే స్త్రీకి ప్రసవానికి ముందర నాలుగు వారాలకు దానిని విస్తరించటం జరిగింది. ప్రసవానికి పదివారాల ముందు నుండి గనిలో పనిచేయరాదు. ఈ కాలానికి రోజుకు పన్నెండు అణాల చొప్పున ప్రసవానంతరం నాలుగు వారాలకు కలుపుకొని ఈ చెల్లింపు ఉంటుంది. ఈ సదుపాయాన్ని పొందటానికి 6 నెలల కాలంలో 90 రోజులు భూగర్భంలో పనిచేయటం షరతు.

1945 ఫిబ్రవరి 21న గనులలో స్త్రీ కార్మికుల పిల్లల సంరక్షణ ఏర్పాట్ల గురించి కె.రాధాబాయి సుబ్బరాయన్ వేసిన ప్రశ్నలకు అంబేద్కర్ ఇంత వరకు నిర్దిష్టమైన ఏర్పాట్లు ఏమీ జరగలేదని కొన్ని గనులలలో పరిచారికలు గల శిశు సదనాలు ఏర్పాటైనాయని, కొన్ని బొగ్గు క్షేత్రాలలలో శిశు చికిత్సాలయాలు ఉన్నాయని, అక్కడ పిల్లలకు పాలు పంచుతారని, ప్రభుత్వం శిశు సదనాలకు సంబంధించిన నిబంధనలను పరిశీలిస్తున్నదని చెప్పాడు. గనిలో పనిచేసే బాలింతలకు క్రమబద్ధంగా పాలియ్యటానికి ఏర్పాట్లు ఏమున్నాయన్న ప్రశ్నకు పిల్లలను భూగర్భంలోకి అనుమతించరు గనుక అక్కడ ఆ సౌకర్యాలు అవసరం లేదని బయటకు వచ్చి పాలిచ్చే సౌకర్యాల గురించి సమాచారం తెప్పించటానికి ప్రయత్నిస్తున్నానని చెప్పాడు. స్త్రీలు గని ఉపరితలానికి వచ్చి పిల్లలకు పాలియ్యటానికి, శిశు సదనాల ఏర్పాటుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేసేవరకు భూగర్భ పనులలలోకి స్త్రీల ప్రవేశాన్ని నిలిపివేస్తారా అని రాధాబాయి ప్రశ్నించటం పాలిస్తున్న తల్లులను భూగర్భంలో పనిచెయ్యని వ్వటానికి ప్రభుత్వం అఖిల భారత వైద్యమండలి సలహా తీసుకుంటుందా అని అడగటం అంబేద్కర్‌ను ఇరుకున పెట్టేవిగా ఉండటం గమనించవచ్చు.

అదేరోజు గనుల తవ్వకపు ప్రాంతాలలో గనుల ప్రసూతి సౌకర్యాల చట్టం అమలు కోసం ప్రభుత్వం తీసుకొంటున్న చర్యల గురించి రాధా సుబ్బరాయన్, రేణుకా రే, ఎన్.జి.రంగా వేసిన ప్రశ్నలకు అంబేద్కర్ ప్రసూతి సౌకర్యాల గురించి గనులలలో పనిచేసే స్త్రీలకు సహాయపడటానికి వైద్యులుగా అర్హతగల ఒక సీనియర్ కార్మిక ఇన్‌స్పెక్టర్, ఇద్దరు జూనియర్ కార్మిక ఇనస్పెక్టర్లు, భారత గనుల చీఫ్ ఇన్‌స్పెక్టర్ అధీనంలో నియమించబడ్డారని, ఈ చట్టం అమలుపై ప్రభుత్వానికి నివేదికలు ఏవీ లేవు గానీ ఇన్‌స్పెక్టర్లు క్రమంగా తప్పకుండా చీఫ్ ఇన్స్పెక్టర్లకు నివేదికలను పంపిస్తున్నారని గనుల శాఖవారు అవసరమైన చర్యలు తీసుకొంటుంటారని , ప్రసూతికి ముందూ వెనక నాలుగు వారాల సెలవు ఫ్యాక్టరీ శాసనం ప్రకారమే ఉందని, భూగర్భంలో పనికి నియమితులైన మహిళా కార్మికుల విషయంలో ప్రసవానికి ముందు కాలాన్ని పెంచే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉందని వివరణ ఇచ్చాడు. ప్రసూతి తరువాత సెలవు పెంపుసంగతి ఏమిటన్నా అనుబంధ ప్రశ్నకు అవసరం లేదు, బాలింతలను గని పనిలోకి తీసుకొనటంపై పూర్తి నిషేధం ఉందని చెప్పాడు. ప్రసూతి సదుపాయాల చట్టం కింద ప్రసూతికి ముందూ వెనుక కూడా రెండు మాసాలు ఉండాలని అంతర్జాతీయ కార్మిక సమావేశంలో తీర్మానించిన సంగతిని సభ్యులు ప్రస్తావించారు.

1945 మార్చి 29న శాసనసభలో ప్రవేశపెట్టబడిన 1941 గని కార్మికుల ప్రసూతి సదుపాయ(సవరణ) బిల్లు సెలెక్ట్ కమిటీ సవరణలతో, సూచనలతో తిరిగి 1945 ఏప్రిల్ 11 న చర్చ లోకి వచ్చింది. ప్రసవానంతరం నాలుగు వారాల సెలవును సెలక్ట్ కమిటీ 36 వారాలకు పెంచింది. 36 వారాల కాలంలో నాలుగు వారాల నుంచి 26 వారల వరకు పూర్తి నిషేధ కాలంగా పది వారాలను పాక్షిక నిషేధ కాలంగా నిర్ణయించింది. పని ప్రాంతంలో శిశు నిలయం లేకపోతే ఆ కాలంలో వాళ్ళు భూగర్భంలో నాలుగు గంటలను మించి పనిచేయనక్కరలేదు. ఈ సౌకర్యాలు పొందటానికి మొదటి షరతు ప్రసవానికి ముందర ఆరు నెలలలో 90 రోజులు భూగర్భంలో పనిచేసి ఉండాలి. ప్రసూతి ప్రయోజనం పొందే మహిళలకి వేతనం రోజుకు పన్నెండు అనాలని కాక వారానికి ఆరురూపాయలుగా సవరించింది. అందువల్ల రోజుకు దాదాపు పద్నాలుగు అణాలు వేతనం పొందుతారు. ఇది అంతకు ముందు ప్రతిపాదనలకన్నా ఎక్కువ. ప్రసూతిసెలవు ప్రయోజన వినిమయ కాలాన్ని అధీకృత సెలవుగా ప్రకటించటం ద్వారా ఆ కాలంలో మహిళా కార్మికుల తొలగింపుకు అవకాశం లేకుండా చేసింది సెలక్ట్ కమిటీ. భూగర్భంలో ప్రసవానంతరం 36 వారాల వరకు పని చేయటాన్ని నిషేధించిన సెలక్ట్ కమిటీ మొదటి నాలుగువారాల సెలవు తరువాత ఇతరత్రా పనిచేసి ఆదాయం పొందే వెసులుబాటు ఇచ్చింది.

## బొగ్గు గనుల లోపలి పనులకు స్త్రీల నియామక నిషేధ చట్టాల వివాదం

బొగ్గు గనుల లోపలి పనులకు స్త్రీలను నియమించటం, నిషేధించటం అనే రెండు అంశాల మీద చట్ట సభలో చర్చలు తరచు జరగటం చూస్తాం. భారతదేశం బొగ్గు గనుల లోపలి పనులకు స్త్రీలను నియమించడంపై నిషేధాన్ని ఎత్తివేయటాన్ని గురించి 1944 ఫిబ్రవరి 8న లెజిస్లేటివ్ అసెంబ్లీ లో జరిగిన చర్చలో అంబేద్కర్ సుదీర్ఘంగా తన వాదాన్ని వినిపించాడు. బొగ్గు గనుల లోపలి పనులకు స్త్రీలను నియమించటం, నిషేధించటం మధ్య వైరుధ్యాల చరిత్రను ఆయన వివరించాడు. 1939 నుంచి ఇది చర్చలో ఉంది అన్నట్లు మాట్లాడిన సభ్యులకు – భారత బొగ్గు గనుల చట్టం సవరణ బిల్లు ప్రవేశపెట్టబడిన

సందర్భంలో 1923 లో తొలిసారి ఈ చర్చ మొదలైందని గుర్తు చేశాడు. బొగ్గు గనులలో రక్షణ ప్రమాణాల మెరుగుదల గురించి ప్రవేశ పెట్టబడిన ఆ బిల్లును సెలక్ట్ కమిటీ పంపినప్పుడు గనులలలో స్త్రీలతో పని చేయించటాన్ని నిషేధిస్తూ చట్టానికి మరికొన్ని అధికారాలు ఇయ్యవచ్చునని సూచన వచ్చిందని, భారత ప్రభుత్వం దానిని అంగీకరించి స్త్రీల నియామకాన్ని తగ్గించేందుకు నియమావళి రూపొందించి, అది ఇంకా సభలో ఆమోదించబడటానికి రెండేళ్ల ముందునుండే ఆ దిశగా కార్యక్రమాలు తీసుకొందని చరిత్రను వివరించాడు. ఇప్పుడీ నిషేధాన్ని ఎత్తివేయాలని భారతప్రభుత్వం భావించటం నిందకు గురవుతున్నదని చెప్పి నిషేధం ఎత్తివేయటం ఎందుకు అవసరమో వివరించాడాయన బొగ్గు అత్యవసర పారిశ్రామిక వస్తువు. సాధారణ జన వినియోగ వస్తువు కూడా కావటం, దాని ఉత్పత్తిని పెంచవలసిన అవసరం తప్పనిసరి కావటం దృష్ట్యా ప్రభుత్వం గనులలో స్త్రీల ప్రవేశం మీద ఉన్న నిషేధాన్ని ఎత్తివేయటాన్ని ఉద్దేశించిందని వివరించాడు.

బొగ్గు కొరత కార్మికుల కొరత కారణంగా ఈ నిర్ణయం తప్పనిసరి అయిందని చెప్తూ కార్మికుల కొరతకు భారత ప్రభుత్వం ప్రారంభించిన 'అధిక ఆహారోత్పత్తి ప్రచారం', సైన్యం పనులలో ఉపాధి అవకాశాలు పెరగటం కారణమంటాడు. బొగ్గు గని కార్మికులు చాలావరకు వ్యవసాయ రంగం నుండే వచ్చినవాళ్లు కావటం ఆహారధాన్యాల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో వ్యవసాయం వైపు మళ్లటం సహజం అనీ అదే విధంగా అధిక ఆదాయంపై ఆశ కార్మికులను సైన్య సంబంధ ఉద్యోగాల మీద ఆసక్తి చూపించేలా చేస్తున్నదని చెప్పి ఈ పరిస్థితులలో స్త్రీలను గనులలో పనికి అనుమతించటం అవసరం అవుతుందని, సమాన పనికి సమాన వేతనం అనే సూత్రం అమలు చేయటం, ఐదడుగుల లోతున్న గనులలోకి దిగాల్సిన అవసరం లేకుండా పనుల కేటాయింపుకు జాగ్రత్త తీసుకొనటం జరుగుతూనే ఉన్నదని యుద్ధ కాలపు తాత్కాలిక ఏర్పాటు ఇదని ఆ బిల్లుకు అనుకూలంగా వాదన వినిపించాడు.

1944 ఫిబ్రవరి 7న, 16న శాసనాసభా చర్చలలో బొగ్గు గనులలలో స్త్రీ కార్మికుల ప్రవేశం మీద ప్రశ్నోత్తరాల సెషన్ జరిగింది. బొగ్గుగనులలలో స్త్రీ కార్మికులను తిరిగి ప్రవేశ పెట్టటం,బొగ్గు గనులలలో స్త్రీ కార్మికుల రద్దుకు ప్రజల ఒత్తిడి, స్త్రీ పురుష కార్మికులకు సమానవేతనం, వంటి వాటిమీద వచ్చిన ప్రశ్నలకు అంబేద్కర్ కేంద్ర పరగణాలైన బీరార్, బెంగాల్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలలలో బొగ్గు గనుల లోపల పని చేయటానికి ఇప్పుడు అనుమతిస్తున్నారని, బొగ్గు గనులలోకి స్త్రీల ప్రవేశ నిషేధం 1923 చట్టంలో ప్రస్తావనకు వచ్చిందని, దానికి కట్టుబడి భారత ప్రభుత్వం 1929 నుంచి గని పనులనుంచి స్త్రీలను మినహాయిస్తూ 1937 నాటికి ఆ ప్రక్రియను పూర్తి చేసిందని, అయితే ఇప్పుడు పురుష కార్మికుల తీవ్ర కొరతవల్లనే స్త్రీలను గనులలో పనిచేయటానికి అనుమతించవలసి వచ్చిందని చెప్పాడు. పురుష కార్మికులతోనే అవసరానికి తగినంత బొగ్గు ఉత్పత్తి అయితే స్త్రీలను తీసుకో బోమని చెప్పాడు. అప్పటికే ఇతర ప్రాంతాల నుంచి కార్మికులను తెప్పించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు పేర్కొన్నాడు. ఆరోగ్యం పాడవుతున్నప్పటికీ కుటుంబాలు చితికి పోతున్నప్పటికీ ఎక్కువ కష్టం చేస్తూ తక్కువ కూలీకి తృప్తి పడతారనా స్త్రీ కార్మికులను తీసుకొంటున్నారు అన్న నిష్ఠుర పూర్వక ప్రశ్నకు కాదు అన్నది ఆయన సమాధనం. స్త్రీ పురుషులకు కలిపి జంట కూలీ ఇచ్చే పద్ధతి అమలవుతున్నప్పుడు సమానవేతనం సమస్యకు స్థానం ఉండదు కదా అని సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన దగ్గర జవాబు లేకుండింది.

1944 మార్చి 30న బొగ్గు గనుల భూగర్భంలో మహిళల ఉపాధి అనే అంశం మీద సభ్యులు అడిగిన ప్రశ్నలకు అంబేద్కర్ సమాధానం ఇచ్చాడు. బొగ్గు గనులలో పనిచేసే వారికి ఆహార దినుసులు తక్కువ ధరకు అందించబడుతున్నాయని, బొగ్గు గనులలో అవసరమైనంత మంది పురుషులు దొరకకపోవటం వల్లనే స్త్రీలను అనుమతించటం జరుగుతున్నదని, గనులలో పని పరిస్థితులను, కార్మికుల జీవన పరిస్థితులను మెరుగు పరచటానికి, తగిన వేతనం చెల్లించటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, యంత్రాంగం బ్రిటన్, అమెరికాలలో వలే పురోగమిం చలేదు కానీ ఇతర దేశాలతో పోల్చినప్పుడు రక్షణ ఏర్పాట్లు ఇక్కడ ఎక్కువ అని చెప్పుకువచ్చాడు.

1944 ఏప్రిల్ 15న శాసన సభాచర్చలలో భారతప్రభుత్వ కార్మిక విధానం గురించి మాట్లాడుతూ అంబేద్కర్ అందులో భాగంగా బొగ్గు గనులలలో మహిళలను ప్రవేశపెట్టటం గురించి రాధా సుబ్బరాయన్ ప్రస్తావించిన అంశాలకు సమాధానంగా బొగ్గు ఉత్పత్తిని పెంచే ఉద్దేశంతో బొగ్గు గనులలోకి కార్మికులను ఎక్కువగా తీసుకొనే అవకాశాలన్నిటినీ వినియోగించుకొంటా నని, అందులో భాగంగానే మహిళలను గని లోపలి పనులకు తీసుకొనటం జరుగుతున్నదని అని చెప్పాడు. త్వరలో నిషేధాన్ని తిరిగి ప్రవేశ పెట్టటానికి ప్రయత్నిస్తానని మాట ఇచ్చాడు.

1944 నవంబర్ 10 ప్రశ్నోత్తరాల సెషన్ లో అంబేద్కర్ బొగ్గు గనులలలో శ్రామిక కొరతకు కొంతవరకు సైనిక కాంట్రాక్టర్లు కూలీలలను ఎక్కువ వేతనం మీద నియమించటం కార్మికులకు ఇస్తున్న వేతనాలకు పెరుగుతున్న జీవనవ్యయాలకు పొంతన కుదరకపోవడం కారణాలని పేర్కొన్నాడు. 1943 నుంచి బేవార్, బెంగాల్, బీహార్, ఒరిస్సా గనులలో పురుష కార్మికుల సంఖ్య తగ్గటం వల్ల గనుల భూగర్భ పనులకు మహిళలను తీసుకోవాల్సి వచ్చిందని, బొగ్గు ఉత్పత్తి తగినంత పెరగగానే వీలయినంత త్వరలో మళ్ళీ గనులలోకి స్త్రీల ప్రవేశాన్ని

నిషేధించటం జరుగుతుందని నొక్కి చెప్పాడు. ఒక ప్రశ్నకు జవాబుగా అప్పటికి 16 వేలమంది స్త్రీలు గనులలలో పనిచేస్తున్నారని పురుషులతో సమానవేతనం – ఉచిత బియ్యం రాయితీ ఇస్తున్నట్లు రోజుకు 12 నుంచి 15 అణాల వరకు కూలీ ఉంటుందని చెప్పాడు. అయిదున్నర అడుగుల లోతుకు ఎక్కువగా వున్న చోట స్త్రీలను నియమించే చట్టం లేదని గనుల ప్రసూతి సౌకర్యాల ప్రయోజనాలు అమలవుతున్నాయని చెప్పాడు. యుద్ధవాసరాల పేరుచెప్పి ఏ దేశంలో లేనిది ఇక్కడ స్త్రీలను భూగర్భ పనిలోకి పంపించే అవమానకరమైన పనిలో భాగస్వాములయ్యారని సభ్యులు నిలదీసినప్పుడు బొగ్గు కొరత తక్షణం పరిష్కరించవలసిన సమస్య కనుక ఇదొక మార్గంగా ఎంచుకోవటం అనివార్యమైనదని సమాధానం ఇచ్చాడు. జీవన వ్యయానికి తగ్గట్లు వేతనాల పెంపుకు, ఆహార పదార్థాల సరఫరాలో రాయితీ ఇయ్యటానికి 1943 డిసెంబర్‌లో ధన్ బాద్‌లో జరిగిన పారిశ్రామికవేత్తల సమావేశం నిర్ణయం తీసుకొన్నట్లు చెప్పి వాటి అమలుకు ప్రయత్నిస్తున్నది ప్రభుత్వం అని తెలియచేసాడు.

1944 నవంబరు 20న సభలో రేణుకా రే బొగ్గు గనులలలో పనిచేసే స్త్రీల పరిస్థితుల గురించి నిష్పాక్షిక అధ్యయనం జరపటానికి అఖిల భారత మహిళా సభ వేసిన దర్యాప్తు కమిటీకి అనుమతి ఎందుకివ్వలేదని ప్రశ్నించింది. సమయం తగినది కాదని ఆయన జవాబు. అదే సమయంలో రేగే కమిటీకి ఆరోగ్య సర్వే కమిటీకి అనుమతిచ్చి స్త్రీ సంక్షేమాన్ని కోరే అఖిల భారత మహిళా సభకు అనుమతివ్వకపోవటం వివక్షగా ఆమె అభిప్రాయపడింది. రేణుకారే కు మద్దతుగా యెన్ ఏం జోషీ వంటివాళ్ళు చర్చలో పాల్గొన్నారు.

అదే రోజు రేణుకా రే గనులలలో స్త్రీల పని నిషేధాన్ని పునరుద్ధరించడం గురించి ప్రశ్న లేవనెత్తింది. ఇంతకు పూర్వం వాగ్దానం చేసిన ప్రకారం బొగ్గుగని బావులలో స్త్రీలు పనిచేయటాన్ని ప్రభుత్వం ఎప్పుడు నిషేధిస్తుంది అని అడిగింది. బొగ్గుబావులలో పనికి స్త్రీలను చేర్చుకొన్న తరువాత పెరిగిన ఉత్పత్తి ఎంతని ఆమె ప్రశ్న. బొగ్గు ఉత్పత్తి కావలసిన మేరకు పెరిగిన తరువాత నిషేధాన్ని పునరుద్ధరించటానికి ప్రభుత్వం ఆతృతగా ఉందని, స్త్రీల నియామకం తరువాత ఉత్పత్తి పెరిగిందని అందుకు ఇతరేతర కారణాలు ఉండటం వల్ల ప్రత్యేకించి స్త్రీల చేరిక వల్ల ఎంత పెరిగిందో చెప్పలేం అన్నాడు. నిషేధాన్ని తిరిగి ప్రకటించటానికి ప్రభుత్వం దృష్టిలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం ఎంత అన్న ప్రశకు అంబేద్కర్ జవాబు 'తెలియదు' అని.

రేణుకా రే గనులలో స్త్రీల నియామకం వల్ల ఉత్పత్తి స్వల్పంగానే పెరిగిందని, దానికోసం ప్రభుత్వం అంతర్జాతీయ నియమావళిని, నైతిక మర్యాదను ఉల్లంఘించటం సమంజసమా అని ప్రశ్నించింది. గనులలో పురుష కార్మికులు బొగ్గును పగలగొడుతుంటే స్త్రీ కార్మికులు తొట్టిని నింపుతారని, అది నెమ్మదిగా జరుగుతుండటంతో పురుషకార్మికుల పనివేగానికి దీటుగా ఉండక పోవడంతో పురుష కార్మికులు పని ఆపుకోవలసి వస్తున్నదని చేసిన అభియోగం పై అంబేద్కర్ అందు లోని నిజానిజాల గురించి తానప్పుడు ఏమీ చెప్పలేనని అన్నాడు.

1945 ఫిబ్రవరి 9న ప్రశ్నోత్తరాల సమయంలో గనుల లోపల స్త్రీలు పనిచేయటంపై ఉన్న నిషేధాన్ని తిరిగి విధించటం గురించి ప్రభుత్వం ఏమి ఆలోచిస్తున్నది? ప్రస్తుతం గనులలలో పనిచేస్తున్న స్త్రీలు ఎంత మంది ? గనులలో పని చేసేటప్పుడు స్త్రీలు సభ్యతగా వస్త్రధారణ చేసుకొనే వీలులేదు కనుక ఆ దృష్ట్యా ఆ పనిలోకి స్త్రీల ప్రవేశాన్ని నిషేదించటమే భావ్యం కదా? అన్న ప్రశ్నలు వచ్చాయి. నిషేధాన్ని తిరిగి విధించటం గురించిన సమీక్ష జరిగింది కానీ పరిస్థితులు అనుకూలించాలి అని చెప్పి గనుల లోపల, బయట పనిచేసే స్త్రీలకు సంవత్సరానికి రెండు చీరెలు తక్కువధరకు ఇస్తున్నారని, కొన్నిచోట్ల ఉచితంగా ఇస్తున్నారని చెప్పాడు. దానికి సభ్యులు కట్టుకొనటానికి వాళ్లకు చీరెలు లభిస్తున్నాయా లేదా అన్నది అసలు విషయమే కాదని, గనులలలో వాళ్ళసలు చీర కట్టుకొనటమే సాధ్యపడదని అభ్యంతరం తెలిపారు. పరిస్థితులు అనుకూలించటం అంటే ఏమిటి? ఆ పరిస్థితులు ఏమిటి? ఎప్పుడు అనుకూలిస్తాయి ? అన్న ప్రశ్నలకు అంబేద్కర్ అవి తన అధీనంలో లేవని చెప్పాడు.

అదే రోజు గనుల భూగర్భంలో పనిచేసే స్త్రీ కార్మికుల గురించి ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నలకు జవాబిస్తూ అంబేద్కర్ 1942 లో స్త్రీ కార్మికులు ఎవరూ చేరలేదని 43లో 7,000 మంది, 44లో 16000 మంది గనులలలో పనిచేసారని సమాచారం ఇచ్చాడు. నిండు చూలాళ్లను గనిగర్భంలో పనికి నియమించటం వల్ల గని గర్భంలోనే పిల్లలు పుడుతున్నారన్న ఆరోపణను ఖండిస్తూ ఇంత వరకు అలాంటి ఘటన జరగలేదని, ఆ విషయంపై ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, ఏడవ నెల గర్భంలో స్త్రీలు గనులలో పనిచేయటాన్ని నిషేధించే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉన్నదని పేర్కొన్నాడు.

అయితే గనుల భూగర్భాలలో స్త్రీల నియామకంపై నిషేధాన్ని ఎత్తివేయటం పట్ల దేశంలో ఎంత వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ అనుకూలమైన చర్య ఏదీ ఇంత వరకు చేపట్టలేదన్న ఆరోపణతో 1945 మార్చి 13న శాసనసభా చర్చలలో రేణుకా రే ఈ అంశం మీద చర్చ ప్రారంభించింది. అఖిల భారత మహిళా సమావేశం అభ్యర్ధన మేరకు నిషేధం తిరిగి విధించాలని ప్రతిపాదించింది. దాని మీద అంబేద్కర్ సుదీర్ఘంగా తన వాదన వినిపించాడు. ఇది ఒక రకంగా ఇంతకు ముందు చేసిన వాదన వంటిదే. ఈసారి బొగ్గు ఉత్పత్తిలో, కార్మికుల సంఖ్యలో మరీ ముఖ్యంగా బొగ్గు తవ్వటానికి నియమించబడిన కార్మికుల

సంఖ్యలో తగ్గుదలను గణాంకాలతో వివరించాడు. ఇదివరకు లాగానే ఈ తగ్గుదలకు బొగ్గు గనిలో కన్నా ఎక్కువ వేతనాలకు లభిస్తున్న ప్రత్యామ్నాయ ఉద్యోగాల లభ్యత, ఇతర పనులలలో తనతో పాటు భార్యకు అవకాశం ఉండటం కారణాలని పేర్కొన్నాడు. అందువల్ల బొగ్గు తవ్వకం పనికి కార్మికులను ఆకర్షించటానికి గనులలలో స్త్రీల నియామకం మీద ఉన్న నిషేధమే అవరోధం అవుతున్నప్పుడు ఆ నిషేధం ఎత్తివేయటమే ఇప్పటి అవసరం అని అభిప్రాయపడ్డాడు. గని భూగర్భ కార్మికుల పని చేసే వాతావరణం స్త్రీలకు అనుకూలం కాదు కనుక గనులలలో వాళ్ళ నియామకాన్ని నిషేధం అవసరం అంటున్నాము కానీ నిషేధం వల్ల వల్ల గృహ పరిస్థితుల మీద పడే ప్రభావం తీవ్రమైంది అంటాడాయన.

గని గర్భాలలో స్త్రీల పని నిషేధం గురించి శాసనసభా సభ్యులు పదేపదే ప్రశ్నలువేయటం, అది నిరంతర పరిశీలనలో ఉందని అంబేద్కర్ చెప్పటం పరిపాటి అయింది.(1945, మార్చి 16) మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం అన్ని గనుల్లోనూ ఒకే రకమైన ఏర్పాట్లు చేయాటానికి పరిశీలిస్తున్నదని అంబేద్కర్ అంటే అందుకే స్త్రీలను భూగర్భ పనులలలో నియమించటానికి సభ వ్యతిరేకించిందని సభ్యులు ప్రతి సమాధానం ఇచ్చినప్పుడు అంబేద్కర్ సభానిర్ణయం ఔచిత్య నిర్ణయంగా కాక రాజకీయ పథకంగా ఉన్నట్లు అభిప్రాయపడ్డాడు. ఈ విధంగా అంబేద్కర్ రాధా సుబ్బరాయన్, రేణుకా రే వంటి మహిళా సభ్యుల నుంచి, ఎన్.జి.రంగా వంటి ఇతర సభ్యుల నుంచి సభలో తరచు ప్రశ్నలను ఎదుర్కోవలసి వచ్చింది.

తన వివరణలు, వాదనలు వినటా నికి అసహనం చూపుతూ తనను నిర్దయుడైన పెట్టుబడిదారీ యజమానిగా, శ్రామిక మహిళా వ్యతిరేకిగా దోషిని చేస్తూ బోనులో నిలబెట్టినట్లు మాట్లాడే సభ్యులకు సహనంతో సంక్షిప్తంగా సూటిగా సమాధానం చెప్పే పని చేసాడు అంబేద్కర్. ఒక్కొక సారి తగిన సమాచారం తన వద్ద లేదనో, పరిశీలిస్తామనో చెప్పి ఊరుకొనటం జరిగేది. ఈ పదునైన చర్చలు, ప్రశ్నలు, వివరణలు, సమాధానాలు శాసనసభా సభ్యులకు ప్రభుత్వ భాగస్వామికి జరిగినవి కనుక ప్రజాభిప్రాయం, చట్టాలకు సంబంధించిన సంప్రదాయానికి, నైతికతకు అధికార ప్రభుత్వ ప్రయోజనాలకు మధ్య ఘర్షణగా మాత్రమే మనకు అర్థం అవుతాయి. అసలు బొగ్గు గనులలో పనిచేసిన మహిళల అవసరాలు, పరిస్థితులు, వేతనాల వ్యవస్థ డా.బాబాసాహెబ్ అంబేద్కర్ రచనలు- ప్రసంగాలు (సంపుటం 2) ఎటువంటివో, వాటి గురించి మహిళలు ఏమనుకున్నారో అది ప్రస్తుతానికి విస్మృత చరిత్రే. ❑

**(కొలిమి సౌజన్యంతో)**

# రాహుల్ సాంకృత్యాయన్‌ను చూసి ఎవరు భయపడుతున్నారు?

**(21వ పేజీ తరువాయి)**

ఆధునిక భావజాలాన్ని స్వీకరించారు. బౌద్ధ సన్యాసిగా మారిన తరువాత ఆయన "రాహుల్ సాంకృత్యాయన్" అనే పేరును స్వీకరించారు. టిబెట్, శ్రీలంక, సోవియట్ రష్యా వంటి దేశాల్లో విస్తృతంగా పర్యటించి ప్రపంచవ్యాప్తంగా గౌరవాన్ని సంపాదించారు. 1922లో గాంధీ ఉద్యమంలో పాల్గొని తొలిసారి జైలుకు వెళ్లారు. అనంతరం 1938లో కిసాన్ సభలో చేరి అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షుడిగా పనిచేశారు. రైతాంగ పోరా టాల్లో పాల్గొంటూ పలుమార్లు జైలుశిక్ష అనుభవించారు. 1939లో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ముంగేర్ యూనిట్ స్థాపక సభ్యుల్లో ఒకరిగా ఉన్నారు. ఈ చరిత్ర అంతా విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారికి తెలుసా? లేక ఇది కేవలం వామపక్ష సమావేశాలు జరిగే ప్రదేశాన్ని లక్ష్యంగా చేసుకున్న అర్థరహిత విధ్వంసమా? అనే ప్రశ్న తలెత్తుతుంది.

**ఆర్ఎస్ఎస్ వైరం**

ఆర్ఎస్ఎస్ భావజాలానికి వామపక్షం ప్రధాన శత్రువుగా మారిందనే విషయం స్పష్టంగా కనిపిస్తోంది. అందువల్ల పశ్చిమ బెంగాల్‌లో కూడా వామపక్ష ప్రజాచిహ్నాలు లక్ష్యంగా మారే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో రాహుల్ సాంకృత్యాయన్ ఆలోచనలు మరింత ప్రాసంగికంగా మారాయి. "రామ రాజ్య ఔర్ మార్క్స్‌వాద్" అనే తన రచనలో సనాతనవాదులు చారిత్రక భౌతికవాదంపై చేసిన విమర్శలకు ఆయన ఇచ్చిన సమాధానాలు నేటికీ ప్రాముఖ్యమైనవే. మత విశ్వాసం పేరుతో దోపిడీని "మాయ"గా, ధనికులకు లొంగిపోవడాన్ని విధిగా, బ్రాహ్మణాధిపత్యాన్ని ధర్మంగా, సతీ సహగమనాన్ని స్త్రీ కర్తవ్యంగా సమర్థించే భావజాలాన్ని ఆయన తీవ్ర వ్యంగ్యంతో ఖండించారు. నేడు మతోన్మాదం, అహేతుకత ద్వారా ప్రజల ఆలోచనా స్వేచ్ఛను బంధించే ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో రాహుల్ సాంకృత్యాయన్ ఆలోచనలు మరింత అవసరమవుతున్నాయి. అందుకే ఫాసిస్టు శక్తులు మహాపండితుడు రాహుల్ సాంకృత్యాయన్ ప్రతినిధ్యం వహించే స్వేచ్ఛా మానవ మేధస్సును చూసి భయపడుతున్నాయి. ❑


*(రాణీగంజ్ విగ్రహ చరిత్రకు సంబంధించిన వివరాలు అనుప్ మిత్ర రాసిన బెంగాలీ వ్యాసం ఆధారంగా సేకరించబడ్డాయి. ఆ వ్యాసం 2026 జూలై 17న 'దేశ్-హితైషీ'లో ప్రచురితమైంది.)*




మెదడు మేల్కొంది

తరం మారింది









ఫ్రాండ్.. సౌండ్


కార్టూన్స్ : సతీష్ ఆచార్య


RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)
Vol : 4 - Issue No : 10 Online Edition July 2026

# కొత్త పుస్తకాల స్వీకారం




ప్రతులకు..
ప్రజాశక్తి
బుక్ హౌస్,
విజయవాడ